www.jagritiweekly.com

సంపుటి : 77 సంచిక : 37 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు ఆషాఢ శుద్ధ ద్వాదశి

07-13 జులై 2025

వెల : ₹20/-



## మంచుముత్యాలు

పెహల్గామ్ కన్నీళ్ల వెచ్చదనం..
ఆపరేషన్ సిందూర్ అగ్నికణం..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




# భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపులు

గత 12 సంవత్సరాలుగా మేము జంటనగరాలలో 14 కు పైగా ఉన్న మా భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపుల ద్వారా అందిస్తున్న సేవలను షుమారు నెలకు 20,000 మందికి పైగా ప్రజలు వినియోగించుకుంటూ, ప్రతి నెలా కోటి రూపాయల వరకు ఆదా చేసుకుంటున్నారు. మా వద్ద షుగర్, బి.పి., గ్యాస్ ట్రబుల్, గుండె జబ్బు, నరాల బలహీనత, ఎలర్జీ మొదలైన రోగాలకు మరియు కాల్షియం, విటమిన్‌లకు సంబంధించిన షుమారు 600 రకాల జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయి. మేము నాణ్యమైన మందులు మరియు సిప్లా, ఎలంబిక్, ర్యాన్‌బ్యాక్సీ, అబ్బోట్ వంటి ప్రముఖమైన కంపెనీల మందులను మాత్రమే అమ్ముతున్నాము.

## Rate Chart of Few Generic Medicines

| S.No. | Brand Name | Company Price | Generic Brand Name | Generic Medicine | Prescribed Price | BVP Price |
|---|---|---|---|---|---|---|
| 1 | Amaryl 2 (10's) | 166.64 | Glimicut-2mg (10's) | Glimipride 2mg | 62 | 10 |
| 2 | Rosuvas-10mg (10's) | 210 | Rosu-HDL (10's) | Rosuvastatin 10mg | 185 | 34 |
| 3 | Clopitab-75 (10's) | 85 | Clopizen 75mg (10's) | Clopidogrel 75mg | 77.50 | 18 |
| 4 | Telma-40 (10's) | 96.39 | Telmiwock 40mg (10's) | Telmisartan 40mg | 72.57 | 19 |
| 5 | Shelcal (15's) | 131 | Sheldeal (15's) | Calcium Carbonate 500mg+D3 | 90 | 17 |
| 6 | Pantop-40mg (10's) | 155 | Pantosec 40mg (10's) | Pantoprazole 40mg | 130.51 | 26 |
| 7 | Zincovit (15's) | 105 | Zincotop (15's) | B Complex with Vitamins | 81 | 47 |
| 8 | Amlopres-AT (10's) | 34.96 | Amlip AT (10's) | Amlodipine+Atenolol | 72.60 | 12 |
| 9 | Augmentin Duo 625 (6's) | 126.70 | Megamentin 625mg (6's) | Amoxycillin+Potassium Clavulanate | 96 | 71 |
| 10 | Pregalin-m-75mg (10's) | 174 | Pregabanyl (10's) | Pregabalin+Mehylcobalamin | 130 | 42 |
| 11 | Glycomet-gp1 (10's) | 100.50 | Glymp M1 (10's) | Glimipride+Metformin | 96.25 | 12 |

* రూ. 500/- ఆపై విలువగల ఆర్డర్‌లకు డోర్ డెలివరీ ఉచితం *

KOTI - 93929 36187 • MOOSAPET - 78936 45599 • PADMARAO NAGAR - 88859 69292 • KPHB ROAD #4 - 93917 99239
MADHURA NAGAR - 93929 36185 • VIVEKANANDA NAGAR COLONY - 93919 07080 • CHANDA NAGAR - 93919 16073
S.R. NAGAR - 93919 04207 • MALKAJGIRI - 040-35490428 • CHIKKADPALLY - 93919 03805 • MUSKIPET - 040-35102572
SANTOSH NAGAR - 72070 57737 • KUKATPALLY - 93914 24994 • SHANTINAGAR - 040-35166998

For any Enquiries & Other Shops Details, Contact Manager: 93905 08904 / 74160 57751
e-mail: agm@bvpgenerics.org, mngr.ops@bvpgenerics.org.



# జై జగన్నాథ.. జై బలదేవ.. జై సుభద్ర..!

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పూరీ జగన్నాథ రథయాత్ర జూన్ 27న అంగరంగవైభవంగా ప్రారంభమైంది. యాత్రకు శ్రీకారం చుట్టే ఆధ్యాత్మిక ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించి, తరించిపోవడానికి 12 లక్షల మందికి పైగా భక్తులు యాత్ర సాగే మార్గంలో బారులు తీరారు. 'జై జగన్నాథ.. జై బలదేవ.. జై సుభద్ర..' అంటూ భక్తజనం చేసిన నినాదాలతో పూరీ పురవీధులు ప్రతిధ్వనించాయి. ఉత్సవంలో భాగంగా స్వామి జగన్నాథుడు తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో ప్రధాన ఆలయం నుంచి గుండిచా ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ కొంతకాలం ఉన్న తర్వాత బాహుదా యాత్ర ద్వారా ప్రధాన ఆలయానికి తిరిగి వస్తారు. దాదాపు 3 కి.మీ.లు మేర సాగిన ఈ యాత్రలో భక్తులు జగన్నాథుడి రథమైన నందిఘోష్, బలభద్రుడి రథం తాళధ్వజ, సుభద్రాదేవి రథం దర్పదళన్‌ను స్వయంగా లాగుతూ యాత్రను ముందుకు తీసుకొనివెళ్లారు. ఈ నేపథ్యంలో రథాలను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆనందపారవశ్యంలో మునిగితేలారు.





Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006l405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

అత్యవసర పరిస్థితి విధించి యాభయ్ ఏళ్లు గడిచాయి. స్వతంత్ర భారత చరిత్ర మీద దాని నీడ, జాడ ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. అది గర్వకారణమైన నిర్ణయం కాదు. ఆ చీకటియుగం మీద ఇంకా చర్చించవలసినదే ఎక్కువ. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌కార్యవాహ (ప్రధాన కార్యదర్శి) దత్తాత్రేయ హొసబలె సరైన సమయంలో ఒక చర్చకు పిలుపునిచ్చారు. పార్లమెంట్, మంత్రిమండలి, న్యాయవ్యవస్థ, పత్రికా రంగం– వీటిలో ఏవీ పెదవి విప్పే అవకాశం లేని పాడుకాలమే ఎమర్జెన్సీ. ప్రతిపక్షాలు మొత్తం కారాగారంలో ఉన్నాయి. అలాంటి నియంత పోకడల మధ్య జరిగినదే 42వ రాజ్యాంగ సవరణ. 38, 39 రాజ్యాంగ సవరణలు కూడా ఆనాడే జరిగాయి. 42వ సవరణ మేరకే రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్', 'సెక్యులరిస్ట్' అన్న పదాలు చేరాయి. అలాంటి చీకటియుగంలో రాజ్యాంగంలోకి చొరబడిన ఈ పదాలకు ఉన్న విలువ చర్చనీయాంశమే అవుతుంది. దాని కోసమే పిలుపునిచ్చారు హొసబలె. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో ఈ పదాలు లేవు. అసలు ఆయన ఆలోచనలలోనే లేవు.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠిక సోవరిన్ సోషలిస్ట్ సెక్యులర్ డెమాక్రటిక్ రిపబ్లిక్ అని భారత్‌ను పేర్కొన్నది. జూన్ 25, 1975న అత్యవసర పరిస్థితిని రుద్దారు. 1976లో ఈ సవరణ జరిగింది. ఈ సవరణ, దీని ఉద్దేశం, ఆ రెండు మాటలు చేర్చడం గురించి సరైన చర్చ జరగలేదన్నదే ఎక్కువ మంది అభిప్రాయం. సోషలిస్ట్ అన్న పదం వల్ల విధాన నిర్ణయాలకు సంకెళ్లు పడతాయన్నది పూర్వం నుంచి ఉన్న వాదన. సెక్యులర్ అన్న పదంతో హిందుత్వ వారసత్వం అనే భావనను పలచన చేశారని హిందువుల ఆవేదన. రాజ్యాంగ రచన జరిగిన పాతికేళ్ల తరువాత ఈ రెండు పదాలను చొప్పించడం వెనుక దురుద్దేశమే ఉందని ఆర్‌ఎస్‌ఎస్ సహా చాలా హిందూ సంస్థలు ఆది నుంచి అనుమానిస్తున్నాయి. నిజానికి వారి అనుమానమే నిజమైంది. ఇవాళ సెక్యులరిజం అంటే జనం ఈసడించుకునే వాతావరణం ఉంది. ఇందులో సర్వధర్మ సమభావన కంటే, మైనారిటీల బుజ్జగింపునకు రాజమార్గం ఏర్పరిచింది. ఈ పదాలను ఇలా నియంతృత్వం చాటున పీఠికలో చేర్చడం ఒకటి.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు ఆషాఢ శుద్ధ ద్వాదశి**

## లోపలి పేజీలలో...




6లో
ముఖపత్ర కథనం
**మంచుముత్యాలు**

జాతీయం
**హిందూ జనాభా తగ్గుతోంది.. బహుపరాక్..!**



14లో

ప్రత్యేక వ్యాసం
**జ్ఞాన'జ్యోతు'లకు జోతలు**



21లో

# జాగృతి

## సంపాదకీయం

ఆ పదాలను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పూర్తిగా నిరాకరించడం మరొకటి. ప్రొఫెసర్ కేటీ షా ఆ పదాలను రాజ్యాంగంలో చేర్పించడానికి పలుసార్లు ప్రయత్నించారు. సెక్యులర్ అన్న పదం సర్వమత సమానత్వం గురించి భారత్‌కు ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన వాదన. ఆర్థిక అసమానతల నిర్మూలన పట్ల దేశానికి ఉన్న లక్ష్యం సోషలిస్ట్ అన్న పదం ద్వారా వ్యక్తమవుతుందని కూడా కేటీ షా అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాన్ని బలపరిచినవారూ ఉన్నారు. కానీ డాక్టర్ అంబేద్కర్ వారి వాదనతో ఏమాత్రం ఏకీభవించలేదు. సోషలిజం అన్న పదం ప్రజాస్వామ్యం అన్న భావనలోని సరళత్వాన్ని పలచన చేస్తుందనే

# హోసబలె పిలుపు!

అన్నారు. అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుందని కూడా కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇక రాజ్యాంగం ప్రాథమిక హక్కులను ప్రసాదిస్తున్నది కాబట్టి సెక్యులరిజం అన్న పదం వ్యర్థమేనని ఆయన భావించారు. నిజానికి భారత రాజ్యాంగమే మతాలకు అతీతంగా ఉందని స్పష్టం చేశారు. డాక్టర్ అంబేద్కర్ భావననే గౌరవిస్తూ 2015లో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ రెండు పదాలు లేని పీఠికను ప్రదర్శించింది. దీని మీద కొన్ని పక్షాలు గగ్గోలు పెట్టకుండా ఉండలేవు. కానీ దీని మీద చర్చకు సిద్ధం కావలసిందని ఆనాడే బీజేపీ సవాలు విసిరింది. భారత్‌లో అమలవుతున్నది సెక్యులరిజం కాదు, కుహనా సెక్యులరిజం మాత్రమేనని మొదటి నుంచి హిందూత్వ సంస్థలు ఆక్రోశిస్తూనే ఉన్నాయి. కుహనా సెక్యులరిజానికి మరొక వైపున కనిపించేదే మైనారిటీల బుజ్జగింపు. చిరకాలంగా కాంగ్రెస్ అనుసరిస్తున్నది సెక్యులరిజం కాదు, కుహనా సెక్యులరిజమే అని ప్రజలు అతి తొందరగా విశ్వసించారని చెప్పడానికి రుజువు లాల్‌కృష్ణ అడ్వాణి చేసిన అయోధ్య రథయాత్ర, దానికి వచ్చిన స్పందన.

సోషలిజం అన్న భావన వినడానికి సొంపుగానే ఉంటుంది. కానీ ఈ సిద్ధాంతాన్ని అమలు చేయడానికి ప్రపంచ దేశాలు నియంతృత్వ పోకడలను అనుసరించవలసి వచ్చింది. కొంత పురోగతి కనిపించినా దానిలో మానవత్వం లోపించడం వల్ల చేదు ఫలితాలను మిగిల్చింది. తూర్పు యూరప్, సోవియెట్ రష్యా పతనం తరువాత సోషలిజం అన్న పదం సొమ్మసిల్లి పోవడానికి కారణం కూడా అదే. సంక్షేమంలో ఇందిరకూ, మోదీకీ పోలిక తెస్తున్నవారు ఇదే గమనించాలి. సోషలిజం అంటూ బీజేపీ గొంతు చించుకోదు. కానీ గడచిన పదేళ్లలో ఆ పార్టీ ప్రభుత్వం సంక్షేమం మీద చేసిన ఖర్చు రూ. 34 ట్రిలియన్‌లు. సంక్షేమానికి నరేంద్ర మోదీ కొత్త దిశను చూపారు. సోషలిజం దేశం మీద రుద్ది ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు. ఆ దిగుమతి సిద్ధాంతాలు వ్యవస్థను ఒక చట్రంలో బంధించి ఉంచుతాయి. కాలానుగుణంగా అడుగువేయనీయవు.

ఎమర్జెన్సీ భారత జీవన విలువలకు గాయం చేసింది. సామాజిక, రాజకీయ రంగాలలో విధ్వంసం సృష్టించింది. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని నామమాత్రంగానే అంగీకరించారు. కానీ జాతికి క్షమాపణలు చెప్పలేదు. ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ సర్‌కార్యవాహ హొసబలె అడుగుతున్నది అదే. అలాంటి అత్యాచారాలకు కారణమైనవారే ఇప్పుడు రాజ్యాంగ ప్రతిని పట్టుకుని తిరుగుతున్నారని అన్నారు. ఎమర్జెన్సీ విధించినవారు మీ ముందుతరం వారే కావచ్చు, కానీ అందుకు మీరు క్షమాపణ చెప్పడం ఇవాళ్టి అవసరం అని కూడా హొసబలే స్పష్టం చేశారు. ఎమర్జెన్సీ విధించినందుకు భారత జాతికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పవలసిన అవసరం ఉంది. ★

07 జూలై 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**జననీ జన్మ భూమిశ్చ**

– కె.వి. సుమలత





| | | |
|---|---|---|
| రామచంద్రుడు కమల'నాథుడు' (తెలంగాణ) | – | 13 |
| కమల 'దళపతి' మాధవ్ (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| గాంధీల గ్రహణంలో నెహ్రూ ఉత్తరాయణం (చౌర్యం) | – | 18 |
| రణరంగ రోదసి (అంతరిక్షం) | – | 22 |
| శుక్లా ప్రయోగం.. వృద్ధులకు వరం (రోదసి) | – | 25 |
| తెగువ మాంచాల! (మహిళ) | – | 26 |
| ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంలో... (అంతర్జాతీయం) | – | 28 |
| చరిత్రకు అందనివి స్వీయ చరిత్రలు... (గళమెత్తిన గతం) | – | 32 |
| క్రీడా వ్యాఖ్యానం... సంపాదనకు సోపానం! (క్రీడ) | – | 43 |
| కనికరించిన కన్నప్ప! (సినిమా) | – | 50 |



# మంచు ముత్యాలు

## పెహల్గామ్ కన్నీళ్ల వెచ్చదనం..

అతడు ఆమె సమీపంలో నిద్రిస్తున్నట్టే ఉన్నాడు,
కానీ నిర్జీవి
అతడి ఆత్మసఖి హృదయం నుంచి నెత్తురు చిమ్ముతోంది
లయనూ, వేగాన్నీ కొలిచే మెట్రోనోమ్
బాధను దిగమింగే గొంతులోకి
తిరిగి ఒంపుతోంది.. టిక్ టిక్
కానీ దుఃఖానిదే అక్కడ రాజ్యం
అది గొంతు మీద భారంగా తిష్ట వేసింది
పదునెక్కిన దుఃఖాన్ని మింగడం అసాధ్యం
(మహువా సేన్)

ఏప్రిల్ 22న పెహల్గామ్ దగ్గరి బైసారన్ పచ్చిక బయళ్ల మీద ఒలికిన రక్తం భారతీయ హృదయాన్ని కలచివేసింది. వెంటనే కన్నెర్ర చేయించింది కూడా. ఫలితమే ఆపరేషన్ సిందూర్. దీనితో భారతీయ పౌరుషానికి కాస్త ఉపశమనం లభించింది. ఆ సమయంలో కలాలు స్పందించాయి. పైన ఉదహరించినది అలా వచ్చిన కవితలలో ఒకటి. జాతీయ భావం, జాతి గౌరవం, మానవత్వం నింపుకున్న తెలుగు

### సిందూరపు పరువెంత?

జగములేలే జగన్నాథుని బరువెంత
భక్తితో విడిచిన ఒక్క తులసీదళమంత!

బట్టలూడిన భారతీయుడి పరువెంత
హైందవీ మాత పాపిట సిందూరమంత!

సిగ్గులేక సిందూరాల్ని కడిగేసిన పాపమెంత
సింధునదీ పరీవాహక మంతా ఎండ బెట్టుకునేంత!

పాతిక ప్రాణాలకి బదులు దక్కించు దూరమెంత
అగ్ని ఆకాశ సమ శతఘ్నులు చేరుకునేంత!

పాపాల పాపిస్తానుల మూర్ఖత్వమెంత
పోయి మీ మోదీకి చెప్పుకో మనేంత...!

– దొడ్డిపట్ల కల్యాణ్‌కిషోర్

కం॥ పర్యాటకులకు ప్రీతగు
పర్యాటక కేంద్రమయ్యి పహల్గాముండన్
పర్యటనకు చని సుందర
పర్యంతభూమి తిరుగుచు ప్రజలుండగాన్!

తే.గీ. విజయ సిందూరమను పేర– వీర భార
తావనిన్ సాగెయుద్ధము; తావులేదు
మూర్ఖ ముష్కర మూకల– కర్కశంబు
నకును; యనుచుముందుకు –నడిచె సేన!

కం॥ బహవల్ పూర్ పాకిస్తాన్
బహు బల ముష్కర నివాస ప్రాంతాలన్నీ;
ముహురత కాలము లోనన్
బహుముఖ ప్రజ్ఞతో తునిమెను భారత్ సేనల్!

కం॥ సాంబా సెక్టారు జమ్మూ
బాంబుల మోతతో భయమున వణుకుచు నుండన్!
బాంబేవాసులు బలమున
బెంబేలు వలదని జనులు వేడ్కొను చుండెన్!

కం॥ జేజేలు పలికె భారత
మే; జే గేయమగునట్టి మేధిని క్షేమం
బే; జీవము మోకనియున్
రాజీలేని సమరమున రాణించంగాన్!

కవుల హృదయాలు కూడా స్పందించాయి. ఆచార్య ముదిగొండ శివప్రసాద్ రచన 'సిందూరం' ఆవిష్కరణోత్సవంలో (జూన్ 1,2025) పలువురు కవులు పెహల్గామ్ రక్తపాతానికి కలాలతో సమాధానం ఇచ్చారు. ఈ ఘాతుకం వెనుక ఉన్న మతోన్మాద, ఉగ్రవాద పాకిస్తాన్‌ను హెచ్చరించారు. గతంలో చైనా, పాక్‌లతో జరిగిన యుద్ధాల సమయంలో స్పందించిన కలాలను అనుసరించారు. చైనా యుద్ధం ఎందుకు? 'నేనే తప్పొనరించినాను వెధవన్నే శీర్షమెక్కించుకున్నానే..' అని వాపోయారు ఒక జాతీయవాద కవి. పాకిస్తాన్‌దీ ఇదే తతంగం. 'కాశ్మీర కుంకుమ మలదిన నా భారతి/ సిగబట్టి చిచ్చు రగిలించాలని/ పాక్ దుస్ససేనుడు పగటి కలలు కంటున్నాడు' అంటూ భారత్ యుద్ధ సమయంలో ఒక కవి గర్జించాడు. అలాగే 'మనుషులు కాదు మారణాయుధాలు/ ఆడుకుంటున్నాయి మంచు మీద ఈ రోజు' అని కూడా ప్రకటించాడు కవి (ఆచార్య ముదిగొండ శివప్రసాద్ సిద్ధాంత గ్రంథం 'ఉద్యమ దర్శనము' నుంచి).భారత్ వికాస్ పరిషత్, జాతీయ సాహిత్య పరిషత్ నిర్వహించిన ఈ కవితా పఠన కార్యక్రమంలో పెహల్గామ్ ఉదంతం తరువాత వర్తమాన కవి ఇలా స్పందించాడు, 'పాపాల పాపిస్తానుల మూర్ఖత్వ మెంత/ పోయి మీ మోదీకి చెప్పుకో మనేంత...' పాద పారాణి కూడా ఆరని నవ వధువు గుండె కోతను పై కవితలో మహువా సేన్ వినిపించారు. కశ్మీర్ నేల మీద పరుచుకున్న మంచు తివాసీ కింద పండిత్‌ల ఆక్రందనలను కూడా అంతా వినాలి. సూఫీ కవి అమీర్ ఖుస్రో ఒక సందర్భంలో ఏం రాశాడు! 'ఇలాతలం మీద స్వర్గం అంటూ ఉంటే/ ఇది అదే ఇది అదే ఇది అదే...'. మరి ఇప్పుడో... ఆ దుస్థితినే తెలుగు కలాలు ఆవిష్కరించాయి. అవధరించండి! మంచు మీద విరిసిన ముత్యాలే అయినా ఆ కవితలలోని కన్నీళ్ల వెచ్చదనం గమనించండి! ఆపరేషన్ సిందూర్ అగ్నికణాలను అక్షరాల అద్దంలో చూడండి.



# ఆపరేషన్ సిందూర్ అగ్నికణం..

## 'పహల్గాం' ఉగ్రదాడిపై విజయబావుటా

కం॥ సైన్యము సాగుచ నుండెను
మాన్యము మేరలవరకును మానము నొడ్డీ!
ధైన్యము లేకయె ధర సా
మాన్యముగ మసలు మనుచు మనకు దెలుపఁగాన్!

కం॥ ముష్కరులకు చిరునామా
లష్కరెల సవాయ్ నలాల లాగియొ కవిధిన్;
పుష్కలమగు బాణాలను
ముష్కరు లైనయట్టి పాక్ అసూయుల దునిమెన్!

కం॥ పర్వత యుద్ధము, తంత్రం
సర్వము ముష్కర్ రహీర్‌ష సాదర శిక్షణ్!
గర్వము పెల్లుబకంగా
సర్వగతులఁయిచ్చి సయ్యద్స్‌లోద్దిన్!

కం॥ జైషే మహ్మద్ స్థాణువు
నేషన్ కార్యాలయంబు నిక్కము యిద్దీ!
బాషా, బహవల్ పూరన్;
పాషాలై తిరుగుచుండ్రు భారత భూమిన్!

కం॥ లష్కరు క్యాంపూకార్యాల
లస్కామ్ నిలయం మురిద్గె లాడెను స్థానం;
తస్కరు లిక్కడ మరియు తు
రుష్కులు సహజీవనంతో రూపొందెదరూ!

కం॥ సయ్యద్ నాబీలాల్ యనె
తొయిబాల ఆలయమ్ము దుర్భర ముజఫర్
బాద్; యందుండెన్ పిఓ
కే, యాక్రమణమున యిద్ది కీలకమవగాన్!

కం॥ కోట్లీ జైషే ఆయుధ
కోట్లకు ఆగారమును; ష కూర్‌కు నిలయమీ
చోట్లెల్లను వరుస పఠాన్
కోట్లాంటి ఉగ్రదాడిలోన్ కొట్టుకుపోయెన్!

కం॥ బర్నాలా లస్కారే
నిర్నీతన్ లాంచ్ పయిడవ నిశ్చలముగ; యా
హర్నిశము దాడికురక
చర్నాకోల ఝుళిపెనుగ సైన్యము యౌరా!

☞

కం॥ మోహిమూనా జోయా యనె
డి హిజుబులద్దా; కలవిచటెన్నియె గృహముల్!
మహితంబయియురణగా
మొహిదిర్ఫాన్ ఖాన్ నివాసముండునిగాదే!

కం॥ సర్దార్ జైషే మహ్మద్
దర్గాగుండే సొరంగ స్థావరమిద్దే!
దుర్జనులై తిరుగాడను
బుర్జులపై శిక్షణొందు ముసుగు దొంగలుగాన్!

కం॥ యుద్ధము అనివార్యయు, స
న్నిద్ధముఁ జేయగ ప్రభుత్వనేర్పరులెంతో!
శుద్ధమతిమెరిగె యౌరా!
యుద్ధరణధీరత ఘనత యేమని పొగడన్!

తే.గీ. దేశరక్షణఁజేయగ ధీరతమున
సమరమునుఁజేసి ముష్కరు సంహరించి
మాకు ఆదర్శమూర్తిగా మసలి తీవ్ర!
వందన మిదిగో సైనిక! భారత వీర!

జై భారత్‌మాతాకీ జై – జైజై భారత్ మాతాకీ జైజై – కౌండిన్యశ్రీ నందూరి వేంకటేశ్వరరాజు

## జాగ్రత!

తిన్న ఇంటివాసాలు లెక్క పెట్టే
దొంగలున్నారు జాగ్రత!
మన ఇంటికే కన్నంపెట్టే ఉగ్రవాద బుసలతో జాగ్రత!
ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే,
కాదు అంతం, ఇది అనంతం,
ప్రపంచానికే కళ్లు తెరిపించిన
గుండె దడదడలాడించిన ఉదంతం

ఓ పాకిస్తాన్! నీవు పీఓకే ఇవ్వాల్సిందే
నీవు కాళ్లబేరానికి రావాల్సిందే
మారుతుంది నీ దేశం అగ్నిగుండం
రావణకాష్ఠంలా, నీవు ఏడ్వాల్సిందే

ధర్మరాజులా మెత్తనిపులి మా మోదీజీ
వేస్తాం మాటు వలుస్తాం నీ తాట
కరాచీ బేకరీల పేరు ఏల?
బకరాలా మారి తలొంచకు ఓ భారతవీరా!

కశ్మీరీ పండిట్ల ఆవేదన ఆక్రోశం
కుతకుత ఉడుకుతున్న లావా
పాక్! నీఆగడాలు ముదిరి పాకాన పడుతున్నాయి
నీవు కుక్కిన పేనువై, చెప్పుకింద తేలువై పడుండాల్సిందే

సినీనటులు ఖాన్ లు"ఖాతే యహా గాతే వహాలు" నోరు ముయ్యాలి
భారత త్రివిధ దళాలు మూడోకన్ను తెరిచాయి
నిన్ను బూడిద గా మార్చేస్తాయి
నీవు "దేహి దేహి పాహి పాహి త్రాహి త్రాహి" అని భారత్‌కి మొక్కాల్సిందే

– అచ్యుతుని రాజ్యశ్రీ

## ఆపరేషన్ సిందూర్

కనిపిస్తున్నవి కనిపిస్తున్నవి స్పష్టంగా కనిపిస్తున్నవి
పాక్ ఉగ్రమూకల దొంగదెబ్బలు–ఊచకోతలు
వినిపిస్తున్నవి వినిపిస్తున్నవి ఉగ్రమూకల కాల్పులు వినిపిస్తున్నవి
అమాయక భారత పౌరుల హాహాకారాలు ఆర్తనాదాలు
మిన్నంటిన వేదనలు రోదనలు
ఎన్నాళ్లీ మారుణహోమం? యింకెన్నాళ్లీ కకావికలు ?
ఓపికకే ఓపిక నశించి క్షమా ధరిత్రియే అపర కాళికయై నిద్ర లేచింది
ఉప్పొంగే భారతపౌరుల భావోద్వేగంతో కదిలింది కదిలింది
సైనికులారా ! రారండి అహింసా వ్రతాన్ని వీడండి
చండ ప్రచండ మార్తాండ వీరులై శూరులై కదలండి
మరో కురుక్షేత్ర సమరానికి
మునీర్ అఫీజ్ హమ్జా మసూద్ అజహార్
ఎవడైతే నేమి ఒక్కొక్కడు మహాహంతకుడు
ముసుగు ఏదైతే నేమి పాక్ సైన్యం, ఐ యస్ ఐ,
లష్కర్ తోయబ, జైషే మహమ్మద్
సంధించండి గాండీవం వజ్రాయుధం పాశుపతాస్త్రం
సుదర్శనం రామబాణం
సమస్త ఉగ్ర రాక్షస గణాలని భస్మీపటలం చేయండి
ప్రపంచ పటంపై బ్రహ్మరాక్షసి పాక్ నామరూపమే మిగొలొద్దు
హర హర మహాదేవ అంటూ ఆపరేషన్ సిందూర్‌తో శివతాండవం చేయండి
ఆసేతు హిమాచలం జైభారత్ జైహింద్ నినాదాలతో మీ వెంటే ఉంటుంది
భారత సైనికులారా ! అరివీర భయంకరులై కదలండి
కొదమసింహాలై దూకండి
ఆకాశమే హద్దుగా ఉగ్ర .మూకల సంహారం చేయండి
శత్రుదుర్గాలన్ని భస్మీపటలం చేయండి

– గులాబీల మల్లారెడ్డి

# దేశభక్తి



వందేమాతరం అంటున్నాం మనం
స్వాతంత్ర్య వేడుకలందు,
మనదే భారతం అని కూడా అంటున్నాం
గణతంత్ర వేడుకలందు జెండా వందనం చేస్తూ...
ఇదేనా దేశభక్తి? ఇదేనా ఘనకీర్తి ?
ప్రాణశక్తిలో కలగలిసి ఉండేదే దేశభక్తి
దేశభక్తి లేని దేహంలో
ఆత్మసౌందర్యం శూన్యం
విధిరాతకు సాక్ష్యమైనవాడు దివ్యాంగుడు
దేశభక్తి లేనివాడు నిజమైన వికలాంగుడు
వలస వెళ్తోంది మేధాశక్తి
దేశభక్తిని దాస్యానికొదిలేసి
ఆర్థిక స్వావలంబనకు అగాధం సృష్టించి
ఆత్మసాక్షిని అమ్మకానికి పెట్టేసి
స్వార్థంతో విర్రవీగుతూ
బాహ్య సౌందర్యానికై బారులు దీరితే
విలవిలలాడుతూ వలవల మంటూ
ఉండలేనంటోంది ఆత్మసౌందర్యం
మొలకెత్తలేనంటోంది దేశభక్తి బీజాక్షరం

కోట్ల మంది ప్రాణవాయువుల ప్రతిరూపం
సార్వభౌమాధికార దిక్సూచి స్తూపం.
రెపరెపలాడుతోంది స్వేచ్ఛగా తిరంగా
శత్రుదేశాల గుండెల్లోనూ సగర్వంగా
అదే అదే మువ్వన్నెల జెండా
భారతీయుల అండా దండా.....

చండం చండం ప్రచండం
అఖండం అదొ కళాఖండం
చేతికందిన అమృతభాండం
అనంత భావనా సుఖకుండం
అవని ఆనందోబ్రహ్మలకు

అగ్నిఖండం భగ్నగుండం
అడుగడుగునా భయానక గండం
భగభగమండే మార్తాండం
పహరా కాస్తున్న వీరజవాన్లకు
దేశ సంరక్షణ దురంధురులకు
ఆరు రుతువుల్లో ఇదే ఘోష
అతుకు బతుకుల్లో అదే శోష-

రండి రండి కవన బావుటా కాంతి వెంట
మానవతా మత్తును మొత్తుదాం
రండి రండి భువన ఘోష రహదారి వెంట
భవ్యభారతి బాధ్యత తలకెత్తుదాం



త్యాగవిత్తులమై తిరిగి ఈ మట్టిలో మొలకెత్తుదాం
భారత జాతికి కొత్త ఊపిరి పోద్దాం
దేశమాత నొసట సిందూర తిలకాలద్దుదాం

అదిలిద్దాం విదిలిద్దాం ఇక వదిలేద్దాం
పెను నిద్దుర జోగే మొద్దుతనం
తరిమేద్దాం మందబుద్ధి మగతల మాంద్యం
ఈ జాతి ఉత్తేజం జాగృతం చేస్తూ
నిర్నిద్ర నాదాలు వినిపిస్తూ-

కలం నాగళ్లతో
మెదళ్ల మొదళ్లను దుక్కి దున్ని
విత్తుతున్నారక్కడక్కడా సాహితీ కర్షకులు
దేశభక్తి బీజాన్ని నాటాలని
మొలకెత్తనీ...మొలకెత్తనీ...
కొత్త సమాజం మొలకెత్తనీ ...
నూతన తేజం ప్రసరించనీ
కవన సుధలు వర్షించనీ
జన బాహుళ్యం హర్షించనీ
భరతమాత గర్వించనీ...

– డా. కె. సాంబమూర్తి

# ఆపరేషన్ సిందూర్

ఇనుండోల్ల అందరి నోట ఒకటే మాట ఆపరేషన్ సిందూర్.
బగ్గున మండిన గుండెల్లో మన జవాన్ లైరి బహదూర్.
మాటేసి మీదికి వస్తే మొగోల్ని పోటెస్తిరి
మదమెక్కినోళ్లు మతం మార్చుకుని ఖతం జెస్తిరి
నీ ఉగ్రోది చేష్టలను మా ఉగ్ర నరసింహుడు ఊరుక్కుంటడ?
ఆలుబిడ్డలనాథలైతే ఉగ్రకాళి ఉరికిరాద?
ఆ తల్లి సుభద్రగాదూ ఆ భార్య ఉత్తరగాదు.
ఈ తల్లి ఐతాంబ గాదు ఈ ఆలు మాశల గాదు.
బాలసెంద్రుని వలె కయ్యానికి పంపలేదు.
నీ ఉగ్రదానికి నీకు లంకగతే బట్టు గాక.
సిందూర్ పేరంటే చాలు లోకానికి కదలు పట్టుగాక.

– గంగరాజు పద్మజ

# ఆపరేషన్ సిందూర్

భారతీయ సంస్కృతి సిందూరం
వివాహితల నొసట సూర్యోదయం
మాంగల్యబలానికి ఇది ఒక చిహ్నం
ప్రతి హిందువుకు ధైర్యాన్నిచ్చే దీపం

భర్త దీర్ఘాయువుకు కారణం సిందూరం
ఎర్రని ఛాయవర్ణరేఖలకు ఇదొక మూలం
నుదుటిపై ఐదోతనాన్ని సూచించే సిందూరం
పుణ్యస్త్రీ గౌరవ సూచిక సిందూరం

పార్వతి ధరించి శివుని మెప్పించిన సిందూరం
దుష్టశక్తులను దూరంజేసేది సిందూరం
అనంతశక్తులకు రూపప్రతిరూపం సిందూరం
దుష్టఆత్మలు రాకుండా కాపాడే సిందూరం
రక్తవర్ణానికి రమ్యమై రంజిల్లు రాగం
అగ్నికీలలను సూచించే అరుణార్ణవం
ఇదియే "పహల్గాం ఉగ్రచర్యకు" ప్రతీకారం
ఈ చర్యకు మూలమే "ఆపరేషన్ సిందూర్"

మే 7వ తేదీ తెల్లవారుజామున సైనికులు
భారత రక్షణదళాలు పాక్ గడ్డ మీది
తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసించిన రోజు
మోదీ తెరిచన మూడో కన్నే 'ఆపరేషన్ సిందూర్'

ఏప్రిల్ 22న బైసారన్ ఉగ్రవాద చర్యకు
26 మంది పర్యాటకుల మృతి సంఘటన
భారతావని పాక్‌పై ప్రతిస్పందనమిది
భారతావనికి విజయసూచికమిది
భారతావని పెహల్గామ్ మృతులకు
నివాళిని అర్పించే కార్యమిది

– డా. బి. వెంకట్

శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్
కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు
1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-

Visit Youtube Link:
- Agriculture Implements at low cost - Rythu Nestham
- Low Cost agriculture machines to farmers - HMTV
Contact Number : 9849140465

SUDHAKAR
WIRES AND CABLES
50+ years OF LEGACY SUDHAKAR GROUP
నాణ్యతకు
మన్నికకు
సుధాకర్ వైర్స్ & కేబుల్స్

Toll Free : 1800 120 000 066 sudhakarind.com info@sudhakarind.com

# కశ్మీర సిందూరం



భూతల స్వర్గ కశ్మీరం
భారతదేశ ముఖ సింగారం
కుంకుమ పూల సిందూరం
పెహల్గాం శిఖరాగ్ర మయూరం
యాత్రికుల మదిలో మణిద్వీపం
ఆనందాల సందడిలో విహరించే వేళ
దేవదారు వృక్ష ఛాయలలో  ముంచుకొచ్చిన  మృత్యుహేల
ఉగ్రవాద ముష్కరుల మారణ హోమం... మహిళల సిందూరం
కుంకుమ పువ్వుల మడిలో కలిసిన వేళ
హృదయ విదారకం.... రాక్షస ప్రవృత్తి
అభం శుభం తెలియని అమాయకులను మతం పేరిట
మట్టుపెట్టిన ఘోరకలి...
స్పందించిన భరతజాతి, ఆపరేషన్ సిందూర్
విలయ తాండవంతో ముష్కరులను
తుది ముట్టించిన మహిళా జ్యోతులు
భరతమాత కన్న భాగ్య విధాతలు.....
భరతజాతి ముక్తకంఠంతో
భూమ్యాకాశాలు దద్దరిల్లేలా
జయహో భారత్... జయహో సిందూర్...
అంటూ విజయ శంఖాలు పూరించింది....
ప్రపంచమంతా స్పందించి
భారత్‌ను అభినందించిన వేళ శత్రుశేషాన్ని తుడిచిపెట్టు
పుణ్యభూమి వర్ధిల్లు... జయహో వీర సైనికా! వందనం నీకు అభినందనం

– సత్యవీణ మొండ్రేటి

# పహల్గామ్ దాడి సందర్భం పద్యాలు

1)తే.గీ) ఆడ సింహాలు దూకిన నడ్డుకొనెడి
సత్తు వెవ్వరికున్నది చిత్తు చిత్తు
చేసికాని వదలరింక చేవ యున్న
అడ్డుకోండిరా పాకీల అధములార!

2) తే.గీ) స్త్రీల నుదుటిపై సిందూర చెరిపినారు
క్రొత్త పెండ్లి కూతుళ్లకు గుండెనిండ
బాధ నింపిన ముష్కర ప్రాణములను
తీయు "సిందూర" కెదురొడ్డు తెగువ కలదె

3) తే.గీ) వీర వనితల కన్నట్టి వీరమాత
లందరికి నేడు జోతల నందజేతు
మేటి సోఫియా, వ్యోమికా మేధకు, ఘన
శూరతకు కోటి జోతలు, శుభము గల్గు

4)తే.గీ ఆపరేషను సిందూరమాడపడుచు
లందరికి నుపశమనము నందజేసె
మోది చాతుర్య మెంతయో ముదము గూర్చె
శత్రుదేశము మోదీని శాంతి కొరకు

5)ఉ భారతమాత గర్భమున భాగ్యవశంబున పుట్టి వీరులై,
ధీరులు, శూరులై సమర ధీరత చాటిన భీములై సదా
భారతదేశ రక్షణకు ప్రాణములర్పణ చేయు సైనికుల్
క్రూరులు, నీచశత్రువుల కుత్తుక లన్నియు కోసినారుగా

– గౌరీమల్లిక్

# వారికి తెల్పుడీ తగిన పాఠము!!

కం : మోడీకి చెప్పుకొమ్మని
కేడీగాడొకడు పేల్చె! కీడే మూడెన్
వాడికి, పాక్ దేశమునకు
మోడీ దెబ్బకు వెలవెల బోయురివెధవల్!

తే: శాంతి కాముక భరత దేశంబు పైన
కక్ష గట్టిన "వారలు" శిక్ష పొందె!!
దొంగ చాటుగ నుసిగొల్పి ధూర్తుల నిటు
పంపి, పర్యాటకుల నెల్ల చంపదగునె?

ఉ: తీయగ పల్కు వారికిట తీరని ద్రోహము జేసి, భాయి భా
యీ యని భారతీయుల పయిన్ కృతకంబగు నెమ్మి జూపి, పా
కీయులు భారతావనికి కీడు తలంచిరి నీచకర్ములై!
మా యెద లందు రోషమె యమాంతము పొంగెను బుద్ధి చెప్పగన్!!

వీరజవానులార! అరివీర భయంకరులై చెలంగుడీ!!
పోరును సల్పుడీ భరతభూమిని యెవ్వడు చొచ్చుకొచ్చినన్!
వారికి తెల్పుడీ తగిన పాఠము, న్యాయము తప్పి, శాంతికిన్
యారని మంటబెట్టిన దురాత్ముల గుండెల మంట బెట్టుడీ!!

మాకిది కొత్తగాదు, యసమాన పరాక్రమ ధైర్య శౌర్యముల్
చేకొని శాత్రవాధముల శీర్షములన్ దునుమాడుటన్నహో!!
మాకు లభించె మా చరిత మందు లిఖింప మరొక్కమారు, దు
ర్భీకర శాత్రవ స్ఫురభేద్యము మా భరత స్థలంబుగన్!!

– కవిమిత్ర...

# భారత ప్రశస్తి



సీ॥ వేదశాస్త్ర పురాణ విజ్ఞాన మన పాల
బిడ్డల పెంచిన ప్రియ పురంధ్రి!
సర్వసమానతా సద్భావనామృత
దానమొనర్చిన ధన్యచరిత!
బ్రహ్మ విద్యావ్యాప్తి బహు ఖండవాసుల
సంస్కరించిన విశ్వసన్నుతాంగి!
సత్యధర్మత్యాగ శాంతి ప్రేమల భవ్య
పాఠాలు నేర్పిన పంతులమ్మ!
తే॥ నీవు పరతంత్రమున్ వీడి నేటివరకు
పెక్కువత్సరాల్ గడిచెను, ప్రేమ మీర
పులకరింపగ నా మేను తలచి తలచి
వందనము జేతు గొనుమమ్మ భారతాంబ!

సీ॥ ఒక తోటలో బుట్టి యెప్పెడి వేర్వేరు
వృక్ష సంతానంబు విధముగాను,
భిన్న జాతుల పక్షి బృందంపు విహరణ
స్థలమై తనర్చెడి సరసివోలె,
బహువరయుక్తమై భాసిల్లుచున్ మింటు
కనిపించు నింద్రుని ధనువు వోలె
భిన్నమతముల, కులముల, భిన్న భాష
లను వచించెడి జనముల గనిన దివ్య
భరతదేశంబనైక్యతా భావ రహిత
మగుచు సమత, భ్రాతృత్వ స్వేచ్ఛాది సుగుణ
రాజి వెలుగొందుగాక దూతలోన

చం॥ తనవలెనన్ని ప్రాణాలు, సుదారముగా గన, నన్యదారలన్
జనుల వోలెగాంచ, పరసంపద మట్టి విధానగాంచుచున్
మనుడని చెప్పె భారత సనాత ధర్మము, ధర్మమార్గ వ
ర్తనులయి, జీవితమ్ములు కరంబుగ సార్థకతం గడపగన్

చం॥ ఇతరుల సంపదల్ బడయ నెన్నడు యుద్ధమా చేయబోదు కు
త్సితమతి భారతం చొరులు చేటొనరింపగ భీరువట్లు ని
ర్గతి ధృతి నూరకుండదు పరాక్రమమమొప్ప గజంబు గూల్చను
ద్ధతి చెలరేగు సింగమయి ధాత్రిని గూల్చును శాత్రవావళిని.

ఉ॥ వీడి మనుష్య ధర్మమును వెక్కసమౌ మతభేద భావనన్
వాడిగ కాల్చివేయుచును భామినులున్ బ్రతిమాలు చుండినన్
వీడక రాక్షసత్వమున వీడగ నాత్మలనెంచి చెప్పుడీ
మోడికటంచు పల్కి ఫలమున్ చవిచూచుటయయ్యె చేలలై

కం॥ సిందూరముతో మిమ్ము మ
దాంధుల దునిమితిమ ప్రథమ యత్నమె, యుక్తిన్
బొందల పెట్టిన మము మరి
యెందుంగన మీకు బూడిదే మిగులు సుమీ!

– ముద్దురాజయ్య



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది ఎన్. రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేంద్రమంత్రి, ప్రస్తుత అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వారసుడిగా ఆయన ఎన్నికయ్యారు. ఈ పదవికి ఇతర నేతల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ..వడపోత తరువాత ఆయనే రంగంలో మిగిలారు. దాంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లయింది. ఏబీవీపీ నుంచి అంచెలంచెలుగా ఎదిగిన రామచందర్‌రావు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు.



# రామచంద్రుడు కమల‘నాథుడు’

భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం అనేక సమీకరణలను పరిగణనలోకి తీసుకొని పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి సీనియర్ నాయకుడు, న్యాయవాది ఎన్. రామచందర్ రావు ఎన్నికవైపు మొగ్గు చూపింది. మరికొందరి పేర్లు తెరమీదికి వచ్చినా, రామచందర్ రావు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లయింది.

వివాద రహితుడు, పార్టీకి విధేయుడిగా పేరున్న రామచందర్ రావు నాలుగు దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్నారు. హైదరాబాద్ నగరపాలక సంస్థ కార్పొరేటర్‌గా రవీంద్రనగర్ డివిజన్ నుంచి తొలిసారి పోటీ చేశారు. హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనమండలికి (2015–21) ప్రాతినిధ్యం వహించి, సభలో ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ, శాసనసభ స్థానాల నుంచి పోటీ చేశారు. పార్టీ హైదరాబాద్ అధ్యక్షుడిగా పనిచేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా కోదాడ మండలం అనంతగిరిలో జన్మించిన రామచందర్ రావు చదువంతా హైదరాబాద్‌లోనే సాగింది. ఆయన తండ్రి ఎన్వీఆర్ లక్ష్మీనారాయణరావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, డీన్‌గా సేవలు అందించారు. రామచందర్‌రావు ఏబీవీపీ తరపున విద్యార్థి నాయకుడిగా చురుగ్గా పనిచేశారు. ప్రత్యర్థుల దాడులను ఎదుర్కొంటునే ఆ సంస్థ పటిష్టతకు కృషి చేశారు. సికింద్రాబాద్ రైల్వే డిగ్రీ కళాశాల బీఏ చదువుతూ (1977–80) ఏబీవీపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1977–85 మధ్యకాలంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అటు విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటునే ఉస్మానియాలో ఎంఏ, ఎల్ఎల్‌బీ (1982–85) చేశారు. ఏబీవీపీని బలోపేతం చేసే క్రమంలో విశ్వవిద్యాలయంలో ప్రత్యర్థుల దాడులను ఎదుర్కొన్నారు. తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థుల పక్షాన ఉద్యమించడంలో ముందున్నారు. 1986లో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన సుప్రీం, హైకోర్టుల్లో న్యాయవాదిగా ఉన్నారు.

1986లో బీజేపీలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, పార్టీ లీగల్ సెల్ సంయుక్త కన్వీనర్‌గా పనిచేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా (2007–09), ప్రధాన కార్యదర్శిగా (2009–12), పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. పార్టీ ముఖ్య అధికార ప్రతినిధిగా (2012–15) సేవలు అందించారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్ష సారథ్యాన్ని అప్పగించడంలో పార్టీ రాష్ట్ర అగ్ర నాయకత్వంలోని అత్యధిక భాగం రామచందర్ రావు అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపడం విశేషం. పార్టీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మరో కేంద్రమంత్రి, పార్టీ పూర్వపు అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ధర్మపురి అరవింద్, డీకే అరుణ తదితర సీనియర్ నాయకులు వెంటరాగా రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేశారు.

**రాజాసింగ్ అలక... రాజీనామా**

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి తనకు దక్కక పోవడం పట్ల అలకవహించిన గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత అధ్యక్షుడు కిషన్ రెడ్డికి రాజీనామా లేఖను పంపారు. తన నిరసన వ్యక్తం చేస్తూ పార్టీకి చెందిన కొందరి పేర్లు ప్రస్తావించకుండానే కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష పదవిని ఆశించిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కూడా నిరాశ చెందారు. అందుకే రామచందర్ రావు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి దూరంగా ఉన్నారని ప్రచారంలో ఉంది. రాజేందర్‌తో పాటు ఎంపీలు అరవింద్ (నిజామాబాద్), డీకే అరుణ (మహబూబ్‌నగర్), శాసనసభ్యుడు రాజాసింగ్ (గోషామహల్) ఈ పదవి కోసం పోటీలో ఉన్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరగగా, మిగిలిన వారు సర్దుకుపోయినా, రాజాసింగ్ నిరాశ, అసంతృప్తి వ్యక్తం చేశారు.

– జాగృతి డెస్క్



**నానాటికి పెరుగుతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు ప్రతి ఏటా జూలై 11వ తేదీన “ప్రపంచ జనాభా దినోత్సవాన్ని” నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరంలో దీనిని ప్రారంభించింది.**



# హిందూ జనాభా తగ్గు

ప్రస్తుత ప్రపంచ జానాభా 820 కోట్లు. ఐక్యరాజ్య సమితి గత ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవం జులై 11 నాడు విడుదలైన ‘వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్’ ఈ జనాభా 2080ల నాటికి గరిష్టంగా 1003 కోట్లకు చేరుకొని క్రమంగా క్షీణించడం ప్రారంభమవుతుంది. ఇప్పుడు జన్మించే వ్యక్తులు సగటున 73.3 సంవత్సరాలు జీవిస్తారని, 1995 నుంచి సగటు జీవిత కాలం 8.4 సంవత్సరాలు పెరిగిందని ఈ నివేదిక అంచనా వేసింది. మరణాల రేటులో మరింత తగ్గుదలతో, 2054లో ప్రపంచవ్యాప్తంగా సగటు జీవిత కాలం 77.4 సంవత్సరాలకు చేరుకుంటుంది” అని నివేదిక పేర్కొంది.

భారత దేశం విషయానికి వస్తే ప్రస్తుత జనాభా 146.39 కోట్లుగా అంచనా. జనాభా విషయంలో మన దేశంలో చైనాను దాటేసి ప్రథమ స్థానంలో నిలిచింది. మన దేశంలో 1951 నుంచి ప్రతి పదేళ్లకోసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011 జనగణన ప్రకారం మన దేశ జనాభా 121 కోట్లు. కరోనా సంక్షోభం కారణంగా 2021లో జరగాల్సిన జనగణన వాయిదాపడింది. దేశ వ్యాప్తంగా 16వ జనగణన 2026లో మొదలుపెట్టాలని ఇటీవలే కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

ప్రపంచ జనాభాలో మనదేశ జనాభా 16%. ఇంత జనాభా కేవలం ప్రపంచ భౌగోళిక స్వరూపంలో కేవలం 2.45% భౌగోళిక విస్తీర్ణంలో ఉండటం గమనార్హం.

**పడిపోతున్న దేశ జనాభా**

ఇటీవల ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరానికి విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాప్యులేషన్–ఎస్ఓడబ్ల్యూపీ ప్రకారం..భారతదేశ జనాభా భర్తీ రేటు కంటే జననాల రేటు తక్కువ ఉంది. లక్షలాది మంది ప్రజలు పునరుత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని చెప్పింది. జననాల రేటు 1.9కి పడిపోయిందని, భర్తీ స్థాయి 2.1 కంటే తక్కువగా ఉందని, అంటే జనాభా సంఖ్యను కొనసాగించడానికి కావాల్సిన జననాల రేటులో దేశం లేదని స్పష్టం చేసింది. జననాల రేటు మందగించినా.. యువత జనాభా మాత్రం దేశంలో గణనీయంగానే ఉందని తెలిపింది. 0–14 ఏళ్ల వారు 24%, 10–19 ఏళ్ల వారు 17%, 10–24 ఏళ్ల వారు 26% ఉన్నారని వెల్లడించింది. పని చేసే వయసు (15–64)లో ఉన్న వారు 68% ఉన్నారని వెల్లడించింది. ఇక 65 ఏళ్లు దాటిన వృద్ధులు మొత్తం జనాభాలో 7%గా ఉన్నారని, ఆయుర్దాయం అంచనా పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధుల సంఖ్య వచ్చే కాలంలో మరింత పెరుగుతుందని అంచనా వేసింది. ప్రస్తుతం దేశ జనాభా 146.39 కోట్లు కాగా వచ్చే 40 ఏళ్లలో అది 170కోట్లకు చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరోగమనం ప్రారంభమవుతుంది. ఆయుర్దాయం పురుషులకు 71 ఏళ్లు, మహిళలకు 74 ఏళ్లుగా అంచనా వేశారు.

**తగ్గుతున్న హిందూ జనాభా**

భారత దేశంలో హిందూ జనాభా తగ్గుతుంటే, మైనారిటీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ముస్లిం జనాభా వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ విషయాన్ని స్వయంగా ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి–ఈఏసీ–పీఎం నివేదిక వెల్లడించింది. గత ఏడాది మే నెలలో వెలువడిన ఈ నివేదిక ఆందోళన కలిగించేదిగా ఉంది.

1950లో మన దేశ జనాభాలో 84.68%గా ఉన్న హిందువులు జనాభా 2015 నాటికి 78.06%కు క్షీణించిందని వెల్లడించింది. హిందువుల జనాభాలో 7.82% తగ్గుదల నమోదైందని పేర్కొంది. అదే సమయంలో ముస్లింల జనాభా పెరుగుదల 43.15%గా నమోదైంది. అంటే వారి వాటా 9.84% నుంచి 14.09%కు పెరిగింది. 1950–2015 మధ్య క్రైస్తవులు, సిక్కుల వాటా స్వల్పంగా పెరిగిందని, జైనులు, పార్శీల శాతం తగ్గిందని వెల్లడించింది. క్రైస్తవుల జనాభా 5.38%, సిక్కులు 6.58% పెరిగినట్టు పేర్కొంది.

ప్రపంచవ్యాప్తంగా 167 దేశాల్లో పరిస్థితులను అధ్యయనం చేసి ఈ మేరకు నివేదికను రూపొందించారు. మన పొరుగు దేశాలైన బాంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక, భూటాన్, అఫ్గానిస్థాన్‌లలో మాత్రం మెజార్టీ మతస్థుల వాటా పెరుగుతోంది. కానీ భారత్, మయన్మార్, నేపాల్ దేశాల్లో మాత్రం మెజారిటీ మతస్తుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని శామికా రవి నేతృత్వంలోని ఈఏసీ–పీఎం నివేదిక వెల్లడించింది.

**“భారత్‌లో మైనార్టీలకు రక్షణ పెరిగిందని, వాళ్లు ఇక్కడ సుఖంగా జీవిస్తున్నట్లు అధ్యయనంలో తేలింది. ప్రభుత్వ విధానాలు, రాజకీయ నిర్ణయాలు, సామాజిక విధానాల వల్లే మెజారిటీ జనాభా తగ్గి, మైనార్టీ జనాభా పెరిగినట్లు వెల్లడైంది”**అని నివేదిక పేర్కొంది. భారత్‌లో హిందువుల జనాభా తగ్గడం, మైనారిటీ జనాభా పెరగడానికి కారణాలు తెలియదని, కేవలం సంఖ్యాపరంగానే అధ్యయనం చేసినట్టు తెలిపింది. హిందూ మహిళల సంతానోత్పత్తి రేటు ముస్లిం మహిళల కంటే తక్కువగా ఉండటం, మతమార్పిడులు, ఇతర దేశాలకు వలసలు వంటి కారణాలు జనాభా తగ్గుదలకు దోహదం చేస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

2011 నాటికి భారతదేశంలో హిందువుల జనాభా సుమారు 79.8%. 2001–2011 మధ్య

# తోంది..బహుపరాక్..!

జనాభా దాదాపు 16.8% పెరిగింది, అదే కాలంలో ముస్లింల జనాభా దాదాపు 24.6% పెరిగింది. ఇది జనాభాలో అసమతుల్యత గురించి ఆందోళనలకు దారితీసింది. రాబోయే సంవత్సరాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు హిందూ జనాభా పెరుగుదల రేటును అధిగమించే అవకాశం ఉంది. 2050 నాటికి ముస్లింల సంఖ్య హిందువులను దాటే అవకాశాలు లేకపోలేదనే భావన నెలకొంది.

మన దేశంలో ముస్లింలు లక్షద్వీప్ (96.58 %) జమ్ముకశ్మీర్ (68.31 %)లో అధికంగా ఉన్నారు. అస్సాం (34.22%), పశ్చిమ బెంగాల్ (27.01 %), కేరళ (26.56 %) రాష్ట్రాల్లో రాజకీయాలను ప్రభావితం చేయగలుగుతున్నారు. ప్రస్తుతం మన దేశంలో క్రైస్తవులు నాగాలాండ్ (87.93 %), మిజోరం (87.16 %), మేఘాలయ (74.59 %), అరుణాచల్ ప్రదేశ్(30.26 %) రాష్ట్రాల్లో మెజారిటీగా ఉన్నారు. ఇవన్నీ ఈశాన్య రాష్ట్రాలే. కాగా గోవా (25.10 %) కేరళ (18.38 %) రాష్ట్రాల మీద వీరికి మంచి పట్టుంది. వాస్తవానికి దేశ జనాభాలో క్రైస్తవుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. రిజర్వేషన్ల కోసం మతాన్ని దాచి పెడుతున్నందున వారి వాస్తవ సంఖ్య తెలియడం లేదు.

**ఇవే కారణాలు**

దేశంలో హిందూ జనాభా తగ్గుదలకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా సంతానోత్పత్తి రేటు, మతమార్పిడులు, వలసలు ప్రభావితం చేస్తున్నట్లు కనిపిస్తోంది. మన దేశంలో దశాబ్దాల తరబడి అమలు చేసిన కుటుంబ నియంత్రణ విధానాలు హిందువులకే ఎక్కువ నష్టం కలిగించాయి. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని, ఒకరు లేక ఇద్దరు చాలు అని ప్రచారం చేశారు. వాస్తవానికి మన దేశంలో కుటుంబ నియంత్రణను నిక్కచ్చిగా పాటించింది హిందువులు మాత్రమే. ముస్లిం వర్గాల్లో బహుభార్యా విధానంతో పాటు తమ మతం అంగీకరించదు అని కుటుంబ నియంత్రణకు దూరంగా ఉన్నారు. ముస్లిం రాజకీయ నాయకులు, మత పెద్దలు వారిని ఇందుకు ప్రేరేపించారు. హిందువులు పరిమిత సంతానానికే ప్రాధాన్యత ఇస్తే మైనారిటీలు ఇబ్బడి ముబ్బడికిగా జనాభాను పెంచడం వెనుక పెద్ద కుట్రే ఉందని చెప్పక తప్పదు.

**దేశం ఉనికికే ప్రమాదకరం**

ప్రపంచంలో హిందువులకు ఏకైక దేశం భారత దేశమే. కానీ జనాభా పెరుగుదలలో అసమతుల్యత దేశ అస్తిత్వానికే సవాలుగా మారుతోంది. 1947లో భారత దేశాన్ని మత ప్రాతిపదికగానే విభజించారు. ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవం విస్తరించడంతో పాటు వేర్పాటువాదాన్ని కూడా రెచ్చగొడుతోంది. బెంగాల్, అస్సాం, నేపాల్‌తో మన సరిహద్దులలో ముస్లిం జనాభా పెరగడం దేశ భద్రతకు ముప్పుగా మారుతోంది

మన దేశంలోకి పాకిస్తాన్, బాంగ్లాదేశ్‌ల నుంచే కాకుండా మయన్మార్ నుంచి రోహింగ్యాల రూపంలో చొరబాట్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. కాంగ్రెస్, వామపక్షాలు, తృణమూల్ లాంటి పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ అక్రమ వలసలను ప్రోత్సహిస్తూ వారికి ఆధార్‌కార్డులు, ఓటర్ ఐడీలు, రేషన్ కార్డులు ఇప్పిస్తున్నాయి. దీంతో అక్కడి జిల్లాల్లో స్థానిక హిందువులు మైనారిటీలుగా మారాల్సిన దుస్థితి ఏర్పడింది.

**అప్రమత్తం చేసిన ఆర్.ఎస్.ఎస్.**

దేశంలో హిందువుల జనాభా తగ్గడం ద్వారా ఏర్పడే ముప్పుపై ఆర్.ఎస్.ఎస్. సమాజంతో పాటు ప్రభుత్వాన్ని కూడా అప్రమత్తం చేస్తోంది. ప్రపంచ రాజకీయాలు, కొన్ని మత విశ్వాసాల వారి విస్తరణ కాంక్ష, చాపకింద నీరులా సాగే కుట్రలు భారతీయ సమాజం గుర్తించాలని హెచ్చరిస్తోంది. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, అస్తిత్వం, నాగరికత, ఆచార వ్యవహారాలు తారుమారయ్యే ప్రమాదం ఉంది.

జనాభా విషయంలో ఒక సుస్థిర విధానం ఉండాలని ఆర్.ఎన్.ఎన్. మొదటి నుంచి కోరుతున్నది. అందరికీ ఆమోదయోగ్యమైన విధానం ద్వారా జనాభాలో అసమతౌల్యానికి చోటు లేని విధంగా చట్టాలు చేయాలని అక్టోబర్ 6, 2022న నాగపూర్‌లో జరిగిన సమావేశంలో సర్‌సంఘ్ చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సుస్పష్టంగా కోరారు. భారతదేశం తన సహజత్వాన్ని, ఉనికిని కోల్పోకుండా ఉండాలంటే హిందువుల జనాభా తగ్గి, ఇతర మతాల వారి జనాభా పెరగకూడదని నిర్మొహమాటంగానే చెప్పారు. అక్టోబర్ 20, 2022న ప్రయాగరాజ్‌లో జరిగిన అఖిల భారతీయ కార్యకారి మండలి సందర్భంగా సర్ కార్యవాహ్ దత్తాత్రేయ హొసబలె ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు.

కుటుంబ నియంత్రణ కారణంగా హిందూ సమాజానికి ముంచుకొస్తున్న ముప్పుపై మన ధర్మాచార్యులు, హిందూ ప్రముఖులు తరచూ హెచ్చరిస్తున్నారు. ముగ్గురు కంటే ఎక్కువ మంది



పిల్లలను కనాలని హితబోధ చేయడం తెలిసిందే. అయితే కొన్ని వర్గాల వ్యక్తులు వారిపై కువిమర్శలు చేస్తున్నారు. ఎక్కువ మందిని కంటే మీరు పోషిస్తారా? అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ సమస్య వీరికి హాస్యాస్పదంగా కనిపించవచ్చు. కానీ భవిష్యత్తులో తమ కుటుంబాలకు కూడా ఇబ్బందులు తప్పవని గ్రహించలేకపోతున్నారు.

**జనాభా తగ్గినా ప్రమాదమే**

ఇటీవలి వరకూ ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న చైనాది మరో ఉదాహరణ. ఆ దేశం జనాభా నియంత్రణ కోసం దశాబ్దాల తరబడి 'వన్ చైల్డ్' పాలసీని పాటించింది. ఒక కుటుంబానికి ఒకరికన్నా ఎక్కువ సంతానం ఉంటే జరిమానాలతో పాటు ప్రభుత్వ పథకాలకు అనర్హులను చేస్తూ వచ్చారు. అయితే మరణాలకు అనుగుణంగా జనాభా పెరగకపోవడంతో చైనాలో అనేక సమస్యలు వచ్చిపడ్డాయి. దేశంలో వృద్ధుల సంఖ్యపెరిగి, పని చేసే యువతకు కొరత ఏర్పడింది. దీంతో చైనా వన్ చైల్డ్ పాలసీని ఎత్తేసింది. తాజాగా చైనాలో వధువులు దొరకక బాంగ్లాదేశ్ యువతులను పెళ్లి చేసుకుంటున్నారు. ఇందుకోసం పెద్ద మాఫియా నెట్‌వర్క్ నడుస్తోంది.

మరోవైపు రష్యా ప్రభుత్వం కూడా ఎక్కువ మంది పిల్లలను కనాలని తమ దేశ ప్రజలకు పిలుపునిచ్చి ప్రోత్సాహకాలనుకూడా ప్రకటించింది. జపాన్ కూడా ఇదే తరహా సమస్యను ఎదుర్కొంటోంది.గతంలో జనాభాను భారంగా భావించిన దేశాలు ఇప్పుడు సంపదగా గుర్తిస్తున్నాయి.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

**భారతీయ జనత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పొకల వంశీ నాగేంద్ర (పీవీఎన్) మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయన పేరును ఖరారు చేసింది. గతంలో శాసన మండలిలో ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కోరమండల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.**



కొత్తనేత మాధవ్

ప్రస్తుతనేత పురందేశ్వరి

# కమల 'దళపతి'

మాధవ్ విద్యార్హతలు, రాజకీయ అనుభవం, సామాజిక సమీకరణలు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి బలమైన అభ్యర్థిగా నిలిపాయి. తెలుగుదేశం 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు మాధవ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆ సమయంలో మంచి పనితీరుతో అందరి మన్ననలు పొందారు. ఈ పదవి కోసం పలువురి పేర్లు ప్రచారంలోకి వచ్చినా సంఘ్ నేపథ్యం, బీజేపీ భావజాలం ఉన్న నేతకే అవకాశం ఇవ్వాలని పార్టీ అగ్రనేతలు భావించారు. ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, పార్థసారథి, విష్ణువర్ధన్‌రాజు వంటివారు అధ్యక్ష పదవిని ఆశించినట్లు చెబుతున్నారు. అదే సమయంలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనతో మాధవ్ పేరును ప్రతిపాదించి నట్లు తెలుస్తోంది. సౌమ్యుడు, వివాద రహితుడు కావడంతో ఆయన పేరు పట్ల పార్టీలో ఏకాభిప్రాయం వ్యక్తమైందని అంటున్నారు. ఆయన వయసు కూడా కలిసివచ్చిందని చెబుతున్నారు. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా మాధవ్‌కి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని అంటున్నారు.

2024 ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి విజయంలో ఆయన పాత్ర, సభ్యత్వ డ్రైవ్‌లో చొరవ, శాసనమండలిలో ఫ్లోర్ లీడర్‌గా చూపిన నాయకత్వం ఆయనకు ఈ స్థానం అందించాయి. ఆయన పార్టీ సీనియర్ నేత దివంగత చలపతిరావు కుమారుడు. చలపతిరావు రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన మాధవ్ పార్టీకి విధేయుడిగా ఉన్నారు. క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ అధిష్ఠానం ఈ ఎన్నికను ఏకగ్రీవం చేసింది. ఎమ్మెల్సీగా సమర్థంగా సేవలు అందించిన మాధవ్ మిత్రపక్షాలతోనూ సమన్వయంతో వ్యవహరించగలరని పార్టీ భావిస్తోంది.

**కుటుంబ నేపథ్యం**

పి.వి.ఎన్.మాధవ్ ఆగస్టు 10,1973న విశాఖపట్నం, మద్దిలపాలెంలో పి.చలపతిరావు, పి.రాధా చలపతి దంపతులకు జన్మించారు. చలపతి రావు 1980 నుండి 1986 వరకు బీజేపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. కుటుంబ రాజకీయ నేపథ్యం మాధవ్‌పై గణనీయమైన ప్రభావం చూపింది. ఆయన కుటుంబానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో ఉన్న సన్నిహిత సంబంధాలు ఉండటంతో బాల్యం నుంచే హిందుత్వ భావజాలం అలవడింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి బి.కామ్. ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేసిన మాధవ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా (ఐసీడబ్ల్యూఏఐ) నుండి కాస్ట్ అకౌంటెన్సీలో పట్టా పొందారు. ఈ విద్యార్హతలు ఆయనకు రాజకీయ నాయకత్వంతో పాటు ఆర్థిక, వ్యాపార రంగాలలో నైపుణ్యాన్ని అందించాయి.

ఆయన తండ్రి చలపతిరావు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాజకీయ కార్యకలాపాలలో యువకుడిగా మాధవ్ సన్నిహితంగా ఉండేవారు. క్రమంగా పార్టీలో కీలక స్థానాలను అధిరోహించారు. 2009 శాసనసభ ఎన్నికల్లో విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2017లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల నియోజక వర్గం నుంచి శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2017–2023 మధ్య శాసన మండలిలో పార్టీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. అక్కడ ఆయన పార్టీ సిద్ధాంతాలను గట్టిగా సమర్థించారు. 2024లో బీజేపీ సభ్యత్వ డ్రైవ్‌లో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళంలో ప్రారంభించి, రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది సభ్యులను నమోదు చేయడంలో సహకరించారు. 2024 ఎన్నికలలో, ఆయన తెలుగుదేశం పార్టీ, జనసేనతో కలిసి ఎన్‌డీఏ కూటమి విజయంలో పాలుపంచుకున్నారు. రాజమండ్రి, ఇతర జిల్లాలలో సమావేశాలు నిర్వహించారు.



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**

**పురందేశ్వరి విజయాలు**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైదొలగుతున్న దగ్గుబాటి పురందేశ్వరి తమ పదవీ కాలంలో పార్టీ లక్ష్యాలను సాధించారు. ఆమె జులై 4, 2023న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన తర్వాత, పార్టీ అభివృద్ధి, ప్రజలతో సంబంధాలను బలోపేతం చేయడం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్రజాస్వామ్య పోకడలను ఎత్తిచూపుతూ, విమర్శలు గుప్పించడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ రాష్ట్రంలో విస్తరించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టటంతో పార్టీ ప్రజలకు దగ్గరైంది.

అధ్యక్షురాలిగా రెండేళ్లపాటు చేపట్టిన

కార్యక్రమాలు ఎంతో ఊపు తెచ్చాయి. కూటమిని అధికారంలోకి తీసుకొచ్చాయి. క్షేత్రస్థాయిలో బలాన్ని పెంచడం, ఎన్‌డీఏ కూటమిలో సమన్వయాన్ని మెరుగుపరచడం, వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంపై గట్టి విమర్శలు చేయడం ద్వారా రాష్ట్రంలో పార్టీ స్థానాన్ని బలోపేతం చేశారు. ఆమె నాయకత్వంలో 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ గణనీయమైన విజయాలు సాధించింది. పార్టీ సభ్యత్వ డ్రైవ్ ద్వారా కేవలం 45 రోజుల్లో 25 లక్షల మంది సభ్యులను నమోదు చేసి క్షేత్రస్థాయిలో పార్టీకి బలమైన పునాదులు వేశారు. కార్యకర్తలు, అనుబంధ సంఘాలను సమన్వయం చేయడంలో సమర్థవంతంగా వ్యవహరించారు. పార్టీని ప్రజలకు చేరువ చేయడానికి అనేక సామాజిక, రాజకీయ కార్యక్రమాలు చేపట్టారు.

## మాధవ్

'ప్రజాపోరు యాత్ర' పేరుతో చేపట్టిన కార్యక్రమం ద్వారా నాటి జగన్ ప్రభుత్వ అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి, పాలనా వైఫల్యాల గురించి ప్రజాక్షేత్రంలో ధాటిగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఉపయోగించలేదని, అవినీతిలో మునిగి పోయిందని ఆమె ఆరోపించారు. ఆ హయాంలో అభివృద్ధి వెనుకబడిందని, ప్రభుత్వం సర్వాధికార ధోరణిని ప్రదర్శించిందని, వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచిందని ఆమె ఆరోపించారు. వైఎస్‌ఆర్‌సీపీ మోసపూరిత సాధనాల ద్వారా స్థానిక ఎన్నికలు గెలవడానికి ప్రయత్నించిందని, ప్రశ్నించే వారిని బెదిరించి, తప్పుడు కేసుల్లో ఇరికించిందని ఆమె ఆరోపిస్తూ ఉద్యమం చేశారు. జగన్ ప్రభుత్వం విపక్ష నాయకులపై ఫోన్ ట్యాపింగ్ ద్వారా అణచివేతకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్య విలువలను ఉల్లంఘిస్తోందని ఆమె ఆరోపించారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మద్యం, ఇసుక మాఫియాను ప్రోత్సహించిందని, ఇది ఆర్థిక, ఆరోగ్య సమస్యలకు దారితీసిందని విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని "దౌర్జన్యం" గా అభివర్ణిస్తూ, ఇది ప్రజల భూములను ఆక్రమించడానికి వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. మొత్తంగా పార్టీని ముందుకు నడిపిస్తూ పెద్ద పోరాటమే చేయించారు.

### 2024 ఎన్నికల్లో పార్టీ విజయాలు

2024 ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిగా తెలుగుదేశం, జనసేనతో కలిసి పోటీ చేసింది. కూటమి గెలుపులో బీజేపీ సహకారం కీలకమైనది. పురందేశ్వరి రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గం నుండి విజయం సాధించారు. ★

# ఎవరి వాదాలూ కాదు... అమ్మ 'మత'మే సమ్మతం



లోకంలో ఎవరికి వారు 'తమ గడియారం మాత్రమే సరైనది'అన్నట్లు భావిస్తుంటారు. క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు తమ గడియారం (మతం) మాత్రమే సరైనది అంటారు. కానీ అమ్మా 'ఓ కాళీమాత!. వాస్తవంగా అవి ఏవీ సరైనవి కావు. నిన్ను నిజంగా ఎవరు అర్థం చేసుకోగలరు? ఒక వ్యక్తి కోరికతో నిన్ను ప్రార్థిస్తే నీ కృపకు తప్పక పాత్రుడవుతాడు' అంటారు రామకృష్ణ పరమహంస అమ్మవారిని ఉద్దేశించి. హిందూ మతం ఒక్కటే సనాతనధర్మం. అది నిత్యం. అయితే ఎన్నో అభిప్రాయాలు, మార్గాలు నేను గమనించాను. అవన్నీ పరస్పర గొడవలకు కారణమవుతున్నాయి. 'దేవుడు సర్వస్వం, సర్వాంతర్యామి. అందులో నేను భాగం. ఆయన యజమాని నేను సేవకుడను' అని తుది నిర్ణయానికి వచ్చాను. అంటే.. ఆయనే నేను.. నేనే ఆయన అని అప్పుడప్పుడు అనుకుంటుంటాను' అనేవారు. పరమహంస వివరించిన దానిని బట్టి వేద దార్శనికత వేద'విజన్' అనే సనాతన ధర్మం సుస్పష్ట మవుతుంది. ప్రతి ఒక్కరు ఆయన కచ్చితమైన, లోతైన అవగాహనను అవగతం చేసుకోవాలి. 'సర్వవ్యాప్త చైతన్యమే బ్రహ్మం. ఆ బ్రహ్మమే కాళీ మాత. బ్రహ్మం నిరాకారం. సృష్టి అంతా బ్రహ్మ మయం. స్వీయ పరిజ్ఞానం/ ఆత్మజ్ఞానం పొందడమే మోక్షం. అదే మానవుడి అంతిమ లక్ష్యంగా చెబుతారు.

అబ్రహమిక్ మతాలు ముఖ్యంగా ఇస్లాం, క్రైస్తవాలు రామకృష్ణ దృక్పథానికి భిన్నమైనవి. ఆయా మతాలు విగ్రహారాధనను ద్వేషిస్తాయి. ఆయన తిరస్కరించిన 'పాపం' అనే అంశం ప్రాతిపదికగా క్రైస్తవం ఉంటుంది. ఇక స్వర్గాన్ని చేరుకోవడమే ఇస్లాం లక్ష్యం. స్వర్గం చేరడం ఎందుకు? వంద రెట్లు ఆనందం పొందాలనే తలంపుతోనా? బాల్యచేష్టలుగా పరిగణించే రామకృష్ణ ఎన్నడూ అ వాదాలను ఆమోదించడు. పాపాలను తిరస్కరించడమే కాదు... మానవ అంతిమ లక్ష్యం మోక్ష సాధనకు అది అడ్డంకి అని వివరించాడు. ఆయన సందేశాలను అభినందించి, స్వీకరించాల్సిందిపోయి విభిన్న మనస్తత్వం గల కొందరు హిందువులే తమ సొంత వ్యాఖ్యానాలు, అర్థాలతో ఆయన ప్రతిపాదించిన ఈశ్వరదర్శనాన్ని మసకబారుస్తున్నారు. దూకుడు తత్వం గల ఆ రెండు మతాలను హిందుత్వంతో సమానంగా పరగణిస్తున్నారు. అదే సమస్య సృష్టిస్తోంది. 'అన్ని మతాలు సమానం. దేవుళ్లు అందరూ సమానం కనుక ఏ దేవుడినైనా పూజించవచ్చు. అన్ని మతాల లక్ష్యం ఒక్కటే' లాంటి ప్రకటనలు అత్యధిక హిందువులను ప్రభావితం చేస్తాయి. కొందరు స్వార్థపరులు తెచ్చిన ఈ వాదనలు క్రైస్తవ, ముస్లిం మతాలు హిందూ మతానికి విఘాతం కలిగించేందుకు దారులు చూపుతున్నాయి. ఫలితంగా సంపన్నులు, ఉన్నత వర్గాలకు చెందిన హిందువులు కూడా క్రైస్తవంలోకి మారుతున్నారు. ఇది అత్యంత తీవ్ర సమస్య. దురదృష్ట వశాత్తు, స్వీయ నిర్లక్ష్యం (స్వయం కృతాపరాధం) ఇతర మతాలకు ఊతం ఇచ్చినట్లయింది. ఇది స్వీయ వినాశనమే తప్ప మరొకటి కాదు. హిందువులకు, సంప్రదాయవాదులకు ఇంతకంటే పెద్ద విషాదం ఏముంటుంది? పరిస్థితి అలా ఉన్నప్పటికీ, రామకృష్ణది వేద దార్శనికతని, అందుకు ఆయన క్రైస్తవం, ఇస్లాంలను ఆచరించలేదంటూ, ఆయన విధానాన్ని ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపకులు స్వామి దయానంద చక్కగా విశ్లేషించారు.

(సమాప్తం)



**'Know the Irrefutable Facts And Protect Hindu Dharma' నుంచి**

**పూజ్య స్వామి దయానంద సరస్వతి**

(సంకలన కర్త)

# గాంధీల గ్రహణంలో నెహ్రూ ఉత్తరాయణం

భారతదేశం సొంత జమానా అన్నట్టు ఇంతకాలం గాంధీ-నెహ్రూ కుటుంబం వ్యవహరించింది. ఇందుకు సంబంధించి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని వెనక ఉండి నడుపుతున్న సోనియాగాంధీ మీద ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. వాటికి తాజాగా మరొక వివాదం తోడైంది. గాంధీ-నెహ్రూ కుటుంబానికీ, తీన్‌మూర్తి భవన్‌లోని ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ యాజమాన్యానికీ మధ్య తలెత్తిన వివాదం ఇదే. సోనియా గాంధీ గతంలోనే ఈ మ్యూజియం నుంచి తీసుకువెళ్లిన 51 పెట్టెల ఉత్తరాలు, పత్రాలు తిరిగి అప్పగించాలని యాజమాన్యం కోరుతోంది. ఇందుకు సంబంధించి మూడుసార్లు నోటీసులు కూడా వెళ్లాయి. ఈ వివాదంలో ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీ యాజమాన్యం న్యాయపరమైన చర్యలు తీసుకునే అవకాశమే ఎక్కువ అని అంతా భావిస్తున్నారు. ఎందుకంటే వాటికి సోనియా జవాబు ఇవ్వలేదు.




కూడా పరిశోధకుల కోసం ఆ పత్రాలు అందుబాటులో ఉంచవలసిన అవసరం గురించి చెప్పారు. దీనికి కూడా సోనియా నుంచి స్పందన లేదు. సోనియా తీరును బట్టే న్యాయ పోరాటానికి దిగాలని మ్యూజియం కమిటీ నిర్ణయానికి వచ్చింది. ఒకసారి ఇలాంటి మ్యూజియంకు కానుకగా ఇచ్చిన పత్రాలు, లేఖలను తిరిగి తీసుకునే హక్కు ఎవరికీ ఉండదు. అది ఆ సంస్థ ఆస్తిగానే ఉండిపోతుంది. అయితే ఈ న్యాయ పోరాటమంటూ మొదలయితే, గాంధీ కుటుంబానికీ, మ్యూజియం యాజమాన్యానికీ మధ్య కొత్త రగడ ఆరంభమైనట్టే. గత ఏడాది ఈ అంశం పార్లమెంట్‌లో కూడా చర్చకు వచ్చింది.

నిజానికి నెహ్రూ లేఖలను సోనియా గాంధీ ఎందుకు అక్కడ నుంచి తరలించారో కూడా తెలియడం లేదు. వాటిలో కొన్ని 1971లో ఇందిరా గాంధీ, ఇంకొన్నింటిని తరువాత సోనియా గాంధీలే ఈ మ్యూజియంకు అప్పగించారు. కారణాలు ఏమైనా ఎడ్వినాకు నెహ్రూ రాసిన లేఖలు ప్రజలకు అందుబాటులో ఉంచరాదని 2008లో సోనియా గాంధీ చేసిన అభ్యర్థన మేరకు వాటిని వేరు చేశారు. కాగా నెహ్రూ అసలు లేఖలను అప్పగించవలసిందని మ్యూజియం యాజమాన్యం కోరడం మరొక విశేషం. ఎడ్వినాకు నెహ్రూ రాసిన లేఖలతో పాటు మొత్తం 51 పెట్టెల నిండా ఉత్తరాలను సోనియా గాంధీ తీసుకుపోయారని గత ఏడాది బీజేపీ ఆరోపించింది. అప్పుడు ఆమె యూపీఏ చైర్‌పర్సన్. ఆ ఉత్తరాలలో ఏమున్నదో, మరీ ముఖ్యంగా ఎడ్వినా మౌంట్ బాటన్‌కు రాసిన లేఖలలో ఏం ఉన్నదో ప్రశ్నార్థమేనని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు. ఆ ఉత్తరాలు సెన్సార్ చేయవలసిన స్థితిలో ఉన్నాయా అని కూడా ప్రశ్నించారు. ఈ లేఖలను తిరిగి మ్యూజియంకు అప్పగించడంలో రాహుల్ గాంధీ సహకారం ఉంటుందని ఆశిద్దామని కూడా ఆయన అన్నారు. ఆ ఉత్తరాలను 2010లో డిజిటలైజ్ చేద్దామని అనుకుంటున్న తరుణంలో సోనియా గాంధీ తరలించారని కూడా పాత్ర గుర్తు చేశారు. నిజానికి 2014లోనే నెహ్రూ లేఖలను బహిర్గతం చేయడానికి సోనియా నిరాకరించారు. అప్పుడే వీటి మీద దేశంలో మరింత ఆసక్తి రేగింది. అయితే పరిశోధకుల ఆసక్తి వేరు. చరిత్ర రచనలో ఏర్పడిన శూన్యతను నింపడానికి ఇలాంటి వ్యక్తిగత సమాచారం చాలా సందర్భాలలో ఉపకరిస్తుంది. సోనియా తన వద్ద ఉంచుకున్న నెహ్రూ వ్యక్తిగత లేఖలు కూడా ఇస్తే చరిత్ర రచనకు ఎంతో మేలు చేసిన వారు అవుతారని వారు అంటున్నారు. ఇప్పుడు మ్యూజియంలో లభ్యమవు తున్నవి కేవలం అధికారిక పత్రాలు. నిజానికి నెహ్రూ లేఖలపై ప్రధాని కార్యాలయానికి అధికారం లేదు. ఆ అధికారం సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖదే. నాటి రక్షణమంత్రి కృష్ణమేనన్ లేఖలు, పత్రాలను చదవాలంటే ప్రధాని కార్యాలయం అనుమతి కావాలి. ఇక చరణ్‌సింగ్, జీవీ మావ్‌లంకర్, దేవదాస్ గాంధీ, ఆర్ఎన్ కావా

ఆ ఉత్తరాలలో ఎడ్వినా మౌంట్‌బాటన్‌కు నెహ్రూ రాసిన ఉత్తరాలు కూడా ఉన్నాయని ఒక అంచనా. ఈ ఉత్తరాలను తీన్‌మూర్తి భవన్‌లో భద్రపరిచారు. 1971 నుంచి 2008 వరకు అక్కడే ఉన్నాయి కూడా. ఈ వివాదం జూన్ 23న జరిగిన మ్యూజియం 47వ సర్వసభ్య సమావేశం సందర్భంగా మళ్లీ ముందుకొచ్చింది. మ్యూజియం యాజమాన్యంలో భాగస్వాములు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు.

ఇంతకీ 2008లో ఏం జరిగింది? 51 పెట్టెల నిండా నెహ్రూ వ్యక్తిగత ఉత్తరాలు, పత్రాలు నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి చేరాయి. భారత్ ఆఖరి వైస్రాయ్ మౌంట్‌బాటన్ భార్య, నెహ్రూ సన్నిహితురాలు ఎడ్వినాకు రాసిన లేఖలతో పాటు, ఐన్‌స్టీన్, జయప్రకాశ్ నారాయణ్, విజయలక్ష్మీ పండిట్, బాబూ జగ్జీవన్‌రామ్ వంటివారి ప్రత్యుత్తరాలు కూడా ఉన్నాయని చెబుతారు. భవిష్యత్తులో పరిశోధనకు ఉపయోగపడడానికి ఈ ఉత్తరాలను తిరిగి మ్యూజియంకు చేర్చాలన్నదే ప్రస్తుత యాజమాన్యం ఉద్దేశం. 2024లో ఇందుకు సంబంధించి ప్రయత్నం మొదలయింది. ఆ పత్రాలు భవిష్యత్తులో జరిగే పరిశోధనకు ఎంతో కీలకమని, కాబట్టి పరిశోధకులకు అందుబాటులో ఉండాలని ప్రొఫెసర్ రిజ్వాన్ కాద్రి (మ్యూజియం యాజమాన్య కమిటీ సభ్యుడు) రాహుల్, సోనియా గాంధీలకి నిరుడు లేఖలు రాశారు. కానీ ఈ లేఖకు ఆమె సమాధానం ఇవ్వలేదు. ఈ సంవత్సరం ఆరంభంలో కూడా సోనియాకు మరొక లేఖ పంపారు. అందులో


సోనియా, రాహుల్



తీన్‌మూర్తి భవన్ ఎదుట నెహ్రూ భౌతికకాయం

వంటి వారి ఉత్తరాలు చదవాలంటే వారసుల అనుమతి అవసరం. విజయలక్ష్మి పండిత్‌కు చెందిన లేఖలను ఆమె కుమార్తె నయనతారా సెహెగల్ అందరికి అందుబాటులో ఉంచడానికి అంగీకరించక, దాచి పెట్టారు.

దీనితో పాటు మరొక వివాదం కూడా బయటకు వచ్చింది. ఇటీవల తీన్‌మూర్తి భవన్‌లో మ్యూజియంకు సంబంధించి జరిగిన సమావేశంలో యాజమాన్యం ఆ వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువచ్చింది. ఆ వివాదం ఏమిటి? తీన్‌మూర్తి భవనం ప్రాంగణంలోనే జవాహర్‌లాల్ నెహ్రూ స్మారక నిధి కార్యాలయం ఉంది. ఇది అక్షరాలా కాంగ్రెస్ పార్టీ ఆక్రమణలో ఉంది. దీనిని ఖాళీ చేయాలని ఆదేశిస్తూ 2018లో పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ విభాగం ఒకటి ఆ పార్టీకి తాఖీదులు ఇచ్చింది. ఆ కార్యాలయం ఉన్న భవనం దేశానికి సంబంధించిన ఆస్తి కాబట్టి అద్దెకు ఇవ్వడం, అక్రమంగా నివాసం ఉండడం చట్ట వ్యతిరేకమని కాంగ్రెస్‌కు పంపిన లేఖలో పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలియచేసింది. కానీ అక్కడే పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇంకొక ముందడుగు వేయకుండా కాంగ్రెస్ కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకుంది. దీనితో ఆ భవంతిని ఖాళీ చేయించే పని నిలిచిపోయింది. అయితే ఇంతకాలం అయినా మ్యూజియం యాజమాన్యం కాంగ్రెస్ నిర్వాకం మీద న్యాయ పోరాటం చేయకుండా మిన్నకుండడం సరికాదని కొందరు సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రజాధనంతో నిర్మించిన ఒక భవంతిని ఒక రాజకీయ పార్టీ ఆక్రమిస్తే చెల్లదని నిపుణులు చెబుతున్నారు.

ఆ 51 పెట్టెలలో బయటకు పోయిన నెహ్రూ లేఖలు, ఇతర పత్రాల విషయంలో చాలా ప్రశ్నలే ఉన్నాయి. మ్యూజియం యాజమాన్యంలోని కొందరు సభ్యుల అంచనా ప్రకారం అవన్నీ నెహ్రూ వ్యక్తిగత లేఖలు, పత్రాలు మాత్రమే అయి ఉంటాయని అనుకోనవసరం లేదని, కొన్ని ప్రభుత్వ పత్రాలు, లేఖలు కూడా ఉండి ఉంటాయనే వారి అనుమానం. అయితే ఆ లేఖలు, పత్రాలు అన్నీ నెహ్రూ వ్యక్తిగత మైనవని గాంధీ కుటుంబ సభ్యుల వాదన. అయినా, ప్రథమ ప్రధాని లేఖలు కుటుంబ ఆస్తి ఎలా అవుతాయి? ఏమైనా వాటిని మళ్లీ తీన్‌మూర్తి భవన్‌కు చేర్చడం, కాంగ్రెస్ కబ్జా చేసిన భవంతిని స్వాధీనం చేసుకోవడం అనివార్యమని మ్యూజియం యాజమాన్యం గట్టిగా భావిస్తోంది. ఏ విధంగా చూసినా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నిర్వాకం మీద న్యాయ పోరాటం చేయక తప్పదు. ఆ భవనం నిర్మించినది పన్నుచెల్లింపు దారుల ధనంతోనే. ఇవే కాకుండా, ఇప్పుడు మరొక ప్రశ్న కూడా వస్తున్నది. ప్రథమ ప్రధానికి చెందిన పత్రాలు, లేఖలు బయటికి పంపడానికి తీన్‌మూర్తి భవన్ నాటి నిర్వాహకులు ఎలా అంగీకరించారు? దీని మీద దర్యాప్తు చేయించాలని కూడా ప్రస్తుత యాజమాన్యం భావిస్తున్నది. ఇవన్నీ చూస్తుంటే చారిత్రక ప్రాధాన్యం, ప్రజాధనం ఇతర అంశాల కంటే గాంధీ కుటుంబం తనకు తోచినట్టు చేయడమే పనిగా పెట్టుకుంది. నేషనల్ హెరాల్డ్ కేసు, యంగ్ ఇండియా ఉదంతం, ఇప్పుడు తీన్‌మూర్తి భవన్ వ్యవహారాలు ఇందుకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ★



# దాచినా దాగని ఎమర్జెన్సీ వాస్తవాలు

**ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి యాభయ్యేళ్లు నిండాయి. అయిదు దశాబ్దాల అనంతరం కూడా ఈ అత్యవసర పరిస్థితి దారుణాలు ప్రజల మనసుల్లో నుంచి చెరగకపోవడమే కాదు, ఆ అగ్నిని రాజేస్తూనే ఉన్నాయి. ఎమర్జెన్సీకి సంబంధించి అనేక కొత్త విషయాలు, దాచినా దాగని వాస్తవాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఎమర్జెన్సీతో ముడిపడిన అకృత్యాలు, అమానుషాలు, దారుణాలను పాత జ్ఞాపకాల కింద పక్కన పెట్టేసే అవకాశం లేదు.**

ఎందుకంటే ఇది వ్యక్తిగత వ్యవహారం కాదు. ఇది ఒక దేశాన్ని, ఒక జాతిని, ఒక సంస్కృతిని తీవ్రంగా దెబ్బతీసిన పరిణామం. దీన్ని భారతదేశ చరిత్ర ఏనాటికీ మరచిపోయే అవకాశం లేదు. ఎమర్జెన్సీని ఎత్తేసిన తర్వాత గానీ, ప్రజల భావోద్వేగాలు బయటపడలేదు. ఎవరు హీరోలు, ఎవరు విలనన్నది అవగతం కాలేదు. ఎమర్జెన్సీ సమయంలో దేశమంతా కటకటాల పాలయినప్పటికీ, ఇందిరాగాంధీకి, ఎమర్జెన్సీకి సంబంధించిన వివరాలను, వికృతాలను ప్రపంచ ప్రజలకు కరపత్రాల పంపిణీ ద్వారా తెలియజేసి, ప్రపంచ దేశాల దృష్టిని ఆకట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఎప్పటికీ మరచిపోలేనివి. ఈ కరపత్రాల గురించి దేశ ప్రజలకు పూర్తి వివరాలు తెలియకపోవడంతో వీటి వెనుక ఉన్న పోరాట యోధుల గురించి తెలిసే అవకాశం లేకుండా పోయింది. ఈ ఎమర్జెన్సీ కాలంలో కరపత్రాలు పోషించిన పాత్ర అమోఘమైనది. వీటి ద్వారానే ఇందిరా గాంధీ నిరంకుశ విధానాలు, నెహ్రూ–గాంధీ కుటుంబ స్వార్థపూరిత ఆశలు, ఆకాంక్షలు దేశ ప్రజలకే కాక, ప్రపంచ ప్రజలకు కూడా తెలియడం జరిగింది. ఈ కరపత్రాల్లో కొన్ని సంతకాలతో ముద్రితం కాగా, మరికొన్ని అనామకంగా విడుదలయ్యాయి.



ఇందిరా గాంధీ

అయితే, అవన్నీ సమకాలీన భారతదేశ చరిత్రకు అద్దం పట్టాయనడంలో సందేహం లేదు.

**చరిత్ర సృష్టించిన కరపత్రం**

ఇందులో ఎమర్జెన్సీకి సంబంధించి మొట్ట మొదటగా విడుదలయి, ఆ తర్వాతి కరపత్రాలకు మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిన కరపత్రం ఆ సమయంలో అంతర్జాతీయంగానూ, ఎమర్జెన్సీ తర్వాత జాతీయంగానూ తీవ్రస్థాయి సంచలనం సృష్టించింది. అనేక కష్టనష్టాలను, ఆటంకాలను, అవరోధాలను ఎదుర్కొని ఎట్టకేలకు లండన్ చేరిన ఈ కరపత్రం కొద్ది రోజుల్లోనే ప్రపంచమంతా వ్యాపించిపోయింది. చివరికి అమెరికాలోని ఇండియన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థకు ఈ కరపత్రం చిక్కి, పునర్ముద్రితమై మారుమూల దేశాలకు సైతం చేరింది.

కరపత్రమంతా ఇందిరా గాంధీపై విమర్శలు, ఆరోపణలతో నిండిపోయింది. ఇందిరా గాంధీ మీద రెచ్చగొట్టే విధంగా, ఇందిర వారసత్వాన్ని ప్రశ్నార్థకం చేసే విధంగా ఈ కరపత్రం తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలను వెళ్లగక్కింది. ఈ కరపత్రాన్ని రాసిన తీరును బట్టి దీన్ని తయారు చేసినవారి సిద్ధాంతాలేమిటో తేలికగా అర్థమై పోతుంది. ఇందులో ఇందిరా గాంధీని అంతర్జాతీయ స్థాయి నియంతలతో పోల్చారు. హిట్లర్, ముస్సోలిని, స్టాలిన్ వంటి నియంతల ముందు ఇందిరా గాంధీ బలాదూర్ అని కూడా ఇందులో దృష్టాంతాలతో సహా పేర్కొనడం జరిగింది. ఇందిరా గాంధీ హయాంలో ప్రస్తుతం నాజీ జర్మనీ నాటి పరిస్థితులు నెలకొని ఉన్నాయని ఈ కరపత్రంలో ఉదాహరణలతో సహా వెల్లడించినపుడు ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. అజ్ఞాతంలోనే ఉంటూ ఒక పోరాటాన్ని ఎలా జరపవచ్చున్నది ఇది తేటతెల్లం చేసింది.

కరపత్రంలోని ప్రతి పేరాలోనూ ఇందిరా గాంధీని ఒక నియంతగా, ఒక ఫాసిస్టుగా అభివర్ణించారు. సుమారు అయిదు వేల పదాలతో సాగిన ఈ కరపత్రంలో ఇందిరా గాంధీని 'ఇందిరా నెహ్రూ గాంధీ' అనే సంబోధించడం గమనించాల్సిన విశేషం. నియంతృత్వం, అధికార దాహం అనేవి ఆమె రక్తంలోనే ఉన్నట్టు ఈ కరపత్రం చెప్పకనే చెప్పింది. మొఘులుల కాలంలోనే కాదు, బ్రిటిష్ వారి కాలంలో కూడా ఇంతటి దమనకాండ, అణచివేతలు, ఊచకోతలు, నిరంకుశ ధోరణులు జరిగిన దాఖలాలు లేవని అది స్పష్టం చేసింది. మహాత్మా గాంధీ అమలుచేసిన అహింసా విధానం కాలంలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణవాదులు కూడా ఇంతగా అణచివేత చర్యలకు పాల్పడలేదని, ప్రజలు మౌనంగా ఉండిపోవడంతో ఇందిరా గాంధీ మరింతగా చెలరేగిపోతున్నారని ఆ కరపత్రం ప్రత్యేకంగా పేర్కొంది. "బ్రిటిష్ పాలకులకైనా అంతరాత్మ ఉందేమో కానీ కాంగ్రెస్ పార్టీకి, దాని పాలకులకు ఎక్కడా అంతరాత్మ, దయాదాక్షిణ్యాలు ఉన్న దాఖలాలు కనిపించలేదు. చరిత్ర పుటల్లో ఇందిరా గాంధీ ఒక నియంతగా నిలిచిపోవడం ఖాయం" అని ఆ కరపత్రం పేర్కొంది.



జార్జ్ ఫెర్నాండెజ్



జి.రాజశుక
సీనియర్ జర్నలిస్ట్

**పాంఫ్లెట్ యోధుడు**

ఇంతకూ ఆ కరపత్రాన్ని రూపొందించింది మరెవరో కాదు. సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాకు నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్. గోపాల్పురా నుంచి ఆయన 1975 జూన్ 26న ఆ చారిత్రాత్మక కరపత్రాన్ని, విదేశాలకు పంపించారు. గోపాల్పురాలో ఆయన తన భార్య లీలా కబీర్ కుటుంబ సభ్యులకు చెందిన ఒక బంగళాలో తలదాచుకున్నారు. దేశంలోని రాజకీయ నాయకులందరినీ ఇందిరా గాంధీ అరెస్టు చేయిస్తున్న సమయంలో ఆయన తప్పించుకుని గోపాల్పురా వెళ్లిపోయి, అజ్ఞాతంలో ఉండిపోయారు. అమెరికాలోని ఇండియన్స్ ఫర్ డెమొక్రసీ అనే సంస్థ ఆ కరపత్రాన్ని 1975 జూలై 1 తిరిగి ముద్రించారు. అంటే, అది భారత దేశం నుంచి బయటపడి, లండన్ చేరుకుని, అక్కడి నుంచి అమెరికా వెళ్లడానికి వారం రోజులకు పైగా పట్టింది. ఈ కరపత్రానికి ఒక ఉపోద్ఘాతం కూడా ఉంది.

ప్రజాస్వామ్యం గురించి, నిరంకుశత్వం గురించి మహాత్మా గాంధీ, జయప్రకాశ్ నారాయణ్, రాం మనోహర్ లోహియా వంటి వారు చెప్పిన అక్షర సత్యాలను ఆ ఉపోద్ఘాతంలో పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ఇటువంటి నిరంకుశ ధోరణులను ప్రదర్శించడంలో వింతేమీ లేదని, ఆమె 1966 నుంచి ఈ విధమైన ధోరణులను ప్రదర్శిస్తూనే ఉన్నారని అంటూ, ఆమె పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత నుంచి పార్టీని అవకాశవాదులు, ఫిరాయింపుదార్లు, కాలక్షేపరాయుళ్లు, భజనపరులు, సంఘ వ్యతిరేక శక్తులతో నింపేయడం ప్రారంభించారని ఆ కరపత్రం వివరంగా పేర్కొంది. ఎమర్జెన్సీని ఒక చీకటి యుగంగా, ఇందిరాగాంధీని ఒక దుష్ట శక్తిగా కూడా ఫెర్నాండెజ్ ఈ కరపత్రంలో అభివర్ణించారు. అసత్యాలు చెప్పడంలో, వాటిని ప్రచారం చేయడంలో ఆమె గ్లోబెల్‌ను మించి పోయారని, ఆమె సాగించిన దమనకాండ, ఊచకోతలను చూస్తే ఉగాండా నాయకుడు ఇడీ అమీన్ కూడా నిర్ఘాంతపోతాడని ఆయన పేర్కొన్నాడు.

ఇక 1971 నాటి ఎన్నికల సమయంలోనే ఆమెలోని నిరంకుశ ధోరణులు బయటపడ్డాయని, ఆమె ఒక మీసాలు లేని హిట్లర్‌గా వ్యవహరించారని, అనేక రాష్ట్రాల్లోకమ్యూనిస్టు, సోషలిస్టు నాయకులను అరెస్టు చేయించారని, కార్మిక సంఘాలను మూసేయించారని ఆయన పేర్కొన్నారు. అప్పటి రైల్వే మంత్రి ఎల్.ఎన్. మిశ్రాను హత్య చేయించడం, సుప్రీంకోర్టు న్యాయమూర్తి కారు మీద బాంబులు విసరడం వంటి సంఘటనలను ఆయన ఉదహరిస్తూ, ప్రతిపక్షాలు గనుక అధికారంలోకి వచ్చే పక్షంలో తన బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, ఊచకోతలు, అవినీతి వ్యవహారాలన్నీ వెలుగులోకి వస్తాయని, తనను జైలుపాలు చేయడం ఖాయమని భయపడి ఆమె దేశంలో ఎమర్జెన్సీని విధించి ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయించారని ఫెర్నాండెజ్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి మౌనంగా ఉన్న ప్రజలు ఆమెకు తగిన గుణపాఠం చెప్పే రోజు వస్తుందని, ప్రస్తుతం గుసగుసలుగా సాగుతున్న ఇందిర వ్యతిరేక ప్రచారం త్వరలో ప్రభంజనంగా మారడం ఖాయమని ఫెర్నాండెజ్ చివరిలో హెచ్చరించారు. ★

# జ్ఞాన'జ్యోతు'లకు జోతలు



**గురువంటే వెలుగు. వెలుగు జ్ఞానానికి ప్రతీక. గురు ఆరాధన దేవతారాధన కంటే గొప్పదని పురాణాలు చెబుతున్నాయి. 'గురు బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః' అంటూ గురువును త్రిమూర్త్యాత్మక స్వరూపునిగా ఆరాధించడం భారతీయ సంప్రదాయం. జన్మనిచ్చిన తల్లిని, హితాన్ని చేకూర్చే తండ్రిని, జ్ఞానాన్ని పంచిన గురువును పూజించమంటోంది మన భారతీయ సంస్కృతి. ఆ 'మూర్తిత్రయం'కు గురుపూర్ణిమ సందర్భంగా అక్షరాంజలి.**

విజ్ఞానం, లౌకిక జ్ఞానాలను సమన్వయ పరచి శిష్యుడికి దిశానిర్దేశం చేసేవాడే గురువని, దృఢమైన మానసిక సంకల్పం, శక్తిమంతమైన వాక్కు, వాత్సల్యంతో కూడిన స్పర్శ ఆయన ప్రధాన లక్షణాలని ఆర్యోక్తి. జ్ఞానంలో నిష్ణాతుడు, అసూయ లేనివాడు, నిరాడంబర జీవనం సాగించేవాడు, ఆత్మజ్ఞాన సంపన్నుడు నిజమైన గురువని ఉపనిషత్తులు పేర్కొంటున్నాయి. శాంతుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, కులీనుడు, వినయవంతుడు, పరిశుద్ధుడు, ఆచారవంతుడు, మంచి వేషధారణ కలవాడు, గౌరవనీయుడు, పవిత్రుడు, బుద్ధిమంతుడు, మంత్ర తంత్రాలలో నిష్ణాతుడు, నిగ్రహానుగ్రహశక్తుడు గురువు అనిపించుకుంటాడని ***('శాంతో దాంతః కులీనశ్చ వినీత శుద్ధవేషవాన్/శుద్ధాచార సుప్రతిష్ఠః శుచిర్దక్షః సుబుద్ధిమాన్/ఆధ్యాత్మ జ్ఞాననిష్ఠశ్చ మంత్రతంత్ర విశారదః/ నిగ్రహాన గ్రహేశక్తో గురురిత్యభి ధీయతే')*** శాస్త్రం చెబుతోంది. అలాంటి వారు పరిమితంగానే కనిపిస్తారు కనుకే గురు శబ్దానికి అంత ప్రత్యేకత. అలాంటి సర్వలక్షణ సమన్వితుడు కనుకే వ్యాస భగవానుడి పేరిట ఆషాఢ పౌర్ణమి 'గురు పూర్ణిమ'గా ఆవిర్భవించింది. ఆయన గురువులకు గురువని భారతీయుల విశ్వాసం.

అపారమైన తన రచనల ద్వారా ధర్మనిరతిని ప్రబోధించిన వ్యాసుడిని భారతీయ ఆధ్యాత్మిక ఆచార్యుల ప్రధాన ప్రతినిధిగా పూజిస్తారు. ***'వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం'*** అన్నారు. ప్రాచీన ఆధునిక వాఙ్మయానికంతటికి వ్యాస వాఙ్మయమే మూలంగా చెబుతారు. వేదవిభజన చేసి, అష్టాదశ పురాణాలను, మహా భారతాన్ని రాసిన ఆయన లోకకల్యాణం కోసం ఆ వాఙ్మయాన్ని శిష్యులు పైల, సమంత, జైమిని, వైశంపాయనుల ద్వారా ప్రచారం చేయించారు. తన కుమారుడు శుకమహర్షి ద్వారా భాగవతాన్ని, సూత ముని ద్వారా పురాణ గాథలను ప్రచారం చేయించి సమాజంలో నైతిక, ధార్మిక విలువలను పెంపొందించారు.

'గు కారో అంధకారశ్చ రు కారో తన్నిరోధకః'– అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గం వైపు మళ్లించేవాడు గురువు అని అర్థం. ఆయన బ్రహ్మనిష్ఠుడు. పవిత్రుడు, పరిశుద్ధుడు, నిష్కపటుడు అయి ఉండాలి. సూర్యుడు అందరికి సమానంగా వెలుగునిచ్చినట్లు గురువు శిష్యుల పట్ల సమాన వాత్సల్యం, కృప కలిగి ఉండాలి. శిష్యుడూ.. శంకరులు చెప్పినట్లు ***'అవినయ మపనయ విష్ణో'***– 'నా అవినయాన్ని తొలగించి, వినయం నేర్పించు' అని వినయశీలురై గురువును సేవించాలి. గురువే ప్రత్యక్ష దైవం అనే నమ్మకంతో అనుసరించేవాడే శిష్యుడు. అతనికి గురు, దైవ సన్నిధుల మధ్య వ్యత్యాసం తెలియదు. హిరణ్యకశిపుడు కుమారుడు ప్రహ్లాదుని చదువు విషయం ప్రస్తావించినప్పుడు ***'చదివించిరి నను గురువులు/చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రములు..'*** అని ప్రారంభించడంలో ప్రహ్లాదుడి గురుభక్తి వ్యక్తమవుతోంది. గురువులు బాగా బోధించబట్టే ఇన్ని విద్యలు నేర్చాను తప్ప, తాను బాగా చదివానని, అంతా తన గొప్పదనం, ప్రతిభేనని చెప్పుకోలేదు. అదీ గురుభక్తి. ఉత్తమ విద్యార్థికి ఉండవలసిన లక్షణంగా చెబుతారు.

యాగ రక్షణకు బయలుదేరిన శ్రీరాముడితో గురువు విశ్వామిత్రుడు, తమకు తారసిల్లిన తాటకను వధించవలసిందిగా ఆదేశించాడు. 'స్త్రీవధ మహా పాపం' అన్నది శ్రీరాముడికి చదువు నేర్పిన సంస్కారం. కానీ గుర్వాజ్ఞను శిరసా వహించాడు. అంతకు ముందే 'మహర్షిని అనుసరిస్తున్న రాముడితో 'ముని ఆదేశాన్ని శిరసావహించు' అన్న తండ్రి దశరథుడి హితవును, గురువు వాక్యాన్ని శిరోధార్యంగా భావించి, తాటక స్త్రీ అయినా పరిమార్చాడు. అయినా మౌని వద్ద తన సందేహాన్ని వ్యక్తం చేసి, ధర్మసూక్ష్మాలు తెలుసుకున్నాడు. 'సత్యాన్న ప్రమదితవ్యం'.. (సత్యం నుంచి తొలగిపోకు. ఎల్లప్పుడూ సర్వలోక హితకరమైన పనులే చేయడానికి ప్రయత్నించు' అని బోధించాడు విశ్వామిత్రుడు.కానీ కొన్ని సందర్భాల్లో పరస్పర విరుద్ధ పనులూ చేయవలసి ఉంటుంది. తాటక సంహారం అలాంటిదే. రాజులు, రాజకుమారులు, ఉన్నతాధికారంలోని వారు తప్పక విశేష ధర్మాన్నే ఆచరించాలి' అని ధర్మసూక్ష్మం బోధించాడు కౌశికుడు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

సద్గురువును ఎలా సేవించాలి? ఆయన నుంచి జ్ఞాన సంపదను ఎలా పొందాలి? అనే దానిని జగద్గురువు గీతాచార్యుడు చెప్పాడు.

***'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః'***

(మహనీయులైన గురువులకు పాదాభివందనం చేసి తన మనస్సులోని సందేహాలను సవినయంగా విన్నవించి, సునిశిత ధర్మసూక్ష్మాలను గ్రహించి, సత్ఫలితాలు పొందే మార్గం తెలుసుకోవాలి.) ఆదిశంకరులు ధర్మదండధారులై ధర్మరక్షణ కోసం తన శిష్యులను పీఠాధిపతులుగా చేసి ఒక పరంపరను ప్రవేశపట్టారు. ఆ పీఠాల మాధ్యమంగా ధర్మప్రబోధం, ధర్మ ప్రచారం నేటికీ కొనసాగుతోంది.

'గోవిందుడు, గురువు సాక్షాత్కరిస్తే మొదట గురువుకే నమస్కరిస్తాను. గురువు ద్వారానే గోవిందుడిని చూస్తాను' అన్నాడు కబీరు.

దైవం నుంచి గురువును చూపలేకపోవచ్చేమో కానీ గురువు నుంచి దేవుడిని దర్శించవచ్చన్నది పెద్దల మాట. నూరుగురు సూర్యులు, నూరుగురు చంద్రులు ఉదయించినా తొలగని అజ్ఞానాంధకారం విద్వాంసులు, విజ్ఞులైన గురువుల ఉపదేశంతో పటాపంచలవుతుందంటారు. అయితే 'కేవలం పాండిత్యం వల్లనే ఉత్తమ గురువు కాలేరు. తగు పాండిత్యం ఉన్నా శిష్యులకు ఎలా నేర్పుగా బోధించాలో తెలిసిన వాడే ఉత్తమ గురువు. ఉత్తమత్వాన్ని నిర్ణయించేది బోధనాశక్తే కానీ పాండిత్యం కాదు' అన్నది కవికులగురువు మహాకవి కాళిదాసు భావన తరతరాల గురువులకు ఆదర్శనీయం. ★



**అంతరిక్షం 1991లో గల్ఫ్ యుద్ధం నాటి నుంచి ఒక యుద్ధక్షేత్రంగా రూపుదిద్దుకుంటూ వచ్చింది. ఇటీవల ప్రపంచమంతటా చోటు చేసుకున్న ఘర్షణలు రోదసీని ఒక కీలకమైన రణరంగంలా తీర్చిదిద్దాయి. అంతరిక్షం నుంచి గూఢచర్యం చేయవచ్చు. నిఘా పెట్టవచ్చు. కావలసిన దానిని లక్ష్యంగా చేసుకోవచ్చు. కమ్యూనికేషన్లు పెంచుకోవచ్చు. నావిగేషన్ ద్వారా వైరిపక్షం ఆనుపానులు తెలుసుకోవచ్చు. అలా తెలుసుకున్న తర్వాత గురిపెట్టడానికి అంతరిక్షంలో సరైన చోటు చూసుకోవచ్చు. ఇలా స్వీయ భద్రత, శత్రువు నుంచి ముంచుకువచ్చే ముప్పు తదితర అంశాలకు సంబంధించిన ఎన్నో పనులను రోదసి నుంచి చక్కపెట్టుకోవచ్చు. అందుకనే అంతరిక్షం మీద మంచి పట్టు సంపాదించుకున్న దేశాలు దానిని సైనిక ఘర్షణలకు ఒక వేదికగా చూడటం మొదలుపెట్టాయి.**

ఇప్పటిదాకా యుద్ధాలకు అనువుగా ఉన్న నింగి, నేల, నీరు కన్నా కూడా వాటికంటే ఎంత ఎత్తులో ఉన్న రోదసిలో సొంత స్థావరాలను నిర్మించుకునే పనిలో పడ్డాయి. అంతరిక్షాన్ని సైనికీకరణ చేస్తున్నాయి. కౌంటర్ స్పేస్ టెక్నాలజీ అభివృద్ధికి మార్గం సుగమం చేస్తున్నాయి. ఆ క్రమంలో అంతరిక్షాన్ని సైనిక కార్యకలాపాలకు వాడుకోవాలనుకునే దేశాలకు కౌంటర్‌స్పేస్ వ్యూహాలు ఎంతో అవసరమైపోయాయి. ఇదే విషయాన్ని సెక్యూర్ వరల్డ్ ఫౌండేషన్ తన 2025 ఎడిషన్ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించింది. రోదసీలో నానాటికి పెరిగిపోతున్న కౌంటర్‌స్పేస్ బెదదలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైతే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 12 దేశాలు కౌంటర్‌స్పేస్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో తలమునకలై ఉన్నాయి. అంతరిక్షం రోజురోజుకూ ఇరుకైపోతూ వివాదాస్పదమైన ప్రాంతంగా మారిపోతోంది. దీంతో రోదసిపై పట్టుసాధించడానికి దేశాలు నువ్వా? నేనా? అంటూ పోటీపడుతున్నాయి. ఈ పోటీ కాస్త కౌంటర్‌స్పేస్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి దారి తీస్తోంది. అలా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలతో అంతరిక్షంలో ప్రత్యర్థుల వ్యవస్థలను మభ్యపెట్టవచ్చు, వాటికి అడ్డుపడవచ్చు. వాటిని తోసిరాజనవచ్చు. మరీ అవసరమనుకుంటే అలాంటి వ్యవస్థలను అక్కడికక్కడే నామరూపాల్లేకుండా చేయవచ్చు.

ఇప్పటివరకు భూమి ఉపరితలానికి మాత్రమే పరిమితమైన కౌంటర్‌స్పేస్ సామర్థ్యాలను ప్రచ్ఛన్నంగా వాడుకుంటున్నారు. నాన్ కైనెటిక్ ఎత్తుగడలైన జామింగ్ వంటి వాటిని ప్రస్తుతం సైనిక కార్యకలాపాల్లో చురుకుగా వినియోగిస్తున్నారు. అయితే కాలం గడిచే కొద్దీ, సాంకేతికత కొత్త పుంతలు తొక్కే కొద్దీ కైనెటిక్ ఎత్తుగడలతో పాటుగా దెబ్బకు దెబ్బ తీసే కౌంటర్ సామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రపంచదేశాలు వేగిరపడుతున్నాయి. కౌంటర్ స్పేస్ సామర్థ్యాలను ఎలక్ట్రానిక్ ఆయుధాలు- ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్-ఈడబ్ల్యూ, కైనెటిక్ ఆయుధాలు, డైరెక్టెడ్ ఎనర్జీ ఆయుధాలు అని మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఇవి భూమి ఆధారంగా లేదా రోదసి ఆధారంగా పనిచేస్తాయి.

**కౌంటర్‌స్పేస్ సామర్థ్యాలు**
**జామింగ్ ఆపరేషన్స్ :**

ఇవి ఉపగ్రహాల కమ్యూనికేషన్ లింకులను (అప్‌లింక్, డౌన్‌లింక్) జామ్ చేయడానికి రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నళ్లను వాడుకుంటాయి. అమెరికా, చైనా, రష్యా దేశాలకు పటిష్టమైన ఈడబ్ల్యూ సామర్థ్యాలు ఉన్నాయనే పేరు ఉంది. ఇటీవల రష్యా 'కళింక' అనే సిస్టమ్‌ను ఉపయోగించి ఉక్రెయిన్‌లో స్టార్ లింక్ సిగ్నళ్లను జామ్ చేసింది. అదేసమయంలో స్టార్ లింక్ సిగ్నళ్లను వాడుకోని సిస్టమ్‌లు ఎక్కడ ఉన్నాయో కూడా కనిపెట్టింది. రష్యాకు ఇప్పటికైతే పటిష్టమైన కౌంటర్‌స్పేస్ జామింగ్ సామర్థ్యాలు ఉన్నట్టు కనిపిస్తోంది. వాతావరణ వివరాలను సేకరించడానికి, కమ్యూనికేషన్ల కోసమని వినియోగించే ఉపగ్రహాల్లో అత్యధికం జియోసింక్రోనస్ కక్ష్యలో పరిభ్రమిస్తూ ఉంటాయి. దీంతో చైనా తన జామింగ్ సామర్థ్యాలను పరీక్షించుకోవడం కోసమని అదే కక్ష్యలో ఒక ఉపగ్రహాన్ని మోహరించింది. అమెరికా ప్రపంచవ్యాప్తంగా కౌంటర్ కమ్యూనికేషన్ల సిస్టమ్-సీసీఎస్‌ను ఏర్పాటు చేసింది. సీసీఎస్‌తో కమ్యూనికేషన్ల ఉపగ్రహాల జామింగ్‌ను అప్‌లింక్ చేస్తోంది. అయితే అంతరిక్షంపై పట్టు సాధించడానికి పోటీ పడుతున్న దేశాలు తమ ఉపగ్రహాలు ఎలాంటి జామింగ్‌కు గురికాకుండా అందుకు దీటైన సామర్థ్యాన్ని సైతం పెంపొందించుకుంటున్నాయి.

**యాంటీ శాటిలైట్ సామర్థ్యం-ఏశాట్:**

ఇందులో వినియోగించే ఆయుధాలు మూడు రకాలుగా ఉంటాయి. ప్రత్యక్ష ఆరోహణ పూర్వక కైనెటిక్ కిల్ వాహనం వీటిలో మొదటిది. ఇది బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించే వాహనాన్ని వాడుకొని తనకు అప్పగించిన పని ని చక్కబెడుతుంది. ఇక రెండవది కో-ఆర్బిటల్ కైనెటిక్ కిల్. ఇది సొంత ఉపగ్రహాన్ని వాడుకుంటుంది. చివరగా మూడవది అంతరిక్ష నౌక. ఇవన్నీ కూడా భూమికి సమీపంలోని కక్ష్య-లియో లేదా భూస్థిర కక్ష్య-జియోలో లక్షిత ఉపగ్రహాన్ని నిర్వీర్యం చేస్తాయి. అమెరికా, రష్యా, చైనా, భారత దేశాలకు ప్రత్యక్ష ఆరోహణ ఏశాట్ సామర్థ్యం ఉంది.

**సమీప కక్ష్యల్లో కార్యకలాపాలు-**
**కో-ఆర్బిటల్ ఆపరేషన్లు:**

అమెరికా, రష్యా, చైనా దేశాలు కో-ఆర్బిటల్ ఆపరేషన్లను చేయడానికి అవసరమైన కొన్ని సామర్థ్యాలను కలిగి ఉన్నాయి. చైనా, రష్యా దేశాలు అంతరిక్షంలో తమ నిర్దిష్టమైన, సామీప్యమైన కార్యకలాపాలు-ఆర్‌పీవోలను చురుగ్గా పరీక్షించుకుంటున్నాయి. సాధారణంగా ఆర్‌పీవోలు కైనెటిక్ (దాడి చేయడం ద్వారా నిర్మూలించడం), నాన్-కైనెటిక్ (పరిశీలించడం, దారికాయడం) గానూ ఉంటాయి. అమెరికా అయితే వచ్చే ఏడాదికి అంటే 2026కు పెద్ద పథకమే వేస్తోంది. ఆ దేశం లియోలో ఉన్న పేలోడ్‌లు లేదా ఉపగ్రహాలను ఇతర కక్ష్యలోకి త్వరితగతిన వెళ్లడాన్ని పరీక్షించనుంది. అమెరికన్ స్పేస్ ఫోర్స్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం చైనా ఈ ఏడాది మార్చి 24 నుంచి ఏప్రిల్ మధ్యకాలంలో మూడు షియాన్-24సీ ఉపగ్రహాలు, రెండు షిజాన్ సిరీస్ ఉపగ్రహాలను కలుపుకొని మొత్తం ఐదు ఉపగ్రహాలతో అంతరిక్షంలో ఆర్‌పీవో చేపట్టింది. ఈ ఉపగ్రహాలు అనేక కక్ష్యల్లో ఆర్‌పీవో కార్యకలాపాలను చేపడతాయి. అలా చేపట్టే కార్యక్రమాల్లో నిర్దేశిత కక్ష్యల్లో పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలను పక్కకు తప్పించి, దారి మళ్లించే పని కూడా ఉంటుంది. రష్యా ఆర్‌పీవో లక్ష్యాల కోసమని లియోలో అత్యంత వేగంగా పరిభ్రమించే రెండు ఉపగ్రహాలను మోహరించింది. ఆ దేశం ఉపగ్రహాలపై గూటిలోని బొమ్మ విధానాన్ని కూడా పరీక్షించింది. ఈ విధానంలో ఒక చిన్న ఉపగ్రహం ఒక పెద్ద ఉపగ్రహం నుంచి రోదసిలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత అది కౌంటర్ ఉపగ్రహ కార్యకలాపాలను



# రణరంగ రోదసి

చేపడుతుంది. మిగిలిన మూడు దేశాలు ఆర్‌పీవో చేపట్టినప్పటికీ అవి ఇప్పటివరకు సమీప కక్ష్యలో కైనెటిక్ ఏశాట్‌ను వాడుకున్న దాఖలాలైతే లేవు. ఫ్రాన్సు సైతం ఆర్‌పీవో కోసమని ఓ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఆ కార్యక్రమం లక్ష్యం బెదడగా పరిణమించిన ఉపగ్రహాల కోసం తీవ్రంగా వెదకడం, ఆ తర్వాత వాటిని దీటుగా ఎదుర్కోవడం. ఇదిలా ఉండగా అమెరికా, చైనా దేశాలు నిర్దేశిత కక్ష్యల్లోకి పేలోడ్‌లను విడుదల చేసే ఎక్స్37బీ, షెన్‌లోంగ్ అనే అంతరిక్ష విమానాల పనితీరునూ పరీక్షించాయి.

**డైరెక్టెడ్ ఎనర్జీ ఆయుధాలు-డీయీడబ్ల్యూలు:**

డైరెక్టెడ్ ఎనర్జీ ఆయుధాలు అధునాతన పోకడలతో కౌంటర్‌స్పేస్ కార్యకలాపాలకు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. కౌంటర్‌స్పేస్ కార్యకలాపాలకు హై-ఎనర్జీ లేజర్లు, హై-పవర్ మైక్రోవేవ్‌లను వినియోగించుకుంటారు. డీయీడబ్ల్యూలు సెన్సర్లను పనిచేయకుండా చేస్తాయి. హై-ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్‌లు ఉపగ్రహ కమ్యూనికేషన్‌ను జామ్ చేయగలవు. అత్యంత శక్తిమంతమైన లేజర్లు ఉపగ్రహాలను ఎందుకూ పనికిరాని విధంగా మారుస్తాయి.

రష్యా భూమి కేంద్రంగా, సాగర జలాల్లో నౌక కేంద్రంగా పనిచేసే లేజర్లను అభివృద్ధి చేస్తోంది. ఈ లేజర్లు సెన్సర్లు, ఉపగ్రహాలను జామ్ చేయగలవు. అదే సమయంలో వాటిని నిర్వీర్యం కూడా చేయగలవు. అమెరికా అనేక సంవత్సరాలుగా భూమి కేంద్రంగా పనిచేసే లేజర్ల అభివృద్ధిపై కసరత్తు చేస్తోంది. చైనా పోతున్న పోకడలను చూస్తే అది సమీపకాలంలో అంతరిక్షం కేంద్రంగా పనిచేసే డీయీడబ్ల్యూలను అభివృద్ధి చేసే అవకాశం ఉంది. రష్యా సైతం భూమి ఆధారిత లేజర్ వ్యవస్థలను కలిగి ఉంది. ఆ దేశం లియోలో ఉపగ్రహాలను నిర్వీర్యం చేయడానికి పనికి వచ్చే గగనతల లేజర్ వ్యవస్థ అభివృద్ధి పైన కూడా గట్టి కసరత్తు చేస్తోంది.

**సైబర్ దాడులు:**

అంతరిక్షంలో కార్యకలాపాలు పూర్తిగా సైబర్ పైన ఆధారపడి ఉన్నాయి. స్పేస్ భద్రత, సైబర్ భద్రత నెమ్మదిగా విలీనమైపోతున్నాయి. రోదసీలో వ్యవస్థలపై గ్రౌండ్ స్టేషన్లు, డేటా రిలే సెంటర్లు సైబర్ దాడులు చేయవచ్చు. మిగిలిన దాడులతో పోల్చి చూసినప్పుడు ఈ దాడులకు పెద్దగా ఖర్చు ఉండదు. ఈరకమైన దాడులను చాలా వేగంగా చేయవచ్చు. దాడులు ఎవరు చేసిందీ కనిపెట్టడమూ కష్టమే. సర్వసాధారణంగా రోదసిలో సైబర్ దాడులు జరిగాయనేందుకు ఎలాంటి ఆధారాలు ఉండవు. అయితే ప్రత్యర్థి దేశాలు, ప్రభుత్వేతర సంస్థలు ఇలాంటి దాడులకు తెగబడుతుంటాయి. సాధారణంగా మిలటరీ ఉపగ్రహాలు, భూమి నుంచి వాటికి మద్దతు ఇచ్చే వ్యవస్థలు ఈ దాడులకు తట్టుకొని నిలబడుతుంటాయి. అయితే వాణిజ్య ప్రయోజనాల కోసమని వినియోగించే ఉపగ్రహాలపై దాడి జరిపేందుకు లెక్కకు అందనన్ని ప్రయత్నాలు జరుగుతుంటాయి. ప్రపంచ దేశాలు ఈ ప్రయత్నాలకు సంబంధించిన ఒక సమాచార నిధిని సమకూరుస్తాయి. ఆ నిధిని మిలటరీ ఉపగ్రహాలు లేదా ఏకకాలంలో అనేక కార్యకలాపాలను చేపట్టే ఉపగ్రహాలను దాడుల నుంచి కాపాడుకోవడానికి వినియోగిస్తుంటారు. ప్రస్తుతం మనం సైబర్ సెక్యూరిటీలో అనుసరించే విధానాన్ని క్వాంటమ్ కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫీ అందిపుచ్చుకున్న అధునాతన సాంకేతికత పూర్తిగా మార్చివేస్తుంది.

**స్పేస్ సిట్యుయేషనల్ అవేర్‌నెస్-ఎస్ఎస్ఏ:**

అంతరిక్షం ఉపగ్రహాలు, తదితర పేలోడ్‌లతో నానాటికి కిటకిటలాడిపోతూ వివాదాస్పదమైపోతున్న తరుణంలో స్పేస్ సిట్యుయేషనల్ అవేర్‌నెస్-ఎస్ఎస్ఏ మిలటరీ కార్యకలాపాల్లో ప్రాముఖ్యతను పొందింది. ఎస్ఎస్ఏ అంటే రోదసీలో ఉండేవాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటి స్థితిగతులను అంచనా వేయడం. అయితే ఏకకాలంలో రెండు విధాలుగా కార్యకలాపాలను చేపట్టే ఉపగ్రహాలు ఎస్ఎస్ఏ పనితీరును సవాల్ చేస్తున్నాయి. అదేసమయంలో ఎస్ఎస్ఏ కౌంటర్ స్పేస్ కార్యకలాపాలకు ఒక పైలట్‌గా పనిచేస్తుంది.

అమెరికా అత్యంత అధునాతనమైన ఎస్ఎస్ఏను కలిగి ఉందని సమాచారం. అమెరికా ఎస్ఎస్ఏ పెద్ద సంఖ్యలో భూమిపైన రాడార్లు, టెలిస్కోపులు, రోదసి ఆధారిత రాడార్లపై ఆధారపడి ఉంటుంది. ఎస్ఎస్ఏ సంతరించుకున్న దేశాలు వాటి మిత్రదేశాలు, భాగస్వామ్య దేశాల నుంచే అందే ఇన్‌పుట్‌లతో ఆ సామర్థ్యాన్ని మరింతగా వృద్ధి చేసుకుంటాయి. రష్యా కూడా లియోలో ఉపగ్రహాలను పర్యవేక్షించే పటిష్టమైన ఎస్ఎస్ఏ వ్యవస్థను కలిగి ఉంది. చైనా సైతం ఎస్ఎస్ ఏ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నప్పటికీ





అది ప్రాథమికంగా తన సొంత సరిహద్దులపై ఆధారపడి ఉంది. దాంతో దాని సామర్థ్యం అమెరికాతో పోల్చినప్పుడు పరిమితంగానే ఉంటుంది. చైనా ఈ పరిమితిని అధిగమించడానికని కక్ష్యలోకి ఉపగ్రహాలను పంపిస్తోంది. భారత్, ఫ్రాన్సు, ఇజ్రాయెల్, తదితర దేశాలు మౌలికమైన ఎస్ఎస్ఏ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

**భారత్ స్థానం**

భారత ప్రభుత్వం ఇటీవల అంతరిక్షం ఆధారిత నిఘా–3 ప్రోగ్రామ్‌కు ఆమోదం తెలిపింది. డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఇటీవల ఒక సదస్సులో మాట్లాడుతూ త్వరలో కొత్త అంతరిక్ష విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. ప్రస్తుతానికి భారత్ విషయానికి వచ్చేసరికి రోదసీలో గూఢచర్యం, నిఘా, నిశిత పరిశీలన–ఐఎస్ఆర్‌లో పరిమితమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. భారతీయ ప్రాంతీయ గమనాగమన ఉపగ్రహ వ్యవస్థ–ఐఆర్ఎన్ఎస్ఎస్ సముదాయానికి మొదటగా 12 ఉపగ్రహాలను అందించాలని ప్రణాళిక చేశారు. కానీ వాటిలో ఐదు ఉపగ్రహాలు మాత్రమే పూర్తిగా సేవలను అందిస్తు న్నాయి. ప్రస్తుతం ఒక ప్రభావితమైన ఐఎస్ఆర్ కోసమని, ఐఆర్ఎన్ఎస్ఎస్ సముదాయాన్ని పూర్తిచేయ డానికి సరిపడినంత సంఖ్యలో ఉపగ్రహాలను మోహరింపజేయడమే లక్ష్యంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ది సెక్యూర్ వరల్డ్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం భారత్‌కు లియోలో కైనెటిక్ ఏశాట్, ఈడబ్ల్యూ, ఎస్ఎస్ఏలలో కొంతమేరకు సామర్థ్యం ఉంది. మార్చి 27,2019న భారత్ 'మిషన్ శక్తి' పేరిట కైనెటిక్ ఏశాట్‌ను విజయవంతంగా పరీక్షించింది. భూమికి దగ్గర్లోని ఒక కక్ష్యలో బాలిస్టిక్ మిస్సైల్ ఇంటర్‌సెప్టర్ పీడీవీ ఎంకే–2 ను ప్రయోగించి నిరుపయోగంగా ఉన్న 'మైక్రోశాట్–ఆర్' అనే భారతీయ ఉపగ్రహాన్ని ధ్వంసం చేసింది.

> **జనవరి 16, 2025న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ–ఇస్రో స్పేస్ డాకింగ్–స్పాడెక్స్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. రెండు వ్యోమనౌకలను డాక్, డీ–డాక్ చేయడంలో భారత్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ ప్రయోగం భూమికి సమీపంలోని కక్ష్యలో రక్షణ్మాతక, తెగువతో కూడుకున్న కౌంటర్‌స్పేస్ ఆపరేషన్లలో ఆర్‌పీవోకు అగ్రగామి అవుతుంది.**

జనవరి 16, 2025న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ–ఇస్రో స్పేస్ డాకింగ్–స్పాడెక్స్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. రెండు వ్యోమనౌకలను డాక్, డీ–డాక్ చేయడంలో భారత్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ ప్రయోగం భూమికి సమీపంలోని కక్ష్యలో రక్షణ్మాతక, తెగువతో కూడుకున్న కౌంటర్‌స్పేస్ ఆపరేషన్లలో ఆర్‌పీవోకు అగ్రగామి అవుతుంది. కౌంటర్‌స్పేస్ ఆపరేషన్లకు అదనపు బడ్జెట్, వనరులు కావాలి. ప్రస్తుతం కొనసాగుతున్న మిలటరీ స్పేస్ ప్రోగ్రామ్‌కు సమాంతరంగా కౌంటర్‌స్పేస్ సామర్థ్యం పెంపుదలలో పురోగతి సాధించాలి. భారత్ మిలటరీ ఆపరేషన్లలో విజయం సాధించాలంటే అంతరిక్షంలో మన ఆస్తులను భద్రంగా చూసుకోవడం చాలా ముఖ్యం. అందు కోసమని స్పష్టత కలిగిన విశ్వసనీయమైన కౌంటర్‌స్పేస్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ఏశాట్, స్పేస్ డాకింగ్ లాంటి పరీక్షలు లాంటి చిన్న చిన్న అడుగులు నమ్మకపు తీరానికి చేరుస్తాయి. కానీ స్పష్టమైన ఎస్ఎస్ఏతోనే అవి విజయవంతమవుతాయి. కనుక భారత్ ఏశాట్, కో–ఆర్బిటల్ సిస్టమ్స్, ఈడబ్ల్యూలు (భూమి ఉపరితలం నుంచి రోదసికి, రోదసి నుంచి రోదసికి), డీయాడబ్ల్యూలు లాంటి అనేక ఆయుధాలను తన అమ్ములపొదిలోకి చేర్చుకోవాలి. అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్సు లాంటి మిలటరీ దిగ్గజాలు అంతరిక్షాన్ని ఒక యుద్ధక్షేత్రంగా గుర్తించాయి. ఆ దేశాలు తదనుగుణంగా స్పేస్ విజన్, స్పేస్ ఆపరేషన్లను అమలు చేయడానికి స్పేస్ బలగాలు లేదా స్పేస్ కమాండ్‌లను ఏర్పాటు చేసుకున్నాయి. 2019లో భారత్ డిఫెన్స్ స్పేస్ ఏజెన్సీ–డీఎస్ఏను ఒక త్రివిధ సేవల ఏజెన్సీగా నెలకొల్పింది. డీఎస్ఏ ప్రస్తుతం పరిమితమైన మానవ వనరులతో, అధికారాలతో పనిచేస్తోంది. ఈ ఏజెన్సీ పరిధిని విస్తృతపరిచి, దాన్ని ఒక స్పేస్ కమాండ్‌గా ఉన్నతీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ నేపథ్యంలో అంతరిక్షం ఒక పూర్తి స్థాయి యుద్ధక్షేత్రంగా రూపాంతరం చెందుతోంది. రోదసిలో మిలటరీకరణ కొత్త పుంతలు తొక్కుతోంది. అంతరిక్షంలో చోటు కోసమని అంతకంతకూ పెరిగిపోతున్న గిరాకీ భారత్‌కు అనేక అనుకూలతలను తెచ్చిపెడుతోంది. భారత్ విశ్వసనీయమైన కౌంటర్‌స్పేస్ ఆపరేషన్‌ల ద్వారా రోదసిలో తన ఆస్తులను కాపాడుకోగలిగే సామర్థ్యాన్ని సృష్టించుకుంటుంది. అయితే ఇది ఏదో ఒక సామర్థ్యాన్ని తెచ్చిపెట్టు కోవడంతో అయ్యే పనికాదు. మిషన్లను విజయ వంతంగా చేపట్టడంలో రకరకాల ప్రత్యామ్నాయా లతో కూడుకున్న సామర్థ్యాన్ని సృష్టించుకోవాలి. కౌంటర్‌స్పేస్ సామర్థ్యాల విషయానికి వచ్చేసరికి చైనా భారత్ కన్నా ముందంజలో ఉంది. అయితే ఇక్కడ విషయం చైనాతో పోటీపడటం గురించి కాదు. ముంచుకొచ్చే ముప్పులను దీటుగా ఎదుర్కొనగలిగే విశ్వసనీయమైన నిరోధక శక్తికి సంబంధించినది.

ఎస్ఎస్ఏ అనేది కౌంటర్‌స్పేస్ ఆపరేషన్లు చేపట్టడానికి సరిగ్గా సరిపోతుంది. ఏశాట్, స్పేస్ డాకింగ్, లాంటి విజయవంతమైన వాటిని అవసర మైన చోట, అవసరమైన వేళ వినియోగించుకునే వెసులుబాటును అందిస్తున్నాయి. వీటికి కార్యాచరణకు ఉపకరించే సామర్థ్యంగా రూపుదిద్దాల్సిన అవసరం ఉంది. అప్పుడే వాటిని స్వల్ప వ్యవధిలో రంగంలోకి దించగలము. అంతరిక్షంపై ఆధిపత్యం కోసమని చైనా, అమెరికా పరస్పరం పోటీపడుతున్న సమయంలో, చైనాతో అంతంతమాత్రపు సంబంధాలను మాత్రమే కలిగి ఉన్న భారత్ రోదసిలో అంతకంతకూ పెరిగి పోతున్న స్పేస్, కౌంటర్‌స్పేస్ ముప్పును ఏ మాత్రం ఉపేక్షించరాదని నిపుణులు సూచిస్తున్నారు. మన మిలటరీ ఆపరేషన్లకు అండగా నిలుస్తున్న రోదసిలోని మన ఆస్తులను కాపాడుకునే సామర్థ్యాన్ని మనం అత్యవసరంగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది వారి భావన.

– జాగృతి డెస్క్



# శుక్లా ప్రయోగం.. వృద్ధులకు వరం

భారత వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం-ఐఎస్ఎస్‌లో నిర్వహిస్తున్న ఏడు కీలక ప్రయోగాలలో ఒకటైన గురుత్వాకర్షణ లేని వాతావరణంలో కండరాల క్షీణతపై అధ్యయనం, వృద్ధులలో వయసు సంబంధిత కండరాల క్షీణత-సార్కోపీనియా చికిత్సకు కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఈ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో బయోటెక్నాలజీ విభాగం-డీబీటీ సహకారంతో, నాసా సహాయంతో నిర్వహిస్తోంది.

**మైయోజెనెసిస్ ప్రయోగం**

శుక్లా నిర్వహిస్తున్న మైయోజెనెసిస్-ఇస్రో ప్రయోగం మానవ అస్థిపంజర కండరాల కణాలు గురుత్వాకర్షణ లేని వాతావరణంలో ఎలా ప్రవర్తిస్తాయో, వాటి పునరుత్పాదన సామర్థ్యం, మైటోకాండ్రియల్ జీవక్రియలో వచ్చే మార్పులను అధ్యయనం చేస్తుంది. ఈ ప్రయోగంలో కండరాల స్టెమ్ కణాలను వృద్ధి చేసి, వాటిని ఐఎస్ఎస్‌లో గురుత్వాకర్షణ లేని పరిస్థితులలో పరీక్షిస్తారు. ఈ అధ్యయనం దీర్ఘకాల అంతరిక్ష యాత్రలలో కండరాల క్షీణతను నివారించే మార్గాలను కనుగొనడంలో సహాయపడుతుంది.

గురుత్వాకర్షణ లేని వాతావరణంలో కండరాలు భూమిపై సాధారణంగా చేసే పనిని చేయనవసరం లేకపోవడంతో, కండరాల క్షీణత-అట్రోఫీ సంభవిస్తుంది. ఈ పరిస్థితి వృద్ధులలో సార్కోపీనియా అనే వయసు సంబంధిత కండరాల క్షీణతను పోలి ఉంటుంది. ఇది 60 ఏళ్లు పైబడిన వారిలో సాధారణంగా కనిపిస్తుంది. అంతరిక్షంలో కండరాల క్షీణత చాలా వేగంగా, కొన్ని రోజులలోనే సంభవిస్తుంది. ఇది భూమిపై దశాబ్దాలలో జరిగే క్షీణతకు సమానంగా ఉంటుంది.

**వృద్ధులకు ఎలా ఉపయోగపడుతుంది?**

ఈ ప్రయోగం భూమిపై వృద్ధులలో సార్కోపీనియా చికిత్సకు కొత్త ఆవిష్కరణలకు దారితీసే అవకాశం ఉంది. ప్రస్తుతం సార్కోపీనియాకు వ్యాయామం, జీవనశైలి మార్పులు, పోషకాహారం తప్ప ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ -ఎఫ్‌డీఏ ఆమోదిత ఔషధాలు లేవు. అయితే ఈ ప్రయోగంలో శుక్లా కండరాల కణాలపై కొన్ని ఔషధాలను పరీక్షిస్తున్నారు. ఇవి కండరాల క్షీణతను నివారించడంలో లేదా పునరుత్పాదనను మెరుగు పరచడంలో సహాయపడతాయి. ఈ ఔషధాలు కండరాల కణాలు కొవ్వుగా మారకుండా నిరోధించడంతో పాటు, గురుత్వాకర్షణ లేని వాతావరణంలో వచ్చే కొన్ని ప్రతికూల ప్రభావాలను తగ్గించాయని పరిశోధకులు కనుగొన్నారు.

ఈ ప్రయోగం ద్వారా కండరాల పునరుత్పాదనలో మైటోకాండ్రియా (కణాల శక్తి కేంద్రాలు) పాత్రను అర్థం చేసుకోవడంలో కీలక సమాచారం లభిస్తుంది. అంతరిక్షంలో కండరాల క్షీణతకు కారణమయ్యే జన్యు మార్పులు, జీవక్రియ మార్పులను అధ్యయనం చేయడం ద్వారా వృద్ధులలో కండరాల బలం, పనితీరును కాపాడే కొత్త చికిత్సలను అభివృద్ధి చేయవచ్చు. ఈ పరిశోధన ఫలితాలు కండరాల వ్యాధులు లేదా దీర్ఘకాలం మంచానికి పరిమితమై పోయి కండరాల క్షీణతను ఎదుర్కొనే రోగులకు కూడా ఉపయోగపడవచ్చు.

**శుక్లా మిషన్**

గ్రూప్ కెప్టెన్ శుక్లా జూన్ 25, 2025న నాసాకు చెందిన కెనడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌకలో ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. ఆయన అక్సియం మిషన్ 4లో మిషన్ పైలట్‌గా పనిచేస్తున్నారు. ఇందులో అమెరికా, పోలాండ్, హంగరీ నుంచి మరో ముగ్గురు వ్యోమగాములు ఉన్నారు. 14 రోజుల ఈ మిషన్‌లో, ఆయన మొత్తం 60 సైన్స్ ప్రయోగాలు, వాణిజ్య కార్యకలాపాలలో పాల్గొంటారు. వీటికి భారతదేశం సహా 31 దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఈ ప్రయోగం దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రలకు అవసరమైన ఆరోగ్య వ్యూహాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. ఈ ప్రయోగం ద్వారా భారతదేశ అంతరిక్ష పరిశోధన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే కాకుండా, వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో కూడా ఒక కొత్త అధ్యాయానికి పలకవచ్చునని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

**సామాజిక ప్రభావం**

ఈ పరిశోధన ఫలితాలు వృద్ధుల జీవన నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై ఆర్థిక భారాన్ని కూడా తగ్గించగలవు. సార్కోపీనియా వల్ల  కింద పడే వృద్ధులకు అయ్యే గాయాలు ఆసుపత్రి ఖర్చులను పెంచుతాయి. కొత్త చికిత్సల ద్వారా కండరాల బలాన్ని కాపాడగలిగితే వృద్ధులు స్వతంత్రంగా జీవించగలుగుతారు. ఆరోగ్య సంరక్షణ వ్యయాలు తగ్గుతాయి.

అంతేకాకుండా ఈ ప్రయోగం భారతదేశ యువ శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు అంతరిక్ష జీవ విజ్ఞాన పరిశోధనలో పాల్గొనేందుకు ప్రేరణనిస్తుంది. శుక్లా ఈ మిషన్ ద్వారా భారతదేశ యువతకు ఒక స్ఫూర్తిగా నిలుస్తారు. శాస్త్రీయ ఆవిష్కరణలు మానవ జీవన నాణ్యతను ఎలా మెరుగుపరుస్తాయో చూపిస్తారు. ఐఎస్ఎస్ నుంచి భూమికి చేరుకునే మైయోజెనెసిస్ ప్రయోగం ఫలితాల డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషిస్తారు. కండరాల క్షీణతను నివారించే ఔషధాలు, చికిత్సలను అభివృద్ధి చేయడానికి పనిచేస్తారు. 2025 చివర్లో మరిన్ని కండరాల చిప్‌లను ఐఎస్ఎస్‌కి పంపడం ద్వారా ఈ పరిశోధనను విస్తరించే ప్రణాళిక ఉంది. ఈ రెండవ దశ ప్రయోగంలో కండరాల పునరుత్పాదనను మెరుగుపరిచే కొత్త ఔషధ సమ్మేళనాలను పరీక్షించే అవకాశం ఉంది.

ఈ మిషన్ ద్వారా భారతదేశం అంతరిక్ష పరిశోధనలో, శాస్త్రీయ ఆవిష్కరణలలో తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతోంది.

**- డాక్టర్ కాకాని పృథ్వీరాజు**
**సంఘటనా కార్యదర్శి,**
**ఆరోగ్యభారతి, ఆంధ్రప్రదేశ్**



# తెగువ

పల్నాటి యుద్ధం, బాలనాగమ్మ
మనకు బాగా తెలిసిన ప్రదర్శనల పేర్లు.
మాంచాల, నాగమ నాయకురాలు
మనం ఎంత కాలంగానో వింటున్న పాత్రలు.
ఇదే కోవలో... మరెన్నో పురాణ, చారిత్రక,
జానపద కళాపోషణలు.
ఈ అన్నీ సందర్భాల్లోనూ ఇప్పటికీ మన మనోనేత్రం ముందు
నిలిచే ఉంటారు. ఎవరు? శ్రీలక్ష్మి రేబాల!
విశేషం ఏమిటీ అంటే –
మాంచాలగా ఆమె ఆనాడు ఇచ్చింది శతాధిక ప్రదర్శనలు!
ఏనాడు అంటే... అర్ధశతాబ్దం కిందట.
సాంస్కృతిక ఉత్సవాలనగానే మొదట వినిపించింది తన పేరే!
ప్రధానంగా మాంచాల పాత్ర పోషణ.
ఎవరు ఆ మాంచాల, ఏమిటి ఆ కథ?

బ్రహ్మనాయుడు కుమారుడు బాలచంద్రుడు. అతడి భార్యే మాంచాల. పల్నాటి యుద్ధం అంటే– నాగమ్మ నాయకత్వంలోని నలగామరాజు సేనకి, బ్రహ్మనాయుడి నేతృత్వంలోని మలిదేవరాజు సైన్యానికీ నడుమ పోరు.

సంగ్రామ సీమకు వెళ్లాల్సిన బాలచంద్రుడు ఆ మాటే మరిచాడు. సతీమణి చెంతన చేరి సల్లాపాలు ఆరంభించాడు. అప్పుడు భర్తకు కర్తవ్య బోధ చేసిందా భార్య.

**క్షణిక సుఖమ్ము కాశపడి క్షత్రియ ధర్మము వీడిరేని ధా**
**రణి మిము దిట్టిపోయదె? విలాసములన్ గల శ్రద్ధ సంగర**
**మ్మున గలదా? త్రిలంగజన పూజ్యతనందరె! పారుబోతులై**
**తిని ఒక మూల కూర్చొనుట ధీరుల కర్మమె! శూరధర్మమే...**

అంటూ సుతిమెత్తని చురక అంటించింది.

ఇదే సందర్భాన మనకు గుర్తుకు రావాల్సినవి మరికొన్ని:

'పలనాటి వీరచరిత్ర' అనేది శ్రీనాథ కవి ద్విపద కావ్యం. నాటి ధీరగాథల్లో అదే మొదటిదన్న భావనా ఉంది.

*అలనాడు తెలుగునాటను*
*గల నాడులలోన నెన్నగలనాడై అ*
*ప్పలనాడు వెలిగి వెలుగుల*
*వెలనాడై తెలుగువారి వెలగల నాడై*
*కలిమికే లోటు లేదందు బలిమికెందు*
*దీటు గనరాదు లేమికి చోటు లేదు*
*పల్లె నాడెల్ల నాడునుంజెల్లె– ఆంధ్ర*
*మాతృమస్తక మాణిక్య మకుట మనగ!*

అంటుంది సోమశేఖర కావ్యం 'మాంచాల.'

అవిగో.... ఆ అర్థభావ శైలినంతటినీ ప్రేక్షకుల కళ్లముందు ప్రత్యక్షం చేసేది శ్రీలక్ష్మి సహజసిద్ధ నటన.

1957 జులై 12న ఆమె జననం. అంటే – ఈ 12వ తేదీన తన పుట్టినరోజు. తల్లి దుర్గాంబ. తండ్రి సుబ్బారావు.

చిన్నప్పటి నుంచీ ఎంతో కళాపిపాస ఉండేది శ్రీలక్ష్మికి. ఆరేళ్ల చిరుప్రాయంలోనే రంగస్థల వేదికనెక్కింది. నాటకం కాదు – ముందుగా నాట్య ప్రదర్శన లిచ్చింది.

ఆమె ప్రథమ ప్రదర్శనం 'విధికృతం' నాటకం.

అటు తర్వాత అంతా సుకృతం. తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా, అప్పట్లో ఇతర రాష్ట్రాల్లో సైతం ప్రదర్శనలిచ్చారు.

రమణతో పరిచయం ఆ వెంటనే పరిణయానికి దారితీసింది.

ఇంకా ఇంకా విలక్షణత్వం ఏమిటంటే – పల్నాటి యుద్ధం వేదికమీద మాంచాల... శ్రీలక్ష్మి అయితే; నాగమ నాయకురాలి పాత్రను పోషించింది భర్త రమణ! అలా రేబాల దంపతులు, వందకు మించి నాటక ప్రదర్శనలతో ఒక



బాలికలతో
రేబాల శ్రీలక్ష్మి

రికార్డు సృష్టించారు అప్పట్లోనే!

ప్రయోగశీలత; ప్రతిభా సమన్విత అయ్యారిద్దరూ.

*అది నిజంబుగా మధుర సాయం సమయము*
*నాటి ఆమె జీవిత నభోంగణమునందు*
*చంద్రుడుదయించు దా బాలచంద్రుడగుచు*
*అప్పుడామె చకోరియే తప్పకగును!*

*అందము దిద్దుకొన్నయది ఆశలతో పెనవేసుకొన్నదై*
*డెందము; చందనాదులు విలేపన జేసి, కడాని జాళువా*
*పిందెల పేటు నేత వలిపెంబునుగట్టి, సువర్ణ హారముల్*
*సుందర రత్నహారములు సొంపును పెంపొనరింపదాల్చియున్!*

వంటి పద్యభాగాలు నేపథ్యాన వినవస్తుంటే, రేబాల శ్రీలక్ష్మి నటనా వైదుష్యం అమోఘంగా ఉండేది.

**శూరతకు సంబంధించి...**



# మాంచాల!

'నాథా! స్వతంత్ర ప్రాప్తి కోసం పిలుస్తోంది సంగ్రామ రంగం! విజయగౌరవలక్ష్మి మిమ్మల్నే వరించాలని తహతహలాడుతోంది. బలశాలిగా, భాగ్య విధాతగా మీరే నిలవాలని నా మనసూ అన్ని విధాలా ఉబలాటపడుతోంది. తెలుగుతేజం వెల్లివిరియాలని జనగణమంతా ఎదురుచూస్తున్న తరుణమూ ఇదే! మీ శౌర్య దీప్తి ధగధగలాడాలంటే ఇప్పుడు కావాల్సింది కర్తవ్యదీక్ష' అని ఉద్బోధించినపుడు శ్రీలక్ష్మి నట పటిమను చూసి తీరాల్సిందే.

*నావలె నొక్క నాతియగు నాయకురాలి పరాక్రమంబులన్*
*కేవల మృత్యుమూర్తిగ గణించుచు కృంగి కృశించి క్షాత్ర దీ*
*క్షావిధులెల్ల సిగ్గు విడి కల్పెదరె మన నాగు లేటిలో?*
*జీవిత నాయకా! వెలమసింగమటన్నది లేత కోతయే!*

ఇందులో మృత్యుమూర్తి, నాగులేటి, లేతకోత అనే సంభాషణ పదాల ఉచ్చారణ వేళ; ఆ రంగస్థల నటీమణి హావభావ విన్యాసం అపురూపంగా కనిపించేది.

ఆమె మాట, పాట, అడుగు ప్రేక్షక జనరంజకంగా ఉండేవి. అందుకే ఆ రోజుల్లో రంగస్థల ప్రదర్శనల ప్రాంతమంతా జనసందోహంతో నిండి ఉండేది.

*మాతృదేశ సంరక్షకే మానవుండు*
*త్యాగియై జీవితము వినియోగపరచు*
*అట్టి ధీరాత్ముడే పూజ్యుడతని జన్మ*
*సార్థకంబగు నిస్వార్థ చరితుడతడు!*

అనడంలో మాతృభూమి పరిరక్షణాసక్తి ప్రస్ఫుటమవుతుంది. ఇటువంటి సాంస్కృతికత వెల్లివిరిసేలా ఉంటుండేది శ్రీలక్ష్మి నటన.

ఆత్మాభిమానానికీ అపార పౌరుషానికీ పెట్టింది పేరు మగువ మాంచాల. లేత జవ్వనిగా, ధీరతకు ప్రతీకగా ఆవిష్కరించడంలో సంపూర్ణ కృతకృత్యురాలు శ్రీ లక్ష్మి రేబాల. 'కొమ్మన పలికే కోయిలవనుకుంటి / కొదమ సింగానివే వయ్యారీ, అరుదైన సింగారివే' అనిపించుకున్న చరిత. ఈ నేపథ్య, వర్తమానమంతటినీ ధీయుతంగా ప్రదర్శించినందుకే అపురూప రీతిన ప్రజాదరణను అందుకున్నారామె.

ఎప్పుడైనా అంతేకదా! నిబ్బరానికి మారు పేరు స్త్రీ. సాహసోపేత నిర్ణయానికి రావడంలో తానే నేర్పరి. మనోధైర్యమైనా, సమయస్ఫూర్తి తత్పమైనా తన సొంతం. వీటిని అభినయించడంలోని ప్రావీణ్యమే శ్రీలక్ష్మికి ఎంతగానో పేరు ప్రఖ్యాతులు తెచ్చి, సమాదరణను సుసాధ్యం చేసింది.



జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

ఆమె స్వస్థలం గుంటూరు ప్రాంతం. నాట్యం, నటన రంగాలు రెండింటా చక్కని శిక్షణ పొందినవారు.

*చంద్రమతి, శశిరేఖ, దాక్షాయణి*
*తార, వరూధిని, పద్మావతి*
*రుక్మిణి, శాంతిమతి, ద్రౌపది –*

ఇలా ఏ పాత్రకు ఆ పాత్రను ప్రత్యేక శ్రద్ధాసక్తులతో పరిపోషించడం ఆమె అలవాటుగా రూపుదిద్దుకుంది. యుగసంధి, కనక పుష్యరాగం, మండువాలోగిలి, తదితర నాటకాల పేర్లు ఆ నటీమణి వైవిధ్య రీతిని చాటి చెప్తుంటాయి ఇప్పటికీ! కళలకే అంకితమైన జీవితం తనది.

ఏ కళైనా ఎందుకు? సమాజ జాగృతి కోసం.

ప్రదర్శనల పరమార్థం ఏమిటి? ప్రజల ఆలోచనలను ప్రభావితం చేయడానికి. కార్యశీలతను వారిలో విస్తరించడానికి.

అందుకోసమే ఆమె పలు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. రంగస్థలం మీద, దిగువన కూడా ప్రదర్శనలతో మార్పుదలకు అవిశ్రాంతంగా శ్రమిస్తూ వచ్చారు. సమకాలీన రంగస్థల నటీమణుల్లో మేలిమి కళాదీపిక.

మాధ్యమంగా, సాధనంగా ఆకాశవాణిని వినియోగించుకున్నారు శ్రీలక్ష్మి. సామాజిక ప్రయోజనాలు ఆశించి ప్రత్యేకంగా పోటీలు ఏర్పాటుచేసిన ఘనత తనకుంది.

వినోదరంగం తీరుతెన్నులు మారాయి. సరికొత్త ప్రక్రియలు, విధాన పరిణామాలూ చోటుచేసుకుంటున్నాయి. ఎన్నెన్ని మార్పులొచ్చినా, వస్తున్నా, ఇకముందూ ఎదురైనా ఎన్నటికీ మారకూడనిది ఒకటుంది. కళాపిపాస.

ఆ పిపాస కళాకారిణుల్లో, ప్రేక్షకజనావళిలో పుష్కలంగా ఉన్నంతకాలమూ సంస్కృతి, నాగరికత, సామాజికత వర్ధిల్లుతూనే ఉంటాయి. అలా వర్ధిల్ల చేయడంలోని నిపుణత్వమే శ్రీలక్ష్మి రేబాలలో చెక్కుచెదరకుండా ఉంటోంది. తరతరాల మన చరితను వేదికలపైన ప్రత్యక్షం చేస్తోంది.

*'మానవానంద మాధవీ మందిరమున*
*భద్రపీఠిక కొలువయ్యె భాగ్యలక్ష్మి!*
*శ్రీ పదాబ్జ ద్వయమ్ము అర్చింపరావె*
*హృదయ పుష్పాంజలుల్ సమర్పించిపోవె!'*

అంటూ విన్నవించే వేళ... తలపులోకి రావడమే ఆమె చేసిన రంగస్థల సేవ. అంతటి సేవాగుణమే నేటికీ ప్రశంసలు అందుకుంటోందని సంతోషించాలి మనమంతా! ★



# ఇరాన్–ఇజ్రాయె
# ప్రయోజనాల

**ఎట్టకేలకు అమెరికా ప్రమేయంతో ఇజ్రాయెల్–ఇరాన్‌లు యుద్ధాన్ని ఆపాలని నిర్ణయించిన నేపథ్యంలో మధ్య ప్రాచ్యదేశాలు దీనివల్ల కలిగిన లాభనష్టాలపై అంచనాలు వేయడం మొదలుపెట్టాయి. అంతేకాదు ఈ యుద్ధం సందర్భంగా ఈ దేశాల వ్యవహారశైలి అయోమయంగా ఉండటం గమనార్హం. పైకి ఇజ్రాయెల్ దాడులను ఖండించినా, లోపాయికారీగా ఆ దేశంతో ఏ విధమైన ఇబ్బందులు రాకుండా వ్యవహరించాయి. యు.ఎస్.తో కూడా వాటికున్న బలీయమైన ఆర్థిక సంబంధాలు కూడా ఇరాన్‌తో అంటీ ముట్టనట్టు ఉండటానికి మరో కారణం. ఉదాహరణకు జోర్డాన్ సహా 20 ముస్లిం మెజారిటీ దేశాలు, ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని ఖండించాయి. కానీ ఇరాన్ క్షిపణులు, డ్రోన్‌లు తమ గగనతలం గుండా ప్రయాణిస్తున్నప్పుడు జోర్డాన్ కూల్చివేసింది. అదేమంటే తమ దేశ, పౌరుల రక్షణ కోసం ఈ విధంగా చేయాల్సి వచ్చిందని పేర్కొంది. మరి సౌదీ అరేబియా కూడా ఇరాన్‌పై దాడిని ఖండించే ప్రకటనపై సంతకాలు చేసినప్పటికీ, యుద్ధం కొనసాగిన కాలంలో ఇజ్రాయెల్ విమానాలు తమ దేశ గగనతలంపై ఎగిరేందుకు అనుమతించింది. ఈ రెండు దేశాలకు ఇజ్రాయెల్‌తో బలీయమైన సంబంధాలున్నాయి. జోర్డాన్ కైతే యు.ఎస్. ఏటా 1.45 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక ఆర్థిక సహాయం అందిస్తుంది. ప్రపంచంలోని మరే ఇతర దేశానికి ఇంత పెద్దమొత్తంలో యు.ఎస్.ఆర్థిక సహాయం అందదు. సౌదీ అరేబియాకు యు.ఎస్.తో సంబంధాలున్నాయి. ఇక యు.ఎస్.నుంచి అత్యధిక సహాయం పొందుతున్న దేశాల్లో యుక్రెయిన్, ఇథియోపియా, ఇజ్రాయెల్ ఉన్నాయి.**

ఇక పొరుగుదేశమైన ఈజిప్ట్ విషయానికి వస్తే యు.ఎస్. సైనిక సహకారం పొందుతున్నది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా వ్యవహరించ లేదు. ఇదే సమయంలో ఇరాన్‌ను పూర్తిగా సమర్థించ లేని పరిస్థితి! ఈ నేపథ్యంలో యు.ఎస్, ఇజ్రాయెల్ దేశాలకు కోపం రాకుండా అడుగడుగునా జాగ్రత్త పడింది. ఉదాహరణకు జూన్ 14న పాలస్తీనా అనుకూలురు 1500 మంది ట్యునీసియా నుంచి 'గాజాకు సంఘీభావ ర్యాలీ' నిర్వహించగా, సినయ్ పట్టణంలోకి ప్రవేశించకుండా ఈజిప్ట్ దళాలు అడ్డుకున్నాయి. ఈ పట్టణం గాజా సరిహద్దులో ఉంది. ఉగ్రవాదంపై పోరులో యు.ఎస్.తో కలిసి పని చేస్తున్నది. ముఖ్యంగా లిబియా, సూడాన్, గాజా ప్రాంతం నుంచి ఉగ్రవాదులు తమదేశంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం దానికి చాలా ముఖ్యం. దేశంలో శాంతిభద్రతల సమస్య లేకుండా చూసుకో వాలన్నది దాని తాపత్రయం. ఇదే సమయంలో ఏటా 1.3 బిలియన్ల సైనిక సహాయాన్ని అమెరికా నుంచి పొందుతోంది. ప్రస్తుత ఈజిప్ట్ అధినేత అబ్దుల్–ఫతాహ్ ఎల్ సిసి పాలనలో దేశంలో తీవ్రస్థాయిలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనపై ఇంత వరకు ట్రంప్ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఇరాన్ చుట్టుపక్కల దేశాలు తమ అవసరాలు ప్రయోజనాల రీత్యా యు.ఎస్, ఇజ్రాయెల్‌కు కోపం రాకుండా తమ ప్రయోజనాలు దెబ్బతినకుండా వ్యవహరించాయనే చెప్పాలి.



నెతన్యాహు

**ఇరాన్ కట్టడే యు.ఎస్. వ్యూహం**

ఇరాన్‌పై దాడుల ద్వారా ఒక పక్క కట్టడి చేస్తూనే మరోపక్క దాన్ని తన దారికి తెచ్చుకోవడానికి డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే చమురు రాజకీయం నేపథ్యంలో ఇరాన్ పూర్తిగా నాశనం కావడం యు.ఎస్.కు ఇష్టం కాదు. చమురు అవసరాలు, ఇరాన్ అణ్వస్త్రాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవడం దాని ప్రధాన లక్ష్యం. ఇందుకోసం అక్కడ తనకు అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి యత్నిస్తుంది. ఇందుకు బెంజమిన్ నెతన్యాహు ఎలాగూ పూర్తి సహకారం అందిస్తారు. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో నెలరోజుల క్రితం వరకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇప్పుడు ఒక హీరోగా నిలిచిపోయారు. నిజానికి ఇజ్రాయెల్‌కు సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన ఘనత ఆయనదే. సంక్లిష్ట సమయాల్లో చాతుర్యంతో గట్టెంక్కించే సామర్థ్యం ఆయన సొంతం. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆయన పదవీగండం నుంచి బయట పడ్డారు. మధ్య ప్రాచ్యంలో అవసరమైనప్పుడు తనకు సహాయంగా యు.ఎస్. పరిమిత యుద్ధంలో పాల్గొనేలా చేయగలనన్న అంశాన్ని ఇజ్రాయెల్ ఈసారి నిరూపించింది. 1967, 1973 యుద్ధాల్లో ఇజ్రాయెల్‌కు వస్తు రూపేణా యు.ఎస్. సహాయం అందించింది తప్ప ఇప్పటి మాదిరిగా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగలేదు. ఇది ఇజ్రాయెల్‌కు ఒనగూడిన ప్రయోజనం. ఇరాన్‌కు ఒకప్పటి సన్నిహిత మిత్రుడైన ఇజ్రాయెల్ ఇప్పుడు బద్ధ శత్రువు. ఇరాన్ తన ఉనికికే ప్రమాదమని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇరాన్‌పై దాడికి ముందే, దాని ప్రాక్సీలైన యెమెన్‌లోని హౌతీలను, గాజాలోని హమాస్‌ను, లెబనాన్‌లోని హెజ్‌బొల్లాను బాగా దెబ్బతీసింది. ఇప్పుడవి కోలుకోలేని స్థితికి చేరుకున్నాయి. హమాస్, హెజ్‌బొల్లా సంస్థలు గత రెండేళ్ల కాలంలో బాగా బలహీనపడ్డాయి. ఈ



# ...ల్ యుద్ధంలో ...కే పెద్దపీట!

విధంగా ఇరాన్‌ను బలహీనపరచిన తర్వాతనే 'ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించడం గమనార్హం.

ఇక ఇరాన్‌కు మద్దతుగా నిలబడ్డ ప్రధాన దేశం రష్యా. ఈదేశ సహకారం లేకుండా బహుశా ఇరాన్‌కు తన అణ్వస్త్రాలను మరో ప్రదేశానికి తరలించడం సాధ్యమయ్యేది కాదనే చెప్పాలి. రష్యా ఇంటెలిజెన్స్ సహకారం వల్లనే ఈ విధంగా ముందుగా జాగ్రత్త పడగలిగింది. ప్రస్తుతం యుక్రెయిన్‌తో (పరోక్షంగా నాటోదేశాలతో) యుద్ధంలో ఉన్న రష్యా పెద్దగా కల్పించుకోలేని పరిస్థితిలో ఉంది. ఒకరకంగా చెప్పాలంటే మధ్య ప్రాచ్యంలో రష్యా తన పట్టును చాలా వరకు కోల్పోయిందనే చెప్పాలి.

**అణ్వస్త్ర ప్రదేశాల విధ్వంసంపై కొనసాగుతున్న సస్పెన్స్**

ఇక అమెరికా తన వైమానిక బాంబు దాడుల్లో ఇరాన్ అణ్వస్త్ర ప్రదేశాలను ధ్వంసం చేశామని చెబుతున్నా, ఇంకా నిర్ధారణ కాలేదు. ఇక్కడ ఇరాన్ భద్రపరచినట్టు చెబుతున్న 400 కిలోల యురేనియం జాడ తెలియడంలేదు. ఈ నేపథ్యంలో ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఆర్గనైజేషన్ అధినేత మహమ్మద్ ఇస్లామీ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ అణుకార్యక్రమం ఆగలేదని, దీని పునరుద్ధరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ప్రకటించడం డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనల్లో నిజాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నది. ఇజ్రాయెల్, యు.ఎస్.ల ప్రధాన లక్ష్యం ఇరాన్ అణుకార్యక్రమాన్ని కొనసాగించకుండా నిరోధించడం! ఈ విషయంలో ఎంతవరకు విజయం సాధించారన్నది ఇంకా సందిగ్ధంగానే ఉంది.

ఇదిలావుండగా కాల్పుల విరమణ ప్రకటించిన మూడున్నర గంటల తర్వాత ఇరాన్ ప్రయోగించినట్టు చెబుతున్న రెండు బాలిస్టిక్ క్షిపణులు ఏమయ్యాయన్న విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ఇరాన్ ప్రభుత్వం మాత్రం తాము ఎటువంటి క్షిపణులను ప్రయోగించలేదని చెబుతోంది. మరి వీటిని ఎవరు ప్రయోగించారనేది తేలాల్సి వుంది. ఈ ప్రాంతంలో ఇంకా శాంతి నెలకొనలేదన్న మాట నిజం.

**యుద్ధం ప్రారంభం**

జూన్ 13న ఇరాన్‌లోని అణు ప్రదేశాలపై ఇజ్రాయెల్ జరిపిన ఆకస్మిక వైమానిక దాడులతో రెండు దేశాల మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. దాడుల మొదట్లో ఇజ్రాయెల్ వైమానిక దళం, గ్రౌండ్‌ఫోర్స్‌లు ఇరాన్‌కు చెందిన కీలక కొందరు కీలక సైనికనేతలు, రాజకీయ నాయకులు, అణుశాస్త్రవేత్తలను చంపేయడంతో ఆగ్రహించిన ఇరాన్ ప్రతీకారంగా ఇజ్రాయెల్ సైనిక స్థావరాలు, నగరాలపై క్షిపణులతో దాడిచేసింది. యెమెన్‌లోని హౌతీలు కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడులు చేశారని ఇరాన్ తెలిపింది. ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడుల నుంచి ఇజ్రాయెల్‌ను కాపాడిన అమెరికా, యుద్ధం ప్రారంభమైన తొమ్మిదవ రోజున ఇరాన్‌కు చెందిన మూడు అణ్వస్త్ర నిల్వ ప్రదేశాలు ఫోర్డో యురేనియం అణుశక్తి కేంద్రం, నటంజ్ అణునిల్వ కేంద్రం, ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్‌పై బాంబుదాడులు చేసింది. ఇందుకోసం నార్త్‌రప్ బి-2 స్టెల్త్ బాంబర్ విమానాలను ఉపయోగించి, 14వేల కిలోల బరువున్న బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించింది. ఇదే సమయంలో సమీపంలో సముద్రంలోని జలాంతర్గామి నుంచి తోమహాక్ క్షిపణులను కూడా ప్రయోగించింది. దీనికి ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్ అని పేరుపెట్టింది. అయితే ఈ బాంబుదాడుల వల్ల జరిగిన నష్టంపై ఇంకా పూర్తి వివరాలు అందాల్సివుంది. యు.ఎస్. ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం నష్టం చాలా స్వల్పమేనని వెల్లడించడం గమనార్హం. ఈ దాడులను పసిగట్టిన ఇరాన్ ముందుగానే ఆయా ప్రదేశాల నుంచి యురేనియం సహా ఇతర అణ్వస్త్రాలను వేరే చోటుకు తరలించిందన్న వార్తలు వచ్చాయి. అయితే యు.ఎస్. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం తమ దాడిలో ఇరాన్ అణు ప్రదేశాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని ప్రకటించారు. ట్రంప్ చర్యను రిపబ్లికన్‌లు సమర్థించగా, డెమోక్రట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా బాంబు దాడులకు ప్రతీకారంగా ఖతార్‌లోని యు.ఎస్. సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణులతో దాడి జరిపింది. విచిత్రంగా మరునాడే అంటే జూన్ 24న, "యుద్ధం ముగిసింది. ఇరుపక్షాలు చర్చలకు ముందుకు రావాలి" అని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

**పరస్పర దాడులు**

పన్నెండు రోజుల పాటు కొనసాగిన యుద్ధంలో ఇజ్రాయెల్ తన 200 యుద్ధ విమానాలతో ఇరాన్‌లోని వంద అణుప్రదేశాలపై దాడులు జరిపింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో ప్రతి దాడులకు దిగడంతో, ఇరుపక్షాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం జూన్ 24 నాటికి 185 మంది మహిళలు సహా 4746 మంది గాయపడ్డారు. మొత్తం 610 మంది మరణించగా వీరిలో 49 మంది మహిళలు, 13మంది పిల్లలు. ఇజ్రాయెల్ బాంబుదాడులు ప్రారంభం కాగానే చాలామంది టెహ్రాన్ నగర పౌరులు ఉత్తర ప్రాంతాలకు పారిపోయారు. అలా తరలిపోయిన వారి సంఖ్య తొమ్మిది మిలియన్ల వరకు ఉంటుందని ఇరాన్ పేర్కొంది. ఇక దాడులకు ప్రతిగా ఇజ్రాయెల్‌పై కనీసం 120సార్లు ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇరాన్ దాడుల్లో టెల్ అవీవ్‌లోని సరోకా మెడికల్ సెంటర్ కూడా ధ్వంసమైంది. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. దీంతో పాటు ఇజ్రాయెల్ మిలిటరీ ఇంటెలిజెన్స్ స్కూల్, హైఫా నగరంలోని మినిస్ట్రీ ఆఫ్ ఇంటీరియర్, వైజ్‌మాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌పై, చమురుశుద్ధి కర్మాగారంపై దాడులు జరిపింది. ఈ దాడుల్లో 3238 మంది ఇజ్రాయెల్ పౌరులు గాయపడగా, 28 మంది మరణించారు.

**మాటలకే పరిమితమైన చైనా**

ఈ యుద్ధంలో ఇరాన్‌కు పూర్తి మద్దతుగా నిలిచినట్టు చైనా ప్రకటించింది. కానీ ఈ మద్దతు చాలా వరకు మాటలకే పరిమితం కావడం ఇరాన్‌ను



మహమ్మద్ ఇస్లామీ

కూడా చాలా అసహనానికి గురిచేసింది. కొద్దో గొప్పో వస్తు రూపేణా సహాయం చేసింది తప్ప ఆయుధాలు, సైనికసహాయం చేయలేదు. చైనా మాటల స్థాయిని గమనించి పశ్చిమ దేశాలు కూడా, దాని వ్యవహారశైలి పట్ల కొంత అసంతృప్తిని వ్యక్తంచేసిన మాట వాస్తవం. అయితే గతంలో యు.ఎస్.ఎస్.ఆర్. పతనం, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల్లో అమెరికా పరాభవం వంటి అంశాలు ఇరాన్‌కు పూర్తిస్థాయి మద్దతివ్వకుండా చైనాను నిరోధించివుండవచ్చు. ఎందుకంటే ఇతర దేశాల్లో సైనికంగా, ఆయుధపరంగా జోక్యం చేసుకోవడం వల్ల చేతులు కాల్చుకోవడం తప్ప మిగిలేదేమీ ఉండదన్నది గత చరిత్ర చెబుతున్న పాఠం నేపథ్యంలో చైనా వ్యూహాత్మకంగా వ్యవహరించి ఉండవచ్చు. అదీ.. వనరులు తగ్గిపోతున్న మధ్య ప్రాచ్యాన్ని ఇప్పటికీ పట్టుకొని వేలాడుతుండటం అమెరికా వ్యూహాత్మక తప్పిదమన్నది చైనా భావన. అంతేకాదు మారుతున్న పరిణామాల నేపథ్యంలో ఆసియా-పసిఫిక్ దేశాలవైపు మళ్లితేనే ఆశించిన ప్రయోజనాలు దక్కుతాయన్న అభిప్రాయం కూడా చైనాకు ఉండి ఉండవచ్చు.

ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన యుద్ధానికి అయిన ఖర్చు పది బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ పెట్టుబడులకు సమానం. ఇరాన్ సమస్యలో తలదూర్చడం ద్వారా కొరివితో తల గోక్కోవడమెందుకన్న భావన చైనాది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు సైనికేతర సహాయానికే ప్రాధాన్య మిచ్చింది. ముఖ్యంగా పెద్ద మొత్తంలో ఇరాన్ చమురును కొనుగోలు చేయడం, సౌదీ అరేబియాతో ఇరాన్‌కు సత్సంబంధాలు పెరిగేలా దౌత్యపరమైన సహాయం అందించడం, 25 సంవత్సరాల పాటు ఇరాన్‌తో సత్సంబంధాల కొనసాగింపునకు వీలుగా 2021లో ఒక ఒప్పందంపై సంతకాలు చేయడం వంటివి ఇందుకు ఉదాహరణ. నిజం చెప్పాలంటే ఈ రకమైన సహాయం, యు.ఎస్. ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోకుండా కాపాడింది. అందువల్ల సైనిక సహాయం కంటే ఈ రకమైన మద్దతే అధిక ప్రయోజనకరం.ఇది చైనా వ్యూహం. కాగా, అమెరికా ఆంక్షలకు భయపడి చైనా వెనకడుగు వేసిందని కథనాలు ప్రచురించాయి. కానీ చైనావి గుంటనక్క విధానాలు. అందువల్ల స్నేహం ముసుగులో, కాలం చెల్లిన ఇరాన్ యుద్ధ విమానాల స్థానే తమ దేశంలో తయారు చేసిన విమానాలను, వైమానిక రక్షణ వ్యవస్థలను అమ్మజూపే అవకాశాలే ఎక్కువ. అయితే ఇవన్నీ ఆపరేషన్ సింధూర్‌లో భారత్ విజయవంతంగా ధ్వంసం చేసిందన్న సంగతి ఇరాన్‌కు తెలియదనుకుంటే అంతకంటే అమాయకత్వం మరోటుండదు.

**భారత్ వ్యూహాత్మక సంయమనం**

ప్రస్తుతం యు.ఎస్. ఇరాన్ పట్ల వ్యవహరిస్తున్న తీరు నేపథ్యంలో భారత్ చాలా వ్యూహాత్మక సంయ



ట్రంప్

మనాన్ని పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయెల్‌లు మనకు అత్యంత సన్నిహిత దేశాలు కావడం ఇక్కడ ప్రధానం. ఇరాన్‌పై యుద్ధం చేసేకంటే శిక్షించి దారికి తెచ్చుకోవాలన్న వ్యూ హాన్ని అమెరికా అనుసరిస్తోంది. వసుధైక కుటుంబకం అనే నానుడికి కట్టుబడి ఉన్న భారత్ వ్యూహాత్మకంగా తన భద్రత, రాజకీయ ప్రాధాన్యతలకు అను గుణంగా వ్యవహరించాల్సి ఉంది. ప్రస్తుతం భారత్ చమురు అవసరాల్లో సగం కంటే తక్కువ మధ్యప్రాచ్య దేశాల నుంచే సరఫరా అవుతోంది. యుక్రెయిన్ యుద్ధానికి ముందు ఇది 60శాతంగా ఉండేది. ప్రస్తుతం భారత్ రష్యా నుంచి ముడి చమురు చాలావరకు ఉరల్స్ (మధ్య తరహా క్రూడాయిల్)ను రాయితీలతో దిగుమతి చేసుకుంటోంది. అయితే రష్యా-యుక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ రాయితీలు ఆవిరై పోవడంతో, మళ్లీ పశ్చిమాసియా దేశాల నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకుంటోంది.

2024 జులై నుంచి పశ్చిమాసియా నుంచి దిగుమతి చేసుకునే క్రూడాయిల్‌ను 40.3 శాతం నుంచి 45.86 శాతానికి పెంచింది. ఆంక్షలు శాశ్వతం కాదు కనుక, రానున్న కాలంలో ట్రంప్ రష్యాపై ఆంక్షలను సడలిస్తే చమురు దిగుమతి కోసం పశ్చిమ దేశాలతో మనం పోటీపడాల్సి వస్తుంది. ఇక ఇరాన్ విషయానికి వస్తే అమెరికా బాంబు దాడులకు ప్రతీకారంగా ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసింది. ప్రస్తుతం కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ ఇదెంతవరకు కొనసాగుతుందో తెలియని పరిస్థితి. ఒకవేళ పరిస్థితులు అడ్డం తిరిగితే అమెరికాకు సరఫరా అవుతున్న గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై ఇరాన్ దాడులు చేసే అవకాశాలు లేకపోలేదు. దీనివల్ల చమురు ధరలు పెరిగి మన ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడవొచ్చు. ఇప్పటికే అమెరికా ఆంక్షల పుణ్యమాని... ఒకప్పుడు మనకు చమురు సరఫరా దేశంగా మూడో స్థానంలో ఉన్న ఇరాన్ నుంచి దిగుమతులు చాలా వరకు తగ్గించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మన ప్రధాని నరేంద్రమోదీ వ్యూహాత్మకంగా, కచ్చితంగా వ్యవహరిస్తుండటాన్ని సానుకూల దృక్పథంతో చూడవచ్చు. యు.ఎస్, రష్యా, చైనా వంటి దేశాలతో పోలిస్తే మనం ముడి చమురు, ద్రవరూపక సహజవాయువు (ఎల్ఎన్‌జీ) వంటి వాటి దిగుమతులపై ఎక్కువ ఆధారపడుతున్నాం. ఒకవేళ ఇరాన్‌లో ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొడితే భారత్ వంటి ఉద్గమిస్తున్న దేశాలకు మధ్యప్రాచ్యంలో తమ ప్రాబల్యాన్ని విస్తరించుకునే అవకాశాలు కుంచించుకు పోతాయి. మధ్యప్రాచ్యంలో ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో భారతీయులు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. యుద్ధం వల్ల వీరు మనదేశానికి పంపుతున్న విదేశీ మారక ద్రవ్యం నిలిచిపోతుంది. దీనికితోడు వీరిని అక్కడి నుంచి స్వదేశానికి రప్పించడం మరింత ఖర్చుతో కూడిన వ్యవహారం. మరో ముఖ్య విషయమేంటంటే, ఒకవేళ ఇరాన్ ప్రభుత్వాన్ని కూలగొడితే, ప్రస్తుతం మధ్యప్రాచ్యంలోని బహుళ ధ్రువాత్మక రాజకీయం యు.ఎస్. నేతృత్వంలో ఏక ధ్రువాత్మకంగా మారిపోగలదు. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా, కొత్త ప్రభుత్వం ఏర్పాటులో జరిగే గందరగోళం వల్ల సిరియాలో మాదిరి పరిస్థితులే ఇరాన్‌లో కూడా ఏర్పడే అవకాశముంది. ఆ విధంగా ఈ ప్రాంతంలో యు.ఎస్.ను వ్యతిరేకిస్తున్న ఒక పెద్ద దేశం కుప్పకూలి పోతుంది. దీనివల్ల గత దశాబ్ద కాలంగా భారత్ ఈ ప్రాంతంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం చేస్తున్న ప్రయత్నాలకు నీళ్లొదులుకోక తప్పదు. అప్పుడు భారత్ వ్యూహాత్మకంగా నెరపే ప్రతి వ్యవహారాన్ని యు.ఎస్. అడ్డుకుంటుంది. అందువల్ల ఇరాన్ సమన్వయ పాత్ర లేకుండా మధ్యప్రాచ్యంలో భారత్ ఇటు గల్ఫ్ దేశాలతో అటు ఇజ్రాయెల్‌తో సంబంధాలు నెరపడం కష్టమవుతుంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అమెరికా తన సైన్యాలను అక్కడికి తరలించి సుదీర్ఘకాలం ఉంచక తప్పదు. ఇది ఆసియా-పసిఫిక్‌లో తన ప్రాబల్యాన్ని పెంచుకోవ డానికి చైనాకు దోహదం చేస్తుంది. ఇక తైవాన్‌ను ఆక్రమించుకోవడానికి చైనా తప్పక ప్రయత్నిస్తుంది. నయానో లేక భయానో.. ఏదోరకంగా దీన్ని సాధించే అవకాశాలే ఎక్కువ. ఆ విధంగా మరింత బలపడిన చైనాతో సరిహద్దు వివాదాన్ని పరిష్కరించు కోవడం భారత్‌కు సమస్యగా మారుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో యథాతథ స్థితిని కొనసాగించాలని యు.ఎస్.పై భారత్ ఒత్తిడి తీసుకురావాలి.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# గోడ వెనుక గడబిడ

**చైనాలో పెద్ద రాజకీయ పరిణామం ఏదైనా జరగబోతున్నదా? మహాకుడ్యం వెనుక ఏదో జరుగుతున్నదన్న అనుమానాలు ఇప్పుడు ప్రపంచ మంతటా బలపడుతున్నాయి. చైనా అధ్యక్షుడు లేదా మరొక పెద్ద నేత అడపా దడపా కనిపించకుండాపోవడం, కొన్నివారాలకో, నెలకో తిరిగి దర్శన మీయడం అక్కడ జరుగుతూనే ఉంటుంది. అయితే ప్రస్తుత అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ హఠాత్తుగా అదృశ్యం కావడం పెద్ద అనుమానాలకు తావిస్తున్నది. ఆయన మే 21 నుంచి జూన్ 5 వరకు ఎక్కడా కనిపించలేదు. చైనా ప్రభుత్వంలో, లేదా చైనీస్ కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన లేదా వస్తున్న తుపానులకు ఇదే నిదర్శనమన్న అంచనాలు కూడా ఉన్నాయి.**

ఒక కీలక ఉదాహరణను ఇక్కడ గమనించాలి. జూన్ 6న రాజ్యాంగ విధేయత కార్యక్రమం నిర్వహించారు. చైనా స్టేట్ కౌన్సిల్ నిర్వహించిన ఈ ముఖ్య ఉత్సవానికి 50 మంది మంత్రులు హాజరయ్యారు. వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు. కానీ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ హాజరు కాలేదు. ప్రభుత్వ కార్యక్రమాలలో, మీడియాలో, ఆఖరికి అత్యున్నత దౌత్య సమావేశాలలో జిన్‌పింగ్ కనిపించడం లేదు. మరొకపక్క పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ–పీఎల్ఏ పై స్థాయిలో విభేదాలు తారస్థాయికి చేరాయన్న వార్తలు కూడా ఇప్పటికే ఉన్నాయి. ఇంకొకపక్క చైనా ఆర్థికం సహా కీలక రంగాలలో సవాళ్లను ఎదుర్కొంటున్నదన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇవన్నీ ఉన్నాయి కాబట్టే అక్కడ అధికార మార్పిడి వంటి పెద్ద పరిణామానికి రంగం సిద్ధమవుతున్నదని అంతా అనుమానిస్తున్నారు. పీపుల్స్ డైలీ, జిన్హువా రెండూ కూడా పార్టీ, ప్రభుత్వాల ప్రచార సాధనాలే. ఇవి అధ్యక్షుడి చిత్రం లేకుండా వెలువడడం 2017లోనే జరిగింది. మళ్లీ ఇప్పుడు అదే పునరావృతమైంది.

జూన్ 2 నుంచి 5 వరకు ఈ ప్రచార పత్రికలలో అధ్యక్షుడి చిత్రమే లేదు. ఇది అరుదైన సందర్భం. ఈ సమయంలో జరిగిన అత్యున్నత దౌత్య సమావేశాలకు ప్రధాని లీ కియాంగ్, ఉప ప్రధాని హె లీఫెంగ్‌లు మాత్రమే హాజరయ్యారు. ఇది దేశ నాయకత్వ మార్పిడిలో తాత్కాలిక మార్పును సూచిస్తున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సమావేశాలకు జిన్‌పింగ్ గైర్హాజరు కావడం, ప్రధాని, ఉపప్రధాని, పార్టీ ప్రముఖులు హాజరు కావడం కమ్యూనిస్టు పార్టీలో అసమ్మతిని చల్లార్చేందుకేనని కూడా అంటున్నారు. వర్గపరమైన ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నం కూడా కావచ్చునని ఇంకొందరు అంచనా వేస్తున్నారు.

పీఎల్ఏలో కూడా పెను మార్పులు సంభవించాయి. నిజానికి 2023 నుంచి సైన్యంలో పెద్ద ఎత్తున కుదుపులు సంభవిస్తూనే ఉన్నాయి. జనరల్ హె వీడాంగ్ (సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఉపాధ్యక్షుడు), జనరల్ మియా హువా (పొలిటికల్ వర్క్ చీఫ్), జనరల్ లిన్ జియాంగ్యాంగ్ (కమాండర్ ఆఫ్ ఈస్టర్న్ థియేటర్ కమాండ్)లను పదవుల నుంచి తొలగించారు. పీఎల్ఏలోనే శక్తిమంతమైన రాకెట్ ఫోర్స్, వెస్టర్న్ థియేటర్ కమాండ్‌ల నాయకత్వాలలో కూడా పెద్ద ఎత్తున మార్పులు చేశారు. ఇవన్నీ చూస్తే చైనా సైనిక వ్యవస్థ అంత సజావుగా ఏమీ లేని సంగతి రుజువు చేస్తున్నాయని భావిస్తున్నవారు కూడా ఉన్నారు.



జీ జిన్‌పింగ్

జిన్‌పింగ్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ ఆగస్టులో జరిగే సీసీపీ ప్లీనరీ సమావేశంలో ఆయన పదవీ విరమణ చేసే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీన్ని నిజం చేస్తున్నట్టుగా జిన్‌పింగ్ జూన్ మాసం మొదట్లో బెలారస్ నియంత అలెగ్జాండర్ లుకషెంకోకు ఆతిథ్యమిచ్చిన సందర్భంగా బహిరంగంగా తిరిగి కనిపించారు. ఆ సమావేశం కూడా గతంలో కనీవినీ ఎరుగని రీతిలో బీజింగ్‌లోని ఆయన ఇంటి ఆవరణలో జరిగింది. ఆ సందర్భంగా అధికారులు కూడా ఎక్కువ సంఖ్యలో కనిపించలేదు. కనీసం చైనా అధ్యక్షుడు విదేశీ అతిథులతో సమావేశమైనప్పుడు తప్పనిసరిగా ఉండే దుబాసీలు సైతం ఈ సమావేశంలో లేకపోవడం గమనార్హం. ఆ సందర్భంగా ఆయన బాగా అలసిపోయినట్టుగా, ఆసక్తి లేనట్టుగా, ఏదో కోల్పోయినట్టుగా కనిపించారు. గతంలో కూడా ఆయన దిగిపోతారనే విషయంపై వదంతులు వినిపించాయి కానీ ఇప్పుడున్న పరిస్థితి గతంలో మునుపెన్నడూ లేదు. ఎందుకంటే పీఎల్ఏలో జిన్‌పింగ్‌కు విధేయులైన డజన్లకొద్దీ అధికారులు అంతుపట్టని రీతిలో మరణించారు. ఆయనకు ఏ మాత్రం విధేయులు కానివారితో మరణించినవారి స్థానాలను భర్తీ చేశారు. వీటికి తోడు జిన్‌పింగ్ తన తండ్రి స్మారకార్థం కట్టించిన మాసోలియంను పట్టించుకునే నాథుడే లేడు. మావో లేదా డెంగ్ కోసం నిర్మించిన మాసోలియంల కన్నా అతి పెద్దదిగా నిర్మించిన దీనికి ఇంతవరకు ఎలాంటి పేరు పెట్టకపోవడం అనూహ్యం. అంతర్జాతీయ ఇంధన వినియోగం, పర్యావరణ పరిరక్షణ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న జిన్‌పింగ్ సోదరుడు జి యాన్‌పింగ్ అదృశ్యం కావడం ప్రస్తావనార్హం. జిన్‌పింగ్ మూడవసారి అధ్యక్షపదవిని చేపట్టడంలో సాయపడి ఆ తర్వాత ఆయనతో చెడిన జాంగ్ యుక్సియా ప్రస్తుతం పీఎల్ఏకు డిఫెక్టో లీడర్‌గా వ్యవహరిస్తున్నారు.

– జాగృతి డెస్క్




# చరిత్రకు అందనివి,

తెలుగు సాహిత్యంలో స్వీయ చరిత్ర ఓ ఆధునిక ప్రక్రియ. ఆత్మకథ అనీ, అనుభవాలు, జ్ఞాపకాలు అనీ, గత స్మృతులనీ కూడా ఈ ప్రక్రియనే మనం వ్యవహరిస్తున్నాం. స్వీయచరిత్రలు ఎందుకు చదవాలి? ఎందుకు అంటే–మానవ జీవితం ఒక మజిలీ. ఈ మజిలీలో మానవుడు తాను కష్టాలపాలు గాకుండా, సంఘాన్ని కష్టాల పాలు చేయకుండా ఉండేందుకు జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఈ విధంగా తన ప్రవర్తనను అలవరుచుకునేందుకు, నడవడికను చక్కదిద్దుకునేందుకు కొన్ని విషయాలు లోకం నుంచి, తన జీవితానుభవాల నుంచి, తనకు ముందు జీవించిన వారి అనుభవాల నుంచి కొంత కొంత నేర్చుకోవాలి, పసివాడు నడక, మాటలు నేర్చుకున్నట్లు. ఆ పని స్వీయ చరిత్రలు, ఆత్మకథలు చేస్తాయి. 'ఇంతటి చరిత్రను చూస్తుంటే, ఒక మహాత్మమూర్తి నా చేయి పట్టుకుని నడిపిస్తున్నట్టు ఉంటుంది' అంటారు శేషేంద్ర.

సంఘం నుంచీ తను చూసిన, విన్న, చదివిన జీవిత సన్నివేశాల నుంచీ వ్యక్తులు సంస్కారాన్ని నేర్చుకుంటారు. జీవిత సన్నివేశాలు ఏవైనా సార్వకాలికమైనవి కాబట్టి, సమస్యలు, అనుభవాలు చాలావరకు ఒకేరకం. కాబట్టి సముదాయ జీవనం నుంచి మంచిచెడ్డలు, ఎదురైన సమస్యలు చూసి, విని, చదివి తన జీవితానికి వర్తింప చేసుకొని సత్ఫలితాలను సాధించగలడు మనిషి. ఆహారంతో శరీరానికి పోషణను, జీవశక్తిని సంపాదించుకున్నట్లే చదివే పుస్తకాల వలన, తెలుసుకొనే సంగతుల వలన, మెలిగే సమాజం వలన కొన్ని విలువలను నడవడికను ఏర్పరచుకుంటాడు. తాము ఈ లోకం నుండి వెళ్లి పోయిన తరువాత కూడా తాము తలపెట్టిన ఉపకారాలు తరతరాలకు కొనసాగాలని తమ శాయ శక్తులా ఏర్పాట్లు చేస్తారు. అటువంటి జీవనానికి ఓ ఉదాహరణ కాకినాడకు చెందిన మల్లాడి సత్యలింగ నాయకర్.

నాయకర్ ధనవంతుడే. కానీ చిన్నతనంలో చాలా పేదవాడు. ఓడ కళాసీగా జీవితం ప్రారంభించి, తరువాత ఎన్నో ఓడలకు యజమాని అయ్యాడు. బర్మా (నేటి మైన్మార్) వెళ్లాడు. ఓడలు నడిపి డబ్బు సంపాదించాడు. ఆయనకు ఉన్న ప్రేరణ ఏమిటో గాని, తన సంపాదనలో చాలా భాగం పేద విద్యార్థుల కోసం కేటాయించారు. ఎందరికో విద్యాదానం చేశాడు. ఆయన ఇచ్చిన విద్యార్థి వేతనాలతో చదివిన వారిలో ఒకరు భారత రిజర్వు బ్యాంకు గవర్నర్ అయ్యారు. అలా ఎందరో ఉన్నత పదవులు పొందారు.

మద్రాసులో కె.ఎన్.కేసరి అనే మందుల వ్యాపారి ఉండేవారు. ఆయన స్వస్థలం ఒంగోలు దగ్గర ఓ పల్లెటూరు. చిన్నతనంలో తండ్రి చనిపోవడంతో, తిండిలేక చుట్టు పక్కల పల్లెటూళ్లకు వెళ్లి ధాన్యాలు యాయవారం చేసి తెచ్చేవాడు. ఒకరోజు ఒక రెండు మూడు ఊళ్లు ఎక్కువ అడుక్కుని మోయలేని బరువుతో వెళ్లి తల్లిని సంతోషపెడదామని అనుకుని, ఓ గోడకు


సత్యలింగ నాయకర్

జారబడ్డాడు. సొమ్మసిల్లినట్లు నిద్రపోయాడు. కాసేపటికి మేలకువ వచ్చి చూస్తే తల్లి కాళ్ల దగ్గర ఏడుస్తూ కనిపించింది. ఆ పిల్లవాడి కాళ్ల నిండా పల్లేరు ముళ్లు విరిగి ఉన్నాయి. ఇక ఇలా చేయవద్దని తల్లి మందలించింది. ఆ పిల్లవాడు ఆలోచించి కాలినడకన ఒంగోలు నుండి మద్రాసు చేరాడు. వీధి కుళాయి నీళ్లు తాగి ఎవరైనా పావల, బేడ ఇస్తే ఏదైనా కొనుక్కొని కడుపు నింపుకునేవాడు.

తరువాత మందులు తయారు చేసే సంస్థలో చేరాడు. కల్వంలో మందులు నూరే పని. తీరిక వేళల్లో పాఠశాలకు వెళ్లి పెద్దవాడైనాడు. ఆయనే తరువాత సొంతంగా 'కేసరీ కుటీరం' అనే ఔషధాల తయారీ సంస్థను స్థాపించాడు. లోధ్ర ఈ సంస్థదే. సంపన్నుడయ్యాడు. 'గృహలక్ష్మి' పత్రికను, ఉన్నత పాఠశాలలను స్థాపించాడు. రచయిత్రులకు స్వర్ణకంకణాలు బహూకరించాడు. ఈ మహనీయుడు తన స్వీయ చరిత్ర రాశాడు, పేరు 'నా చిన్ననాటి ముచ్చట్లు'.

సత్యలింగ నాయకర్, కోట నరకేసరి మానవత్వాన్ని మంచిగంధంతో పరిమళింపజేశారు. వాళ్లు దివ్యపురుషులు. జీవితాలను సార్థకం, చరితార్థం చేసుకోగలిగి సమాజానికి మార్గం చూపారు. స్వయంకృషితో, నిజాయతీతో, నీతివర్తనతో మానవుడు లోకాన్ని మరమత్తు చేయగలడు. అయితే మానవత్వపు విలువలను నిరంతరం బోధిస్తూ ఉండవలసినదే.

విత్తనాలు చల్లిన దగ్గర నుండి పంట ఇంటికి వచ్చేదాక జాగ్రత్తపడవలసిందే సేద్యగాడు. అప్పుడే శ్రమకు ఫలితం. రైతు వంటివాడు రచయిత. రైతు పంట పొలాన్ని రక్షించుకున్నట్లే రచయిత సంఘాన్ని రక్షించుకుంటాడు. మహనీయుల స్వీయచరిత్రల నుంచి పాఠకుడు తెలుసుకోవలసిందిదే. తుమ్మల సీతారామ మూర్తి చౌదరి చెప్పినట్లు ఎంత బీదవాడైనా, పనికిమాలిన వాడైనా రైతు విత్తనాలు పాడు చేసుకోడు అన్నారు. సమాజానికీ ఇది వర్తిస్తుంది. ఈ దృష్టితో చూస్తే స్వీయ చరిత్రలకు మరింత ప్రాధాన్యం ఉన్న సంగతి వెల్లడవుతుంది.

వ్యక్తి జీవితంలో, సంఘ జీవితంలో ఒడుదొడుకులు సర్వసాధారణం. వాటిని కొందరు చక్కదిద్దుతారు. వారి కృషి వల్లనే సంఘంలో నాగరికత వృద్ధి చెందుతూ ఉంటుంది. వీరేశలింగం ఒకచోట అన్నట్లు, మానవ నాగరికత యుగయుగాలుగా వృద్ధి చెందుతూ వస్తున్నది. ఆ ప్రయత్నం మానవుడు నిర్విరామంగా చేస్తూనే ఉన్నాడు. పశుపక్ష్యాదులు జీవన విధానం అలా కాదు. వేయేళ్ల క్రిందట పక్షులు ఎట్లా గూళ్లు కట్టుకున్నాయో ఇప్పుడూ అట్లానే కట్టుకుంటూ ఉంటాయి. పశువుల జీవన విధానంలోనూ మార్పు లేదు. మానవ జీవితం అట్లాకాదు. అనేక అన్వేషణలు జరిపి ప్రకృతిపై ఆధిపత్యం సంపాదించుకుంటూ జల, వాయువులను కూడా వశపరచుకుంటూ పురోగమిస్తున్నాడు. వ్యవసాయంలో యంత్ర నాగరికతను వృద్ధి చేసుకోవడంలో ఎన్నో కొత్తవి సృష్టించి మానవ జీవితానికి సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటున్నాడు.

మానవ సమాజ ఉత్థాన పతనాలకు ప్రత్యక్ష సాక్షికంగా వివరించేవి స్వీయ చరిత్రలు, కాబట్టి దేశ చరిత్ర రచనకు ఉపకరించే సాధన సామాగ్రిలో వీటికి అత్యంత ప్రముఖ స్థానముంటుంది. ఆయా రంగాలలో కృషి చేసిన మహనీయుల స్వీయచరిత్రలు చరిత్రకారులకు ముడిపదార్థం వంటివి.

భారతీయులకు 19, 20వ శతాబ్దంలో ఖండాంతర వాసులతో సంబంధం ఏర్పడటం వలన మరీ ముఖ్యంగా ఇంగ్లీషువారితో, సాంఘిక జీవన పద్ధతుల్లో మార్పులు వచ్చాయి. మహనీయుల స్వీయ చరిత్రలు అటు తరువాతి తరాలవారికి ఎంతో ఆకర్షకంగా ఉంటాయి. జీవితానుభవాలను ఒక వ్యక్తి


కేఎన్ కేసరి


కేఎల్ రావు


వీరేశలింగం


లక్ష్మీనరసింహం


రామారావు


శ్రీపాద


దర్శి చెంచయ్య

# స్వీయ చరిత్రలు చెబుతాయి

స్వయంగా చెప్పడం వల్ల ఆకర్షణ మరింత అధికమవుతుంది. స్వీయచరిత్ర అనే సాహిత్య ప్రక్రియను నాలుగు శాఖలుగా విభజిస్తారు- విషయాత్మకం, ఆధ్యాత్మికం, మేధావికం, కల్పనాత్మకం.

ఇంగ్లండు, అమెరికా దేశాల్లో నాలుగైదు వందలఏళ్లుగా వచ్చిన స్వీయ చరిత్రలను విశ్లేషించి చరిత్ర నిర్మించుకున్నారు. స్వీయ చరిత్రలు పూర్వ కాలపు శిలాతామ్ర శాసనాల వంటివి. తెలుగులో స్వామి జ్ఞానానంద స్వీయచరిత్ర, మునిపల్లె స్వామి స్వీయ చరిత్ర ఆధ్యాత్మికంలోకి వస్తాయి. ఇక మూడో విధానం మేధావికం- వివిధ రంగాల్లో విశేషమైన కృషిచేసిన వారిని ఉదహరిస్తారు. డా॥ కె.ఎల్.రావు కృషి దానికి ఉదాహరణ. కోటంరాజు రామారావు, కుందూరి ఈశ్వరదత్‌లు గొప్ప పాత్రికేయులు. వారు స్వీయ చరిత్రలు ఇంగ్లీషులో రాశారు. దానిలో 'పెన్ ఈజ్ మై స్వోర్డు', 'స్ట్రీట్ ఆఫ్ ఇంక్' వారి స్వీయ చరిత్రలు. సంజీవ్‌దేవ్ 'స్మృతిబింబాలు', నాల్గోవదైన మేధోవర్గ స్వీయచరిత్రకు ఉదాహరణ.

ఐరోపా దేశాలలో కొన్ని స్వీయ చరిత్రలు కావ్య రూపంలో వెలువడ్డాయి. సుప్రసిద్ధ కవులు వర్డ్స్‌వర్త్, బైరన్‌లు ఆత్మ చరిత్రలు కృతించారు. 18వ శతాబ్దం చివరికాలంలో ఆటోబయాగ్రఫీలు అను పేరున ప్రసిద్ధికెక్కాయి.

ప్రపంచ ప్రసిద్ధ చరిత్రకారుడు ఎడ్వర్డు గిబ్బన్, విజ్ఞానవేత్త బెంజమిన్ ఫ్రాంక్లిన్, రాజనీతిజ్ఞుడు రూసోల స్వీయ చరిత్రలు ప్రపంచదేశాల సామాజిక దృక్పథాలను ప్రభావితం చేశాయి. జాన్ స్టూవార్ట్ మిల్ స్వీయ చరిత్ర పేరు, 'ఎడ్యుకేషన్'. ఇంగ్లండులో లెయిహంట్ (1850) జాన్ స్టూవర్ట్‌మిల్ (1883) కార్డినల్ న్యూమెన్ (1864)ల స్వీయ చరిత్రలు ఆ సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి.

అమెరికన్ సాహిత్యంలో బెంజమిన్ ఫ్రాంక్లిన్ స్వీయచరిత్ర (1766)కు విశిష్ట స్థానముంది. రూసో, టాల్‌స్టాయ్ రచనలు గాంధీజీని ప్రభావితం చేశాయి. రూసో 'కన్‌ఫెషన్స్' అనే పేరుతో స్వీయచరిత్ర రాశాడు. కాబట్టి స్వీయచరిత్ర, అనుభవాలు, జ్ఞాపకాలు, స్మృతులు, గాధలు, దినచర్య వృత్తాంతం, లేఖలు, నవలారూప రచనలు వీటిని ఒక కుటుం బంగా చూడవచ్చును. తెలుగురాష్ట్రాలలో వీరేశలింగం స్వీయచరిత్రలోని చివరి ప్రకరణం చూస్తే సమకాలికులతో ఆయనకు వచ్చిన అభిప్రాయ భేదాలు, దానికి తన దృక్పథం తెలియజేయడం కూడా ఆయన ఆశయంలా కనపడుతుంది.

జీవితంలో తారసిల్లిన వ్యక్తులపట్ల పెంచుకున్న మమతానుభవాలను ప్రశంసిస్తూ కొందరు రాస్తారు. అలాంటిదే ఎన్.జి.రంగా సతీమణి భారతీదేవి 'భారతీదేవి స్మృతులు'. దర్శి చెంచయ్య 'నేను- నాదేశం" కూడా ఈ కోవలోనిదే. బసవరాజు రాజ్యలక్ష్మి 'అప్పారావుగారు నేను' గ్రంథంలో అప్పారావు సున్నిత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. అండమాన్ జీవితంలో తన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన మహనీయులను గుర్తు చేసుకున్నారు ప్రతివాద భయంకరాచార్యులు.'నా మహారాష్ట్ర యాత్ర'లో జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి తాను దర్శించిన ప్రకృతి దృశ్యాలను, మహోన్నత వ్యక్తులను స్మరించు కున్నారు. బులుసు వెంకటేశ్వర్లు స్వీయచరిత్రలో, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి స్వీయచరిత్ర 'అనుభవాలూ జ్ఞాపకాలు'లోనూ చిన్ననాటి జీవితం, గడిపిన పల్లెటూళ్ల శోభను వర్ణించారు.

"మీ స్వీయ చరిత్ర ముందు తరాల వారికి స్ఫూర్తి దాయకంగా ఉంటుంది, ఉత్తేజకరంగా ఉంటుంది. ఆ విషయాలు మీరు చెప్పకపోతే ముందు తరాలవారికి తెలిసే అవకాశం కానీ, ఇతరులు చెప్పే అవకాశం కానీ లేదు కదా" అని అర్థించి కొమర్రాజు లక్ష్మణరావు నిర్బంధించడం వల్లనే తాను స్వీయచరిత్ర రెండవ భాగం పూర్తి చేశాననే స్వీయచరిత్ర అవతా రికలో ప్రస్తావించారు. వీరేశలింగం. చిలక మర్తి లక్ష్మీనరసింహం, రాయసం వేంకటశివుడులను ఎంతో ప్రోత్సహించారు లక్ష్మణరావు. అందువల్లనే వీరేశలింగం తరువాత తెలుగుదేశపు సామాజిక చరిత్ర అంతా చిలకమర్తి స్వీయచరిత్ర ద్వారా గ్రంథస్థమైంది.

స్వీయచరిత్రల్లో సమకాలీన మేధావుల, సన్నిహితుల గురించి వారి విశిష్ట గుణాలను గురించి కనిపిస్తుంది. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ గురించి ప్రఫుల్లచంద్ర రే (గొప్ప శాస్త్రవేత్త) తన స్వీయ చరిత్రలో ఎన్నో విశేషాలు చెప్పారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కోసం ఒక ప్రకరణమే కేటాయించారు. శ్రీనివాస రామానుజం ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్ర విశారదుడు, ముప్పయి ఏండ్లు నిండకుండానే కీర్తిశేషులయ్యారు. వారి గురించి సమకాలీనుల రచనల వలనే తెలుస్తుంది. చింతామణి ద్వారకానాథ్ ఎన్నో స్వీయచరిత్రలో అవి ఉన్నాయి. దివి గోపాలా చార్యులవారు ఆయుర్వేద వైద్య విజ్ఞానశాస్త్రంలో అఖిల భారత ఖ్యాతి నార్జించారు. ఈ శతాబ్ది భారత దేశంలో విఖ్యాతులైన గొప్పవైద్యులు. వారిని గురించి కె.ఎన్.కేసరి జీవిత చరిత్ర వలన, ఆచంట లక్ష్మీపతి స్వీయచరిత్ర వలన, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అనుభవాలు- జ్ఞాపకాలూను' వలన తెలుస్తున్నాయి.

కవికొండల వేంకటసత్యనారాయణమూర్తి ఉపాధ్యాయులుగా ఉంటూ దేశచరిత్ర, జీవితచరిత్రలు కొన్ని రాశారు. కానీ వీరి స్వీయ చరిత్ర అముద్రితం. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల సామాజిక చరిత్రంతా వాటిలో ఉంది. స్వీయ చరిత్ర రాయడంలో ప్రయోజనం, చదివినందువల్ల కలిగే ఫలితం ఆయన మాటల్లోనే, 'ఆత్మ చరిత్రలు వ్రాసుకున్న వాళ్లెవరు వారి వారి గొప్పతనం ప్రకటించుకున్నట్లు నాకు కనపడలేదు. తాను చేసిన కొన్ని పనులు, తన కాలంలో జరిగిన కొన్ని విషయాలు రికార్డు చేయడానికి మాత్రమే వ్రాసుకున్నా రని నా అభిప్రాయం. దీనివలన యేమిటి ప్రయోజన మంటే, సాధారణంగా పై వాళ్లకు తెలియని కొన్ని విషయాలు చాలాకాలం గడిచిపోయిన తరువాత తెలియజేస్తాయి. మరిచిపోయిన వారికి జ్ఞాపకం చేస్తాయి. ఇట్టి ఆత్మకథలు చరిత్రకారులకు కూడా యెక్కువగా ఉపయోగపడతాయి.'

ఈ సమాచారం చరిత్ర అనే సాగరంలో చిన్న నీటి బొట్టు మాత్రమే.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు



# ఉప్పు తిన్నాం కాబట్టి...

కొన్నేళ్లు ఏదో ఒక దేశంలో ఉంటే, అనగా, ఆ దేశం ‘ఉప్పు’ తింటే ఆ దేశం పట్ల విధేయంగా ఉండాలా? ధర్మం ప్రకారం ఉండాలి. కానీ ఆ ధర్మం అన్ని చోట్ల, అన్ని వేళలా, అన్ని మతాల విషయంలోను చూపాలి. ఈ యువకుడిని చూసి కొందరు ఆ విషయం గ్రహించడం అవసరమనిపిస్తుంది.‘నేను ఈ దేశం ఉప్పు తిన్నాను. ఈ పరిస్థితులలో ఈ దేశాన్ని విడిచిపెట్టి నేను భారత్‌కు రాలేను’ అన్నాడు ఆ యువకుడు. ఇతడి పేరు అబ్రార్ అలీ. వయసు 30. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ యువకుడు ఇరాన్‌లో ఉంటున్నాడు. మధ్య ప్రాచ్యంలో యుద్ధ వాతావరణాన్ని బట్టి భారతదేశం మన పౌరులను తీసుకురావడానికి ఆపరేషన్ సింధు ఆరంభించింది. కానీ అబ్రార్ ప్రస్తుత పరిస్థితులలో నేను రాలేను అని చెప్పాడు. అలాగే విద్యార్థి గుల్ అఫ్షా కూడా ఇదే సమాధానం చెప్పింది. ఇరాన్‌లో పరిస్థితులు చక్కబడిన తరువాతనే ఇంటికి వస్తాను అని తన కుటుంబానికి తెలియచేసింది. ఈమెది కూడా మధ్యప్రదేశ్ రాష్ట్రమే. 28 ఏళ్ల గుల్ అఫ్షా ఖాటూన్ భోపాల్ దగ్గరి కరోండ్ నుంచి ఇరాన్‌లో మషహద్ అనే చోట ఉన్న జామియా అల్ ముస్తాఫా విశ్వవిద్యాలయంలో చదువుతున్నది. ఆలీమా కోర్సులో నాలుగేళ్ల క్రితం చేరింది. దీనిని ఇస్లామిక్ అధ్యయనాలలో పీహెచ్.డీ స్థాయి పట్టాగా పరిగణిస్తారు. ఈమె చదువు మరొక ఏడాదిలో పూర్తి అవుతుందని ఆమె సోదరుడు మహమ్మద్ జావాద్ మూసవీ నయాదునియా చానల్‌తో మాట్లాడుతూ తెలియచేశాడు. అబ్రార్ చదువుతున్నది కూడా ఇస్లామిక్ విద్యే. ఇరాన్‌లోనే కోమ్ అనేచోట మౌల్వియత్ అనే కోర్సు చదువుతున్నాడు. ఇతడు భోపాల్‌లోని నిషాత్‌పుర ప్రాంతంవాడు. యుద్ధం జరగుతున్నది, ఇరాన్ విడిచి వచ్చేయమని ఇతడి తల్లి షహనూర్ బేగం కోరింది. ఇలాంటి పరిస్థితులలో ఇరాన్ ప్రజలకు ఏం చెప్పి భారత్‌కు బయలుదేరను? అని ప్రశ్నించాడతడు. ఈ దేశం ఉప్పు తిన్న నేను ఇప్పుడు రాలేను అని కూడా చెప్పాడు.

# పీఎఫ్ఐ రక్తదాహం

కొద్దికాలం క్రితం కేంద్ర ప్రభుత్వం నిషేధించిన ఉగ్రవాద సంస్థ పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) రక్త చరిత్ర దారుణమైనది. దానిని నిషేధించే సమయానికి అది ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తనకు నచ్చని కొందరిని, అందునా హిందువులను తుదముట్టించాలని ఒక జాబితా కూడా సిద్ధం చేసుకుంది. పదిమందో పాతిక మందో కాదు, 977 మంది పేర్లు ఆ జాబితాలో ఉన్నాయి. ఇందులో ఒక జిల్లా న్యాయమూర్తి కూడా ఉన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (నియా) కోర్టుకు సమర్పించిన పత్రాలలో ఇది కూడా ఉంది. 2022లో ఎస్‌కే శ్రీనివాస్ అనే ఒక హిందూ సంస్థ కార్యకర్త హత్య కేసులో నిందితులకు బెయిల్ మంజూరు విషయంలో జరిగిన వాదోపవాదాల సందర్భంగా నియా ఈ జాబితాను న్యాయమూర్తి ఎదుట ఉంచింది.

పీఎఫ్ఐలో మూడు విభాగాలు ఉంటాయి. ఒకటి రిపోర్టర్ల విభాగం. రెండు భౌతిక, సాయుధ శిక్షణ విభాగం, మూడు సర్వీస్ విభాగం (అంటే వెళ్లి దాడి చేసి వచ్చేది. అంతేకాని, సేవలు అందించేది అర్థం

# ఉగ్రవాద శిబిరాల పున

కుక్క తోక వంకరను, పాకిస్తాన్ వక్రబుద్ధిని మార్చడం ఇక ఎవరి తరమూ కాదు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఆ దేశం కకావికలైంది. అందుకు కారణం ఉగ్రవాదం. దానితో అంతర్జాతీయంగా ఆ దేశం రోగ్ అన్న పేరు తెచ్చుకుంది. అయినా ఆ పేరే ఆ దేశవాసులకు, నేతలకు ప్రియంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. ప్రముఖ జాతీయ న్యూస్ చానల్ ఇచ్చిన వివరాలు పరిశీలిస్తే అదే అనిపిస్తుంది.

అదేదో దేశ పునర్ నిర్మాణమో, ప్రకృతి వైపరీత్యం తరువాత నిర్వహించుకునే పునర్ నిర్మాణమో అన్నట్టు ఆపరేషన్ సిందూర్‌తో ధ్వంసమైన ఉగ్రవాద శిబిరాలను తిరిగి నిర్మించే పనిని పాక్ ఆలస్యం లేకుండా ప్రారంభించింది. తాత్కాలిక ప్రభుత్వం, సైన్యం, ఐఎస్ఐ ఇందుకు ఇతోధికంగా సహకరిస్తున్నాయి. ఆక్రమిత కశ్మీర్ భూభాగంలో భారత్ కంటపడకుండా ఉండే రీతిలో చిన్నవీ, పెద్ద సాంకేతిక సామర్థ్యం ఉన్నవీ ఉగ్రవాద శిక్షణ శిబిరాలను పాకిస్తాన్ నిర్మిస్తున్నదని ఆ చానల్ తెలియచేసింది. నాడు భారత్ దాడులలో నేలమట్టమైన లూని, పుట్వాల్, తీపు పోస్ట్, జమీన్ పోస్ట్, ఉమ్రన్‌వాలీ వంటి చోట ఈ ప్రయత్నాలు సాగుతున్నాయి. రెండు వందలు అంతకంటే తక్కువ సంఖ్యలోనే వీటిలో ఉగ్రవాదులను ఉంచుతారు. వీటికి ప్రత్యేక సైనిక దళాలు కాపలా ఉంటాయి కూడా. వీళ్లకి కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంచుతారట. అసలు అడుక్కు తినే పరిస్థితిలో దేశం ఉంటే, ఉగ్రవాద శిక్షణని పునరుద్ధరించడానికి

# గోవిందా... నిజం చెప్పి ముంచావు!



చారిత్రక తప్పిదాలు చేయడం, చారిత్రక వాస్తవాలను దాచడం కమ్యూనిస్టులకు రెండు కళ్ల వంటివి. ఈ వ్రతాన్ని కనుక భక్తిప్రపత్తులతో ఆచరించకుంటే ఆ పార్టీలలో ఎంతటి వారైనా శిక్షార్హులే. కేరళ సీపీఎం కార్యదర్శి ఎంవీ గోవిందన్‌ను ఇప్పుడు అదే ఆరోపణతో బోనులో నిలబెట్టారక్కడ. జూన్ 26వ తేదీన జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ సన్నివేశం చోటు చేసుకుంది. అత్యవసర పరిస్థితి వ్యతిరేక పోరాటంలో తమకీ, ఆర్‌ఎస్ఎస్‌కీ బాంధవ్యం ఏర్పడిందని గోవిందన్ నిజం చెప్పేశాడు. ఎంత నిజమైతే మాత్రం ఎర్ర రాజకీయాలలో విలువ ఉండదు దానికి. ఉప ఎన్నికల వడింది. గోవిందన్ మాటలనే కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటమి వీడియోల ద్వారా యథాశక్తిన ప్రజల వద్దకు చేర్చింది. పోలింగ్ సమీపించడంతో చాప కింద నీరులా గోవిందన్ మాటలు ప్రజల వద్దకు చేరిపోయాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా మలప్పురం గురించి (మోప్లా రక్తపాతం ఫేం) ఏదో మాట్లాడాడు కానీ, ముఖ్యమంత్రి కాబట్టి కార్యకర్తలు నోరు మెదపలేదేమో కానీ, విజయన్ మాటలను కూడా జమాత్ ఇ ఇస్లామి బాగానే ఉపయోగించుకుంది. విజయన్ మాటలను ఇస్లాం వ్యతిరేకమన్న అర్థంలో ఆ పార్టీ బాగా ప్రచారం చేసుకుంది. ఫలితం ఏమిటీ అంటే ప్రచారం తారస్థాయిలో ఉన్నప్పుడు, ఇంకా చెప్పాలంటే పోలింగ్‌కి కొద్ది గంటలకి ముందు గోవిందన్ ఆ ప్రకటన ఇవ్వడం పుండు మీద కారం చల్లినట్టయింది పార్టీకి.

ఇంతకీ ఆ ఉప ఎన్నికలలో సీపీఎం, అనగా కేరళలో అధికార పార్టీ చతికిల నీలాంబర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో యూడీఎఫ్ నెగ్గింది. ఇది గతంలో సీపీఎం స్థానం. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి అర్యదన్ షౌకత్ తన సమీప ప్రత్యర్థి, సీపీఎం పార్టీకు చెందిన ఎం. స్వరాజ్‌ను 11,077 ఓట్ల తేడాతో ఓడించారు. చాలాకాలం తరువాత సీపీఎం స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఇప్పుడే. దీనితో 2026లో జరిగే ఎన్నికలకు ఇదే నాంది అని చాలామంది అభిప్రాయానికి వచ్చేశారు. అయినా ఎమర్జెన్సీలో ఆర్‌ఎస్ఎస్‌తో కలిసి సీపీఎం పనిచేసిందన్న ఒక్క వ్యాఖ్యకే పార్టీ ఓడిపోతుందా? పినరయి విజయన్ బంగారం కుంభకోణం, ఆయన సచివాలయంలో జరిగిన అక్రమాలు, హిందూ వ్యతిరేకత ఇవన్నీ కూడా కారణాలే.

చేసుకోరాదు). ఈ విషయాలు నియా చెప్పలేదు. పీటీఐ వెల్లడించింది. సమాజంలో వివిధ వర్గాలకు చెందిన వారి పూర్తి వివరాలను పీఎఫ్ఐ సేకరిస్తూ ఉంటుంది. పేరు, వృత్తి, ఆ వృత్తిలో ఏ హోదా, వయసు, ఫోటో సహా అన్నీ వీళ్లు సేకరిస్తారు. 977 మందితో కూడిన ఆ జాబితా సంస్థకు చెందిన హిట్ లిస్ట్ అట.

అంటే వ్యక్తిగత హిట్‌లిస్టులు కూడా ఉన్నాయా? ఉన్నాయనే చెబుతున్నాయి వాస్తవాలు. ఉదాహరణకి సిరాజుద్దీన్ అనే పీఎఫ్ఐ రక్త పిపాసి సంగతే తీసుకుందాం. ఇతడి ఒక హిట్ లిస్ట్ ఉంది. ఇందులో 240 మంది పేర్లు ఉన్నాయని న్యూస్ 18 చానల్ తెలియచేసింది. ఇంతకీ ఎస్‌కే శ్రీనివాస్ దారుణ హత్యోదంతంలో ఇతడే కీలకం. ప్రస్తుతం పరారీలో ఉన్న ఆయూబ్ తా అనే వాడికి మరొక హిట్‌లిస్ట్ ఉంది. ఇందులో ఏకంగా 500 పేర్లు ఉన్నాయి. శ్రీనివాస్ కేసులోనే మరొక నిందితుడు అబ్దుల్ వాహబ్ పర్సులో ఒక హిట్‌లిస్ట్ దొరికింది. అందులో ఐదుగురి పేర్లు ఏ పథకం మేరకు చంపాలన్న వివరాలు ఉన్నాయి.

మొత్తంగా చూస్తే రాజకీయ నేతలు, హిందూ సంఘాల ప్రముఖులు, ఆఖరికి న్యాయమూర్తులు కూడా ఆ హిట్‌లిస్ట్‌లలో ఉన్నారు. పెరియార్ లోయలో పీఎఫ్ఐ కార్యకర్తలకు సాయుధ శిక్షణ గురించిన వివరాలు ఉన్న పత్రాలు కూడా నియాకు లభించాయి. ఆ లోయలోని అలువా అనే చోట జరిగిన ఆ శిక్షణ గురించి న్యూస్ 18 కూడా నమోదు చేసింది. ఇవన్నీ చూసిన తరువాత న్యాయమూర్తి కంగు తిన్నారు కాబోలు. పీఎఫ్ఐ నాయకులు పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌లను వెంటనే కొట్టివేశారు. మహమ్మద్ బిలాల్, రియాసుద్దీన్ అనే వారి పిటిషన్‌లు ఇవి. ఐఎస్ఐఎస్‌తో సంబంధాలు, హింస వంటి కారణాలతో 2022 సెప్టెంబర్‌లో పీఎఫ్ఐని కేంద్ర ప్రభుత్వం నిషేధించిన సంగతి తెలిసినదే.

## రుద్ధరణ?



మాత్రం నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని మనకు వెంటనే అనుమానం వస్తుంది. ఇందుకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇచ్చిన నిధులను యథేచ్ఛగా ఖర్చు చేస్తున్నదని నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాకిస్తాన్ మహిళల ఆర్థిక సాధికారతకు, ఇతర సంక్షేమ పథకాలకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇటీవలనే పాకిస్తాన్ 350 మిలియన్ డాలర్ల సాయం ముట్టచెప్పింది. ఇతర పథకాలకు సంబంధించి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మంజూరు చేసిన ఏడు బిలియన్ డాలర్ల నిధిలో కొంత భాగం కూడా అందుకుంది పాకిస్తాన్. చైనీస్ బ్యాంక్ నుంచి మరొక 3.3 బిలియన్ డాలర్ల సొమ్ము కూడా అందబోతోందట. ఇకనేం? కావలసినంత ధనం ఉగ్రవాదాభివృద్ధికి! ఇంతకీ పాకిస్తాన్‌తో భవిష్యత్తులో అయినా యుద్ధం తప్పదా?



# కావాలోయ్ కొత్త పార్టీ

దేశానికి ఒక కొత్త పార్టీ అవసరం చాలా ఉంది అంటున్నారు, కార్తీ పి. చిదంబర్. ఈయన శివగంగ (తమిళనాడు) లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యుడు. కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం కుమారుడే ఈయన. కులం, మతం, భాష వంటి ఉద్వేగాంశాలతో పక్కదోవ పట్టిన పట్టణ ప్రాంత సమస్యల మీద దృష్టి పెట్టగలిగిన పార్టీ దేశానికి అవసరమని కార్తీ అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడున్న రాజకీయ పక్షాల మీద మీ అభిప్రాయం ఏమిటి? అంటూ ఆయనను ఎవరూ ప్రశ్నించలేదు. ఏదో గోష్టికి పిలిచి ఈ విషయంపై మీరు జాతిని ఉద్దేశించి ప్రసంగించాలని కూడా ఎవరూ ఆహ్వానించలేదు. తన ఎక్స్ ఖాతా వేదికగానే కార్తీ ఈ కీలక వ్యాఖ్య చేశారు. ఉద్వేగపూరిత అంశాలను పక్కన పెట్టి ప్రజాసేవ కోసం, మౌలిక వసతుల కల్పన కోసం పని చేసే కొత్త పార్టీ కావాలని ఆయన జూన్ 27న ఎక్స్‌లో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ పార్టీకి పేరు కూడా సూచించారు–నేషనల్ అలయెన్స్(ఫర్) గవర్నెన్స్ అండ్ రెన్యువల్ నగర్'. మే నెలలోనే కార్తీ తండ్రి చిదంబరం ఇండీ బ్లాక్ గురించి ఒక వ్యాఖ్య చేసి పార్టీని ఇరకాటంలో పెట్టారు. ఇప్పుడు తనయుడు కూడా అదే బాట పట్టారు. అసలు ఇండీ బ్లాక్ ఎక్కడ ఏదీ అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు, నెల క్రితం. అయితే కాంగ్రెస్ ప్రముఖులు కొందరు దీనిని తేలికగా కొట్టి



# 'అత్యాచారాల రాజధాని పశ్చిమబెంగాల్'

పశ్చిమ బెంగాల్‌లో జూన్ 25, ఘోరం చోటు చేసుకుంది. కోల్‌కతాలోని సౌత్ కలకత్తా లా కాలేజీలో చదువుకుంటున్న 24 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఇద్దరు సీనియర్ విదార్థులు, ఒక పూర్వ విద్యార్థి కాలేజీలోని గార్డు రూమ్‌లో ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. నిందితులను మోనోజిత్ మిశ్రా, ప్రతిమ్ ముఖర్జీ, జైద్ అహ్మద్‌గా గుర్తించారు. అయితే నిందితులను అరెస్టు చేయాలన్న ఆలోచన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రభుత్వానికి ఏ మాత్రం రాలేదు. ఎందుకంటే ప్రధాన నిందితుడు మిశ్రా తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి సంఘానికి నాయకుడిగా పనిచేసాడు కాబట్టి. నిందితులను వెనకేస్తున్న దీదీ సర్కారు వైఖరి చూసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, బెంగాల్ శాసనసభలో విపక్ష నేత సువేందు అధికారి రంగంలోకి దిగారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా, మహిళా సంఘాలు రోడ్డెక్కాయి. నిందితులను అరెస్టు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. చివరకు ముగ్గురు నిందితులతో పాటుగా కాలేజీ సెక్యూరిటీ గార్డును కూడా పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలో యువతులకు, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, సాక్షాత్తూ అధికార పక్షానికి చెందిన నేతలే అత్యాచారాలకు ఒడిగొడుతున్నారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. కోల్‌కతాలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీనేత, కేంద్ర మంత్రి సుకాంత మజుందార్‌ను, మహిళా నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మమతా బెనర్జీ హయాంలో బెంగాల్‌లో ప్రజాస్వామ్యం నాశనమైపోయిందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ దేశానికి అత్యాచారాల రాజధానిగా మారిపోయిందని ఇతర పార్టీల నేతలు విమర్శించారు.




# సీబీఎస్ఈ టెన్త్ పరీక్షలు.. ఏడాదికి రెండుసార్లు

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్–సీబీఎస్ఈ కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై పదవ తరగతి బోర్డు పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించేలా నియమాలను రూపొందించింది. ఇదే విషయమై పరీక్షల కంట్రోలర్ భరద్వాజ్ మీడియాతో మాట్లాడుతూ రెండుసార్లు పరీక్షలు నిర్వహించే విధానాన్ని సీబీఎస్ఈ ఆమోదించిందని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరిలో, రెండవ పరీక్ష మే నెలలో నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్షల ఫలితాలను మార్చిలో, మే ఫలితాలను జూన్‌లో ప్రకటిస్తారు. అయితే రెండుసార్లు పరీక్షలు నిర్వహించే ఈ విధానంలో మొదటి పరీక్షకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. రెండవ విడత పరీక్ష ఆప్షనల్‌గా ఉంటుంది. మొదటి పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించలేకపోయిన విద్యార్థులకు రెండవ పరీక్షను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. రెండు పరీక్షల్లోనూ మంచి స్కోర్‌ను సీబీఎస్ఈ పరిగణనలోకి తీసుకుంటుంది. విద్యార్థులు తమ ఇష్టానుసారం రెండవ బోర్డు పరీక్షకు హాజరు కావొచ్చు. మొదటి పరీక్షలో మార్కులు తగ్గితే, రెండవ పరీక్ష రాసి మెరుగైన ఫలితాలను సాధించవచ్చు. మొదటి పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చి రెండవ పరీక్షలో తక్కువ మార్కులు వస్తే మొదటి పరీక్షలో వచ్చిన మార్కులనే సీబీఎస్ఈ పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ విద్యా సంవత్సరానికి మొదటి పరీక్షను వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6 వరకు, రెండవ పరీక్షను మే 5 నుంచి 20 వరకు నిర్వహిస్తారు.

పారేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ నిద్రలేని రాత్రులు గడుపుతుందని అనుకోవద్దు అంటున్నారు. పార్టీపై ఇలాంటి మాటలు వస్తాయి, పోతాయి వాటిని ఈ చెవితో విని ఆ చెవి నుంచి వదిలేయడమే అని కూడా సలహా ఇచ్చారు. యాభయ్ ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ జ్ఞాపకాలు, ఆమె మనుమడు రాహుల్ గాంధీ నేటి నాయకత్వం ప్రస్తుతం కాంగ్రెస్‌లో కల్లోలాన్ని ఇంకాస్త పెంచే సూచనలే కనిపిస్తున్నాయి. కొత్త పార్టీ అవసరమూ అన్నారంటే, ప్రస్తుతం వారున్న పార్టీ చతికిలపడిందనే కదా అర్థం!



# ఆరేళ్లకు మానస సరోవర్ యాత్ర ఆరంభం

ఆరేళ్లుగా నిలిచిపోయిన కైలాష్ మానస సరోవర్ యాత్ర మళ్లీ మొదలవుతుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జూన్ 27న తెలిపారు. షాంఘై సహకార సంస్థ–ఎస్సీవో సదస్సు నేపథ్యంలో చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డోంగ్ జున్‌తో ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా యాత్ర ప్రస్తావనకు వచ్చిందని తెలిపారు. యాత్రను పునరుద్ధరించడానికి ఆయన అంగీకరించారని ఎక్స్‌లో చేసిన ఒక పోస్టులో రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మొదటగా 2020లో కోవిడ్ మహమ్మారి కారణంగా యాత్ర నిలిచిపోయింది. ఆ తర్వాత లద్దాఖ్‌కు తూర్పు దిక్కున గాల్వాన్ లోయలో వాస్తవాధీన రేఖ వెంబడి భారత్, చైనా సైనికుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కారణంగా యాత్ర పునరుద్ధరణకు నోచుకోలేదు. తాజాగా రాజ్‌నాథ్ సింగ్ చొరవతో యాత్రకు మార్గం సుగమమైంది. ఈ యాత్రను ప్రతీ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ నెలల మధ్య కాలంలో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్వహిస్తుంటుంది. ఉత్తరాఖండ్‌లో లిపులేఖ్ పాస్, సిక్కిమ్‌లో నాథులా పాస్ అనే రెండు మార్గాల్లో, 23 నుంచి 25 రోజుల వ్యవధిలో యాత్ర కొనసాగుతుంటుంది. యాత్రికులు మార్గమధ్యంలో అత్యంత సవాల్‌తో కూడుకున్న 45 కి.మీ.ల దూరాన్ని ట్రెక్కింగ్ చేస్తూ అధిగమించాల్సి ఉంటుంది. ఈ ఏడాది యాత్రలో పాల్గొనడానికి 5,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 550 మందిని కంప్యూటరైజ్డ్ లాటరీ ద్వారా సంబంధిత అధికారులు యాత్రకు ఎంపిక చేశారు.



# ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయని 345 పార్టీలు!

కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీగా నమోదు చేసుకొని ఎన్నికలకు దూరంగా ఉంటున్న పార్టీలపై తీవ్రమైన చర్యలకు ఉపక్రమించింది. 2019 నుంచి ఇప్పటివరకూ ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయని పార్టీలను గుర్తించింది. దేశవ్యా ప్తంగా ఇలాంటివి 345 పార్టీలు ఉన్నట్టు తేలింది. ఇవన్నీ నమోదిత గుర్తింపు లేని–రిజిస్టర్ అన్ రికగ్నైజ్డ్ రాజకీయ పార్టీలేనని నిర్ధారణ అయ్యింది. ఈసీ వీటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించింది. సాధార ణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే ఎన్నికల్లో కనీసం ఆరు శాతం ఓట్లను దక్కించుకోవడం కానీ నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలవడం కానీ చేయాలి.

# బాంగ్లాదేశ్‌లో దుర్గా మాత మందిరం కూల్చివేత



బాంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరంలో దుర్గామాత ఆలయాన్ని అధికారులు కూల్చివేశారు. ఆలయాన్ని తాత్కాలికంగా చట్టవిరుద్ధంగా నిర్మించారని అక్కడి అధికారులు పేర్కొన్నారు. కాగా, బాంగ్లాదేశ్‌లో అల్పసంఖ్యాక వర్గీయుల పట్ల అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై భారత్ తీవ్రంగా స్పందించింది. అక్కడ నివసిస్తున్న హిందువులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. జూన్ 23న ఒక ముస్లింల మూక ఆలయంపై దాడి చేసి ధ్వంసం చేయడానికి ప్రయత్నించింది. గుడిని ఖాళీ చేయడానికి 12 గంటల గడువిచ్చింది. అసభ్యకరమైన పదజాలంతో దుర్భాషలాడుతూ భక్తులను చంపేస్తామని బెదిరించింది. ఈ నేపథ్యంలో బాంగ్లాదేశ్ రైల్వే ఢాకా డివిజన్ డిప్యూటీ కమిషనర్ నాసిర్ ఉద్దీన్ జూన్ 25న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులకు లోబడి ఆ మర్నాడు అంటే జూన్ 26న అధికారులు ఖిల్ఖేత్ సర్బజానిన్ దుర్గా మందిరాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా పూర్బాచల్ ఆర్మీ క్యాంప్ నుంచి సాయుధ బలగాలు, పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుల్డోజర్లు మందిరం వద్దకు చేరుకోగానే కూల్చివేత బృందాన్ని నిలువరించడానికి భక్తులు ఆలయం ముందు బైఠాయించారు. మర్నాడు రథయాత్ర తర్వాత చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రాధేయపడ్డారు. అయినాకానీ అధికారులు వినిపించుకోలేదు. సైనిక సిబ్బంది భక్తులను అక్కడి నుంచి తొలగించారు. అధికారులు బుల్డోజర్లతో మందిరాన్ని కూల్చివేశారు. ఘటన పట్ల భారత ప్రభుత్వం నిరసన వ్యక్తం చేసింది. హిందువులను, వారి ఆస్తులను, వారి ప్రార్థనామందిరాలను రక్షించాల్సిన బాధ్యత బాంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానిది అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. ★

## కథ

"హలో! ఎవరూ?" అన్నాడు శంభు ప్రసాద్ సెల్ ఆన్ చేసి.

"నేను రా ప్రసన్నని... సారీ రా! నిన్ను ఇప్పుడు 'రా' అనొచ్చో లేదో నాకు తెలియడం లేదు" అవతల వైపు గొంతులో కొంచెం తడబాటు.

కొన్ని సెకన్లు అక్కడ మౌనం రాజ్యమేలింది. ఎంతటి క్లిష్టమైన ఆపరేషన్ అయినా విజయవంతంగా చేసి ప్రాణాలను కాపాడే డాక్టర్‌గా పేరున్న శంభు ప్రసాద్ మనసులో ప్రసన్న జ్ఞాపకం వెలికి రావడానికి కాస్త సమయం పట్టింది.

"శంభూ! నువ్విప్పుడు అమెరికాలో చాలా పెద్ద డాక్టర్‌వి. పాపం! ఎప్పుడో చిన్నప్పుడు చదువుకున్న స్కూలు ఫ్రెండ్ ఎలా గుర్తుంటాడు? మనిద్దరం వేల్పూరు నుండి ఆర్మూర్ వరకు బస్ పాస్ తీసుకుని ఇంటర్ వరకూ కలిసే చదువుకున్నాం. ఇప్పుడు గుర్తొచ్చిందా?" అడిగాడు ప్రసన్న.

"ఓ మై గాడ్! నువ్వటా? ప్రసన్నా! నిన్నెందుకు మరచిపోతాను? ఉన్నట్లుండి ఇన్నేళ్ల తరువాత సడెన్‌గా ఫోన్ చేస్తే ఎవరికైనా ఇలాగే ఉంటుంది" అన్నాడు శంభుప్రసాద్.

"శంభూ! చాలా సంతోషంరా నేను గుర్తున్నందుకు. నేను రా అంటే నీకు కోపం రాదుగా?" అన్నాడు ప్రసన్న నవ్వుతూ.

"ఛ... అదేం మాట. ఇన్నాళ్లకు ఎందుకు గుర్తొచ్చానో త్వరగా చెప్పు. అవతల అర్జంటు ఆపరేషన్ కేసుంది" అన్నాడు శంభుప్రసాద్ వాచీ చూసుకుంటూ.

"మనం చదువుకున్న బడిలోనే హెడ్‌మాస్టర్‌గా పని చేస్తున్నాను. మన ఊరిలో నిన్న మీ నాన్న గారికి కలెక్టర్ గారి చేతుల మీదుగా "ఆదర్శ పౌరుడు" అవార్డ్‌తో సన్మానం జరిగింది. అప్పుడు ఆయన మాట్లాడిన మాటలు విన్న కలెక్టర్ గారితో పాటు అందరూ అభినందించారు. ఆ వార్త అన్ని పేపర్లలో రావాలని విలేకరులకు ఆదేశాలిచ్చారు. అంతకన్నా ముఖ్య విషయం పాఠ్య పుస్తకాలలో పాఠం రూపంలోకి తెస్తానన్నారు. నాకు మీ నాన్నగారి గురించి తెలిసినంత మటుకు ఆయన గొప్ప ఆయనే చెప్పుకోరు. ఆయనకున్న ఒక్కగానొక్క కొడుకువి, నీ మానాన నువ్వు ప్రేమించి పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోయావు. ఇక్కడ జరిగేవి నీకు తెలియదు. అందుకే ఈ విషయం చేరవేయాలనిపించింది. అందుకే నీ నంబర్ సంపాదించి ఫోన్ చేస్తున్నాను" అన్నాడు ప్రసన్న.

"డాడీ ఏం మాట్లాడారు?" శంభు గొంతులో ఇదివరకటి మృదుత్వం లేదు.

"నువ్వే చూడరా! యూ ట్యూబ్ లింక్ పెడుతున్నాను. ఇక ఉంటాను" అన్నాడు ప్రసన్న.

శంభుప్రసాద్ ఫోన్ పెట్టేసినాక అతడి ముఖమంతా మాడిపోయింది.

'డాడీ ఏం మాట్లాడుంటారు? ఎప్పుడో ఇరవై ఏళ్ల క్రితం స్నేహాన్ని గుర్తుంచుకుని లింక్ పంపాడంటే అందులో నా గురించేమైనా మాట్లాడారా?' ఆలోచిస్తున్న సమయంలోనే ప్రసన్న నుండి వాట్సాప్‌లో లింక్ వచ్చింది. ఆత్రంగా చూడాలని తెరవబోయాడు. తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

"కమిన్" అసహనంగా అన్నాడు శంభుప్రసాద్.

"సర్! ఎవ్రిథింగ్ ఈజ్ రెడీ ఫర్ ద ఆపరేషన్ సర్!" అంది లోపలకు వచ్చిన నర్సు.

ఫోన్ ఆఫ్ చేసి టేబుల్ మీద పెట్టి ఆపరేషన్ థియేటర్ వైపు నడిచాడు శంభుప్రసాద్. ఆ తరువాత అతడికి ఇంటికి వచ్చేంత వరకు ఆలోచనలు మరే విషయం వైపుకి మళ్లడానికి సమయం దొరకలేదు.

"డాడీ! మీరు ఈ రోజు చాలా ఆలస్యంగా వచ్చారు. కేసులు ఎక్కువగా ఉండి ఉంటాయి. మామ్ ఎప్పుడో వచ్చేసింది. తను టైర్డ్‌గా ఉన్నానని డిన్నర్ చేసి పడుకుంది. మనిద్దరం తిందాం. మీరు త్వరగా ఫ్రెషయి రండి." అంది స్నేహ.

"ఓహ్! నువ్వింకా తినలేదా? ఫైవ్ మినిట్స్‌లో వస్తాను" గదిలోకి వెళ్తూ అన్నాడు శంభుప్రసాద్.

ఈలోగా స్నేహ హాల్లో డైనింగ్ టేబుల్ మీద అన్ని పదార్థాలు సర్దింది.

"ఆలస్యమైందా స్నేహ డియర్?" అన్నాడు శంభు ప్రసాద్.

"నో డాడ్!..." అంటూ పళ్లాలు తీసుకుని రెండు పుల్కాలు పెట్టి కూర వేసి తండ్రి చేతికిచ్చింది.

అప్పుడే శంభుప్రసాద్ ఫోన్‌కి మెసేజ్ వచ్చిన శబ్దం వచ్చింది. వాట్సాప్ ఓపెన్ చేసి చూసాడు. ఫోన్ స్టాండ్‌లో పెట్టి ప్రసన్న పంపిన లింక్ ఓపెన్ చేసాడు.



**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**



# జననీ జన్మభూమిశ్చ...

## కె.వి. సుమలత

"తినకుండా ఏంటి డాడీ?" అంటూ మొబైల్ వైపు చూసిన స్నేహ "తాతయ్యా..." అంటూ తను కూడా తినడం ఆపేసింది.

స్టేజీ మీద మైక్ ముందు నిలబడిన తండ్రి గోపాలరావుని చూడగానే శంభుప్రసాద్ కళ్లు పెద్దవయ్యాయి. గోపాలరావు మైక్ చెత్తో పట్టుకుని ఒకసారి చుట్టూ చూసి మాట్లాడడం ప్రారంభించాడు.

"సభకు నమస్కారం. కలెక్టర్ గారి చేతుల మీదుగా నాకు ఈ అవార్డ్ ఇచ్చినందుకు సంతోషం ఉంది. చాలా ఇబ్బందిగా కూడా అనిపిస్తుంది. కారణం నేనంత గొప్ప పనేమీ చేయలేదు.

'జననీ జన్మభూమిశ్చ... స్వర్గాదపి గరీయసి' అంటారు. అమ్మ ఒడి, పుట్టిన గడ్డ స్వర్గంతో సమానం అంటారు. పుట్టిన ఊరిలో ఎప్పటికీ ఉండడం అందరికీ సాధ్యం కాదు. చదువు నిమిత్తం, ఉద్యోగాల నిమిత్తం, ఆడపిల్లలయితే వివాహనంతరం ఊరు వదిలి వెళ్లాల్సిందే. మా తరం ఊరిని వదలకుండానే, కుటుంబాలను కదపకుండానే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించింది. ఈ కాలం పిల్లలు వారి ఉద్యోగాల కోసం దూరంగా విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకు వారిని తప్పు పట్టలేం. యువత ముందు చదువు, తరువాత ఉద్యోగం, ఆ తరువాత అపరిమితమైన సంపాదన కోసం పరుగులు తీస్తున్నారు. చిన్నప్పుడు వారు చదివిన పాఠశాలలు, ఈత నేర్చుకున్న చెరువులు, కలిసి చదువుకున్న స్నేహితులు, ఆటలాడిన పొలం గట్లు, వసతులు లేకపోయినా ఆనందాలు పంచిన కుటుంబాలు, ఇవన్నీ కలగలిపిన స్వంత ఊరుని మరచిపోతున్నారు. ఫలితాలను ఆశించకుండా పిల్లలను పెంచడం, విద్యాబుద్ధులు నేర్పించడం, ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడం తల్లితండ్రుల బాధ్యత. నేటి తరానికి పోటీ ప్రపంచంలో తామే అగ్రగాములు కావాలనే కోరికలు పెరిగి బంధాలు, అనుబంధాలు సంకెళ్లుగా కనిపిస్తున్నాయి. అందుకే తెంచుకొని వాటికి దూరంగా పారిపోతున్నారు. పల్లెటూర్లను కన్నబిడ్డల మమతల జల్లుకోసం పరితపించే ఎడారులుగా మారుస్తున్నారు. ప్రస్తుతం పల్లెలు వృద్ధులకు ఆశ్రయాలుగా మారిపోతు న్నాయి. ఇది చాలా దారుణమైన విషయం... ప్రతీ ఒక్కరూ పుట్టిన ఊరు రుణం తీర్చుకోవలసిందే! వారు నేర్చుకున్న విజ్ఞానం పుట్టి పెరిగిన ఊరికి అక్కరకు రానప్పుడు అది ఎంత పెద్దదైనా తృణప్రాయమే! నీవు పుట్టిన ప్రాంతానికి నువ్వేం చేశావని మనస్సాక్షి ఎప్పుడోకప్పుడు తప్పకుండా ప్రశ్నిస్తుంది. అప్పుడు చెప్పేందుకు జవాబు, చేసేందుకు సమయం మన దగ్గర ఉండాలి. అలాగే ఈ ఉరుకుల పరుగులలో జీవితంలో వెనక్కు తిరిగి చూసుకుంటే తృప్తి అన్న పదానికి తావు లేకపోతే ఎడారిలో చెలమ కోసం వెతికినట్లవుతుంది. అలా నా తృప్తి కోసమే నేను ఊరికి చేయగలిగింది చేసాను. ఎవరి మెప్పు పొందడం కోసం చేయలేదు. ఈ సన్మానాలు, అవార్డులు నాకు ఇష్టం ఉండవు."

గోపాలరావు గారు చెప్పడం ఆపి చుట్టూ చూసారు.

"నా కొడుకు అమెరికాలో పెద్ద డాక్టర్. అందుకు నాకు గర్వంగానే ఉంది. కానీ, కొడుకు కోసం తపించిపోయిన నా భార్య ఈ ఊర్లో సరైన వైద్య సదుపాయాలు లేక కొడుకు కోసం కలవరిస్తూనే కరోనాతో కన్నుమూసింది. కరోనా కారణంగా అమెరికా నుంచి విమానాలు లేక నా కొడుకు కడసారి కన్న తల్లిని చూడలేకపోయాడు. వైద్యం సరిగా జరగాలంటే పల్లె వదిలి నగరాలకు వలస వెళ్లమంటాడు నా కొడుకు. ఎంతమంది పల్లె వదిలి పట్నాలు వెళ్లగలరు? పల్లెలు వదిలి అంతా పట్నాలకు పోతే మనకు ఆహారం ఎవరు పండిస్తారు? మనిషన్న వాడికి కన్నతల్లి, పుట్టిన ఊరు రుణం తీర్చుకోవలసిన కనీస బాధ్యత ఉంది. ఈ ఊరిలో మంచి విద్య, వైద్యం ఉంటే ఊరు వదిలి పల్లెని ఎడారిగా మార్చక్కర్లేదు కదా! ఒక్కసారి అందరూ ఆలోచించండి. అందుకే నేను ఒక నిర్ణయం తీసుకున్నాను. ఈ ఊరులో నాకున్న పద్నాలుగు గదుల మండువా ఇల్లును ఎవరైనా వైద్యులు ఆసుపత్రి నడుపుతానంటే ఉచితంగా ఇవ్వదలుచుకున్నాను. అందరికీ మరోసారి ధన్యవాదాలు'' అంటూ ఉపన్యాసం ముగించాడు గోపాలరావు.

వేల్పూరు గ్రామ ప్రజలందరూ చప్పట్లతో ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.

"వండర్ ఫుల్ తాతయ్యా! వండర్ ఫుల్" అంటూ స్నేహ కూడా చప్పట్లు కొడుతూ అరుస్తోంది.

శంభు ప్రసాద్ తండ్రి మాటలలో తను ఊహించినట్లే ఉండటంతో గుచ్చుకోవలసిన చోటే లోతుగా గుచ్చుకుంది.

"డాడీ! తాతయ్య మళ్లీమళ్లీ ఊరికి సహాయం చేస్తూనే ఉన్నారు. ఆయన నిజంగా రియల్ హీరో కదూ!" ఎంతో ఉద్వేగంతో అంది స్నేహ.

శంభు ప్రసాద్ అవునన్నట్లు తల ఆడించాడు.

"మీరు ఒక సక్సెస్ ఫుల్ డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తున్నారు. మీరిప్పుడు చాలా తృప్తిగా ఉన్నారా డాడీ?" అంది స్నేహ.

'తృప్తిగా ఉన్నాడా తాను?...' అతడు సమాధానం చెప్పడానికి ఆలోచనలో పడ్డాడు.

“సారీ డాడీ, మీరు ఏమీ అనుకోనంటే మరో మాట! మీరు, అమ్మ మంచి డాక్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. మనకు డబ్బుకి ఎటువంటి లోటు లేదు. బామ్మ కరోనా సమయంలో సరైన వైద్యం లేకే చనిపోయింది. వేల్పూరులో ఒక హాస్పిటల్ పెడితే ఎంతో మందికి మంచి వైద్యం అందుతుంది. ఎంతోమంది బామ్మలు, తాతయ్యలు పూర్తికాలం జీవిస్తారు. అలా ఎందుకు మనం పల్లెకు పోకూడదు?” అంది స్నేహ.



“మీరు వేల్పూరు నుండి అమెరికా వచ్చి దాదాపు ఫిఫ్టీన్ ఇయర్స్ అవుతోంది. మీ బర్త్ ప్లేస్‌కి ఏదయినా సహాయం చేయాలని ఎప్పుడూ అనిపించలేదా?” మళ్ళీ అడిగింది స్నేహ.

ఆ ప్రశ్నలకు సమాధానం అతడి దగ్గర లేదు.

“సారీ డాడీ, మీరు ఏమీ అనుకోనంటే మరో మాట! మీరు, అమ్మ మంచి డాక్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. మనకు డబ్బుకి ఎటువంటి లోటు లేదు. బామ్మ కరోనా సమయంలో సరైన వైద్యం లేకే చనిపోయింది. వేల్పూరులో ఒక హాస్పిటల్ పెడితే ఎంతో మందికి మంచి వైద్యం అందుతుంది. ఎంతోమంది బామ్మలు, తాతయ్యలు పూర్తికాలం జీవిస్తారు. అలా ఎందుకు మనం పల్లెకు పోకూడదు?” అంది స్నేహ.

శంభుప్రసాద్, గుమ్మం దగ్గర నిలబడి వీళ్ల మాటలు వింటున్న దివ్య, ఒక్కసారిగా తుళ్లిపడ్డారు. ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

“మామ్! లేచావా? నువ్వు అన్ని మాటలు విన్నావని నిన్ను చూస్తే అర్థమైంది. నువ్వు, డాడీ నా ప్రశ్నలకు సమాధానం చెప్పండి. ఈ లోగా నేను తాతయ్యకు అభినందనలు చెప్తాను” అంటూ అక్కడ నుండి వెళ్లిపోయింది స్నేహ.

శంభు ప్రసాద్, దివ్యల కళ్ల ముందు గతం కదలాడింది.

* * *

గోపాలరావు నిజామాబాద్ జిల్లా వేల్పూరు గ్రామంలో వృత్తి పట్ల అంకిత భావం, జీవితం పట్ల క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయుడు. ఆయన ఆలోచనలన్నీ ఆదర్శభావాలతో నిండి ఉంటాయి. భార్య లక్ష్మి ఆయన ఇష్టాలను గౌరవించే అనుకూలవతి. వారికి ఒక్కగానొక్క కొడుకు శంభు ప్రసాద్ తెలివైన అబ్బాయి. అతడికి మెడిసిన్ ఎంట్రెన్సులో మంచి ర్యాంక్ రావడంతో ఉచితంగా యూనివర్శిటీలో సీట్ వచ్చింది. ఆ తరువాత ఆలోచించుకునే వ్యవధి లేకుండానే ఎంబిబిఎస్ పూర్తయింది. శంభు ప్రసాద్ పేరు పక్కన డాక్టర్ డిగ్రీ వచ్చాక తనతో పాటు చదువుకున్న దివ్యను తల్లితండ్రుల అనుమతితో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయ్యాక ఇద్దరూ పీజీ ఎంట్రెన్సు కోసం కోచింగ్ తీసుకోవడానికి హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. ఆ సమయంలోనే దివ్య నెల తప్పింది. వారి జీవితంలోకి చిన్నారి స్నేహ అడుగు పెట్టింది. స్నేహ నెలల పిల్లగా ఉన్నప్పుడే వాళ్లకు ఎమ్.ఎస్ చేయడానికి విదేశాలకు వెళ్లే అవకాశం వచ్చింది. శంభు ప్రసాద్ ఈ విషయం తండ్రితో సంప్రదించాడు.

“డాడీ! ఇండియాలో చేసిన ఎమ్ ఎస్ క్వాలిఫికేషన్‌కు, ఫారిన్లో చేసిన ఎమ్ ఎస్ క్వాలిఫికేషన్‌కు చాలా తేడా ఉంటుంది. మేమిద్దరమూ ఎమ్ ఎస్ చేయడానికి అమెరికా వెళ్తాము” అన్నాడు శంభు ప్రసాద్.

“మీరిద్దరూ వెళ్లాలనుకోవడం వరకూ బాగానే ఉంది. మరి స్నేహ?” అన్నాడు గోపాలరావు.

“పసిపిల్లను తీసుకుని వెళ్తే మాకు చాలా ఇబ్బందవుతుంది. దివ్య మదర్ దగ్గర ఉంచుదామంటే ఆవిడ ఆరోగ్యం అంతగా బాగుండదు. కాబట్టి అక్కడ ఉంచడం కుదరదు. మీ దగ్గరే వదిలి వెళ్తాము.” అన్నాడు శంభు ప్రసాద్.

“శంభూ! పాలు తాగే పసిపిల్ల తల్లితండ్రుల ఒడిలో పెరగాలి కానీ...” ఆగాడు గోపాలరావు.

“డాడీ! మూడేళ్లు ఎంతలోకి తిరిగొస్తాయి? కానీ నా బాధల్లా ఈ ఊరులో సరైన వైద్య సదుపాయం కూడా లేదు. ఇక్కడ ఇల్లు అమ్మేసి ఆర్మూర్‌లో ఇల్లు కొనుక్కుంటే బాగుంటుంది. మీరిద్దరూ పెద్దవాళ్లయ్యారు, ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. అప్పటికప్పుడు ఆర్మూరు కానీ నిజామాబాద్ కానీ వెళ్లాల్సి వస్తుంది. అప్పుడు ఎంత సమస్యవుతుంది?” అన్నాడు శంభు.

“అందరూ అలా అనుకుంటే పల్లెలు ఎడారులుగా మిగిలిపోతాయి. ఇప్పటికే నీలాంటి యువత చదువుల కోసం, ఉద్యోగాల కోసం పట్నాలకు, విదేశాలకు ఎగిరి పోతున్నారు. మా లాంటి వాళ్ళు ఇక్కడ ఉంటేనైనా అపుడపుడు వచ్చి ప్రశాంత జీవితం గడుపుతారు” అన్నాడు గోపాలరావు.

“మావయ్యగారు! మీరలా మొండిపట్టు పడితే ఎలా? మీ దగ్గర పసిపిల్లను ఉంచుతున్నాం. ఏదయినా ఎమర్జెన్సీ వస్తే ఎలా?” నిష్ఠూరంగా అంది దివ్య.

“అలా అపశకునం మాటలు మాట్లాడకమ్మా. స్నేహ మా ఇద్దరి ప్రాణం, కంటికి రెప్పలా కాపాడుకుంటాము. నీ భర్త కూడా ఇక్కడే పుట్టి ఇక్కడే క్షేమంగా పెరిగాడు.” విషయాన్ని ఖండించాడు గోపాలరావు.

అలా స్నేహను నానమ్మ, తాతయ్యలకు అప్పగించి దివ్య, శంభు ప్రసాద్ యూ ఎస్ వెళ్లిపోయారు.

* * *

వారిద్దరికీ స్నేహతో రోజొక వేడుకగా మూడేళ్లు గడిచాయి. ఒక రోజు స్నేహకు జోలపాట పాడుతూ గోపాలరావు నిద్ర పుచ్చుతున్నాడు.

“జో అచ్యుతానంద జోజో ముకుందా
లాలి పరమానంద రామ గోవిందా
చిన్నారి స్నేహమ్మ జో...
బంగారు బుజ్జాయి జో”

“తాతయ్యా! ఆపేసావు... పాడు... దూ...” నిద్ర



మత్తులోనే అంటోంది స్నేహ.

"అమ్మదొంగా! నిద్ర వస్తున్నా ఆపుకుంటున్నావా?" జో కొడుతూ మురిపెంగా అన్నాడు గోపాలరావు.

సమాధానం రాకపోవడంతో వంగి స్నేహ ముఖం చూసాడు. పాలుగారే బుగ్గలతో స్నేహ చాలా ముద్దుగా ఉంది. మెల్లగా నిద్రలోకి జారుకున్న మనవరాలి నుదుటి మీద పడుతున్న ముంగురులు సవరిస్తూ నుతిమెత్తని ముద్దు పెట్టుకున్నాడు.

"మీ గారాల మనవరాలు పడుకుందా?" చీర కొంగుతో చేతులు తుడుస్తూ లోపలకు వచ్చింది లక్ష్మి.

"నాకేనా మనవరాలు? నీకు కాదా?" నవ్వుతూ అన్నాడు గోపాలరావు.

"మనిద్దరి మనవరాలు... సరేనా? తాతయ్య జోల పాడనిదే మనవరాలికి నిద్ర రాదుగా?" నవ్వుతూ అంది లక్ష్మి.

గోపాలరావు కూడా నవ్వేసాడు. అంతలో ఆయన ఫోన్ రింగ్ అయింది.

"అబ్బాయి ఫోన్ చేస్తున్నాడు" అంటూ ఫోన్ తెచ్చి ఆయనకు ఇచ్చింది.

"హలో బాబూ! ఎలా ఉన్నారు?" అన్నాడు గోపాలరావు.

"ఫైన్ డాడీ! మీరెలా ఉన్నారు? అమ్మ బాగుందా? స్నేహ మేలుకుని ఉందా?" అన్నాడు శంభు ప్రసాద్.

"ఇప్పుడే నిద్రలోకి జారుకుంది బాబూ! ఈ రోజు ఫోన్ చేయడానికి ఇంతాలస్యం అయిందేంటి?" ...

"రోజూ స్నేహను చూడటానికి మధ్యలో బ్రేక్ తీసుకుంటాను డాడీ! ఈ రోజు ఎమర్జెన్సీ కేసులున్నాయి, అందుకే కుదరలేదు. రేపు ఆదివారం కదా హాస్పిటల్‌కి ఆలస్యంగా వెళ్తాము. దివ్య కూడా పాపను చూడాలంటుంది. ఉదయం లేచాక వీడియో కాల్ చేస్తాను. బై డాడీ!" అని ఫోన్ పెట్టేసాడు శంభు.

"లక్ష్మీ! బాబు రేపు ఉదయం ఫోన్ చేస్తానన్నాడు"...

"సరే, ఇక పడుకోండి" అని స్నేహకి దుప్పటి కప్పి పక్కనే పడుకుంది లక్ష్మి.

* * *

మరుసటి రోజు ఉదయం శంభు ప్రసాద్ ఫోన్ చేసి వాళ్ల గుండెలు గుభేల్ మనిపించే వార్త చెప్పాడు.

"మామ్, డాడ్! మేము కొంత కాలం ఇక్కడే హాస్పిటల్ పెట్టుకుని ప్రాక్టీసు చేయాలనుకుంటున్నాము. కొంత డబ్బు సంపాదించిన తర్వాత ఇండియా వస్తాము. ఈ లోగా స్నేహను అమెరికా తీసుకురావడానికి వీసా ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు శంభు.

"అదేంటి ఉన్నట్లుండి ఇలాంటి షాక్ ఇచ్చావు బాబూ?" అంది లక్ష్మి.

"ఇందులో షాక్ అయ్యేందుకు ఏముంది మామ్? పిల్లలు తల్లిదండ్రుల దగ్గరే కదా ఉండవలసింది. కొన్నాళ్లు ఇక్కడ ఉంటేనే మంచి ఫలితం ఉంటుంది" అన్నాడు శంభు.

"మీరు అక్కడ కొంత కాలం ఉండటమనేది మీకు ఆనందమైతే ఉండండి. కానీ స్నేహ మా దగ్గర బాగానే ఉంది, తను లేకుండా మేముండలేము" అన్నాడు గోపాలరావు.

"అదెలా కుదురుతుంది మావయ్య గారు? తన ఎడ్యుకేషన్‌కి ఇబ్బంది అవుతుంది" అంది దివ్య.

"శంభు ఇక్కడ చదివే అమెరికా వెళ్లాడు" అన్నాడు గోపాలరావు.

దివ్య ముఖం మాడ్చుకుంది. అది శంభు ప్రసాద్ గమనించాడు.

"డాడీ! మేము త్వరలో స్నేహను తీసుకు వెళ్తాం. ఇక ఈ విషయాలు వదిలేయండి" అని ఫోన్ పెట్టేసాడు శంభు.

* * *

కొద్ది రోజుల తరువాత ఒక రోజు ఉదయం స్నేహ నిద్ర లేవడమే కడుపులో నొప్పి అంటూ ఏడుపు మొదలు పెట్టింది.

"ఇదేంటి పాప ఒళ్లు వేడిగా ఉంది?" నుదుటి మీద చేయి వేసి అన్నాడు గోపాలరావు.

"అయ్యో! నాలుగు రోజుల నుండి ఆహారం కూడా సరిగ్గా తీసుకోవడం లేదండీ. నులి పురుగుల మందేమైనా వేయాలేమో అనుకుంటున్నాను" అంది లక్ష్మి.

కాసేపటికి స్నేహకు టెంపరేచర్ పెరిగింది. గోపాలరావు ఊర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. డాక్టర్ ఇచ్చిన మందులు వేసిన కాసేపటికి టెంపరేచర్ తగ్గింది, కానీ మళ్లీ జ్వరం వచ్చింది. ఆగి ఆగి వస్తున్న జ్వరం, వాంతులతో సాయంత్రానికి బాగా నీరసంగా అయింది. చంక దిగకుండా ఏడుస్తూనే ఉంది. రెండవ రోజు ఉదయం ఇద్దరూ కలిసి పదహారు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్మూరులోని పిల్లల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు.

"పాప పొట్టలో కొన్ని పెద్ద పరిమాణంలో లింఫోనోడ్స్ ఉన్నాయి. వాటి సైజు తగ్గడానికి యాంటీబయాటిక్స్ వాడాలి" పరీక్షలయ్యాక చెప్పారు డాక్టర్.

"సరే నండి" అని ఇద్దరూ పాపను తీసుకుని ఇంటికి వచ్చారు.

రెండవ రోజు కూడా స్నేహకు జ్వరం తగ్గలేదు. వాంతులు కూడా తగ్గలేదు. నీళ్లు తాగితే వాంతుల రూపంలో వస్తున్నాయి. ఇద్దరూ బాగా కంగారు పడ్డారు. రిపోర్ట్సన్నీ వాట్సాప్‌లో శంభు చూసాడు. స్వంతంగా తను కూడా కొన్ని మెడిసిన్స్ చెప్పాడు. ఏమీ ఉపయోగం లేకపోయింది. సాయంత్రానికి స్నేహ తోటకూర కాడలా వేలాడిపోయింది. లక్ష్మి ఏడుపు మొదలు పెట్టింది దానితో గోపాలరావుకి కంగారు ఎక్కువైంది.

"నేను ఆ రోజే చెప్పాను పల్లెటూరిలో సరైన వైద్యం అందదని సిటీకి షిఫ్ట్ అవ్వమని. మీ నాన్నగారు నా మాట వినలేదు. ఇప్పుడు చూడండి పిల్ల పరిస్థితి" కోపం, దుఃఖం కలగలిపి అంది దివ్య.

"డాడ్! పాపకు వాటర్ లెవెల్స్ తగ్గిపోతున్నాయి. డి హైడ్రేట్ అయితే కష్టం హాస్పిటల్‌కి తీసుకువెళ్లండి"



"హలో బాబూ! ఎలా ఉన్నారు?" అన్నాడు గోపాలరావు. "ఫైన్ డాడీ! మీరెలా ఉన్నారు? అమ్మ బాగుందా? స్నేహ మేలుకుని ఉందా?" అన్నాడు శంభు ప్రసాద్. "ఇప్పుడే నిద్రలోకి జారుకుంది బాబూ! ఈ రోజు ఫోన్ చేయడానికి ఇంతాలస్యం అయిందేంటి?" "రోజూ స్నేహను చూడటానికి మధ్యలో బ్రేక్ తీసుకుంటాను డాడీ! ఈ రోజు ఎమర్జెన్సీ కేసులున్నాయి, అందుకే కుదరలేదు.

అన్నాడు శంభు.

అప్పటికప్పుడు స్నేహను ఆర్మూర్ తీసుకువెళ్ళారు. బ్లడ్ టెస్ట్ చేసి తెల్ల రక్తకణాలు ఉండవలసిన దానికన్నా ఎక్కువ ఉన్నాయి. బ్లడ్లో ఇన్ఫెక్షన్ ఉందన్నారు. పాప డీ హైడ్రేట్ అయింది కాబట్టి వెంటనే సెలైన్ పెట్టాలని ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు.

స్నేహ ఒకటే ఏడుస్తోంది. అది చూసి లక్ష్మీ ఏడుపుకి అంతులేదు... గోపాలరావుకి దిక్కు తోచడం లేదు. రాత్రంతా జ్వరం తగ్గుతూ, పెరుగుతూ ఉంది. వాంతులవుతూనే ఉన్నాయి. ఇరవై నాలుగు గంటల తరువాత కాస్త జ్వర తీవ్రత తగ్గింది. కానీ మరుసటి రోజు కూడా అడపా దడపా వాంతులవుతున్నాయి. సెలైన్ పెట్టే ఉంచారు. స్నేహ నిద్ర పోయినప్పుడు మినహాయించి మేలుకుని ఉన్నంత సమయం సెలైన్ తీసేయమని ఏడుస్తూనే ఉంది. పగలు, రాత్రీ రెప్ప వేయకుండా స్నేహ చేయి పట్టుకుని లక్ష్మి, గోపాలరావు కూర్చునే ఉన్నారు.

"లక్ష్మీ! తెల్లవారింది. నువ్వు కాసేపు పడుకో! నాలుగు రోజుల నుండి నీకు తిండీ, నిద్ర లేవు"

అన్నాడు గోపాలరావు.

"నేనే కూర్చుంటాను. మీరు కాసేపు పడుకోండి" అంది లక్ష్మి.

అప్పుడే తలుపు తట్టిన శబ్దం వినిపించింది. గోపాలరావు వెళ్లి తెరిచాడు.

"శంభూ! నువ్వేనా?" ఆశ్చర్యంగా అంటున్న గోపాలరావుకి ఆ వెనుకే దివ్య కూడా కనిపించింది.

కొడుకు, కోడళ్లను చూసి లక్ష్మి కూడా నోరు తెరచింది. దివ్య ముఖంలో కోపం ఇద్దరూ గమనించారు.

"స్నేహా!" అంటూ పక్కలో కూర్చుని పిలిచింది దివ్య.

స్నేహా కళ్లు తెరచి అయోమయంగా దివ్యను చూసింది. మెల్లగా చూపు నానమ్మ వైపు తిప్పి ఏడ్చింది. లక్ష్మి గబుక్కున వచ్చి" తగ్గిపోతుంది తల్లీ, ఏడవకు" అని బుజ్జగించింది. దివ్య విసురుగా పైకి లేచింది.

"శంభూ! ఇండియా వస్తున్నట్లు చెప్పలేదేంటి?" అని ప్రశ్నించాడు గోపాలరావు.

"స్నేహాకి బాగాలేదని దివ్య గొడవ చేసింది డాడీ! అందుకే అప్పటికప్పుడు బయలుదేరాము" క్లుప్తంగా అన్నాడు శంభు.

"సరాసరి ఇక్కడికే వచ్చినట్లున్నారు. మీరిద్దరూ ఇంటికి వెళ్లిరండి" అంది లక్ష్మి.

"డాక్టర్ గారు వచ్చాక వెళ్తాము" అన్నాడు శంభు.

కాసేపటి తరువాత డాక్టర్ వచ్చి స్నేహను పరీక్షించారు. మరో రెండు రోజులు ఆస్పత్రిలోనే ఉంచాలని చెప్పారు.

"డాడీ! ఈ పరిస్థితికి కారణం మీరే! సరైన వైద్యసదుపాయాలు లేని పల్లెటూర్లో ఉండటం వల్లనే స్నేహ ఇంత అనారోగ్యానికి గురైంది" అప్పటి వరకు ఆపుకున్న మాటలను కక్కేసాడు శంభు.

"ఏం మాట్లాడుతున్నావు శంభు? నువ్వు ఏ ఊర్లో పుట్టావు... ఏ ఊర్లో పెరిగావు? చిన్న పిల్లలకు ఇలాంటివి వస్తూనే ఉంటాయి, పోతూనే ఉంటాయి. నీ చిన్నప్పుడు నీకు రాలేదా? రావలసినవి పల్లెటూరులో ఉన్నా, పట్నంలో ఉన్నా రాకమానవు. నువ్వు పెరిగింది పల్లెలోనే అని గుర్తుంచుకో" విసుక్తుపోతూ అన్నాడు గోపాలరావు.



"ఏం మాట్లాడుతున్నావు శంభు? నువ్వు ఏ ఊర్లో పుట్టావు... ఏ ఊర్లో పెరిగావు? చిన్న పిల్లలకు ఇలాంటివి వస్తూనే ఉంటాయి, పోతూనే ఉంటాయి. నీ చిన్నప్పుడు నీకు రాలేదా? రావలసినవి పల్లెటూరులో ఉన్నా, పట్నంలో ఉన్నా రాకమానవు. నువ్వు పెరిగింది పల్లెలోనే అని గుర్తుంచుకో" విసుక్తుపోతూ అన్నాడు గోపాలరావు.

"మీరు మారరు డాడీ! స్నేహ కోలుకున్నాక మేము తీసుకెళ్లిపోతాము" అన్నాడు శంభు.

"నీ ఇష్టం"

లక్ష్మి కళ్ల నిండా నీరు నింపుకుని కొడుకుని చూస్తోంది. గోపాలరావు మౌనంగా ఉండిపోయాడు. రెండు రోజుల తరువాత స్నేహను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసారు. ఇంటికి వచ్చాక లక్ష్మి కొడుకు కోడళ్లతో స్నేహను తమ దగ్గరే ఉంచమని బ్రతిమిలాడింది. కానీ వారు ససేమిరా వినలేదు. నానమ్మ, తాతయ్యల నుండి వేరుచేస్తూ ఏడుస్తున్న స్నేహతో శంభు, దివ్య పది రోజుల తరువాత అమెరికా వెళ్లిపోయారు. స్నేహ తల్లితండ్రులకు చేరిక కావడానికి ఎంత సమయం? పట్టిందో, మనవరాలికి దూరంగా బ్రతకటానికి నానమ్మ, తాతయ్యలకు అంతే సమయం పట్టింది.

స్నేహ రెండు కుటుంబాల వారధి కాబట్టి రోజూ ఫోన్లో వాళ్లతో మాట్లాడుతుంది. ఈ పదేళ్లలో రెండు సార్లు ఇండియా కూడా వచ్చి వెళ్లింది.

* * *

"దివ్యా! స్నేహ అడిగిన ప్రశ్నకు సరైన జవాబు నా దగ్గర లేదు. మొదటిసారిగా నేను తప్పు చేసాననిపిస్తుంది" గతం నుండి బయటకు వచ్చిన శంభు ప్రసాద్ అన్నాడు.

"శంభూ! స్నేహ మాటలు మీరు పట్టించుకోవద్దు. మనం ఆ పల్లెలో ఉండకుండా అభివృద్ధి చెందిన దేశంలో ఉన్నామంటే తృప్తిగా ఉన్నామనే కదా?" అంది దివ్య.

"లేదు దివ్యా! ఎంత ఆలోచించినా తృప్తికి నిర్వచనం తెలియడం లేదు. ఎంత పురోగమించినా నాలో ఏదో వెలితి కనిపిస్తుంది. అదేమిటో ఇన్నాళ్లు స్పష్టంగా తెలియలేదు. నేను కన్నఊరిని, కన్నవాళ్ల బాధ్యతను విస్మరించాను. కన్నతల్లిని బతికించుకోలేకపోయాను. కన్నవూరు రుణం తీర్చుకోలేకపోయాను. ఎంత సంపాదించి ఏమిటి ఉపయోగం? మనిద్దరం మా ఊరిలో హాస్పిటల్ పెట్టుకుంటే మా అమ్మ దక్కేది. ఎంతో మందికి మంచి వైద్యం అందించేవాళ్లం. ఆ తృప్తి ముందు ఏదయినా దిగదుడుపే! ఇక మనం తొందరలోనే పల్లెకు పోదాం!" స్థిరమైన స్వరంతో అన్నాడు శంభు ప్రసాద్.

"శంభూ! అది కాదు. నా మాట విను" ఏదో చెప్పబోయింది దివ్య.

"నువ్వు ఏది చెప్పినా ఇన్నాళ్లు విన్నాను. ఇప్పుడు నా నిర్ణయంలో ఎటువంటి మార్పుండదు" నిశ్చలంగా అన్నాడు శంభు ప్రసాద్.

"డాడీ! మీరేం నిర్ణయం తీసుకుంటారోనని భయపడ్డాను. నేను మళ్లీ నానమ్మ, తాతయ్యలతో ఉంటాను. థ్యాంక్ యూ సో మచ్!" అంటూ తండ్రి మెడ చుట్టూరా చేతులు వేసి బుగ్గ మీద ముద్దు పెడుతూ అంది స్నేహ.






వచ్చేవారం కథ..

**వసంతం**

- బి. నర్సన్



రవిశాస్త్రి

సునీల్ గవాస్కర్



విజయ్ అమృత్ రాజ్

క్రీడా వ్యాఖ్యానం కొత్తపుంతలు తొక్కుతోంది. క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్, హాకీ, బ్యాడ్మింటన్ లాంటి 'గ్లోబల్ గేమ్స్' వ్యాఖ్యాతలపై రూ.కోట్ల వర్షం కురిపిస్తోంది. ప్రపంచీకరణ పుణ్యమా అంటూ క్రీడా వ్యాఖ్యానం సైతం కోట్ల రూపాయల సంపాదనకు రాచబాటగా నిలిచింది. నిన్నటి తరం దిగ్గజ క్రీడాకారులు తమ అనుభవానికి పదునైన భాషను జోడించి చక్కటి వ్యాఖ్యానంతో అభిమానులను ఓలలాడించడమే కాదు.. బ్రాడ్ కాస్టర్లకు లాభాల పంట పండించగలుగుతున్నారు.

# క్రీడా వ్యాఖ్యానం... సంపాదనకు సోపానం!

ఒలింపిక్స్, ప్రపంచకప్ ఫుట్‌బాల్, వార్షిక గ్రాండ్ స్లామ్ టెన్నిస్ పోటీలు, ఐసీసీ ప్రపంచకప్ క్రికెట్ పోటీలు.. భారత్ వేదికగా ఏటా జరిగే ఐపీఎల్‌లో క్రీడాకారులు ఎంత ప్రధానమో.. క్రీడా వ్యాఖ్యాతలు అంతే కీలకంగా నిలిచారు. ఈ వ్యాఖ్యాతలు లేని అంతర్జాతీయ క్రీడలు లేవనడం అతిశయోక్తికాదు. ప్రపంచస్థాయిలో క్రీడలు నిర్వహించడం ఓ ఎత్తైతే.. ఆ క్రీడల విశేషాలను 200కు పైగా దేశాలలోని కోట్లాది మంది అభిమానులకు అందించడంలో క్రీడా వ్యాఖ్యాతలు ప్రధానపాత్ర పోషిస్తూ మరో ఎత్తుగా నిలుస్తున్నారు.

**ఒలింపిక్స్ నుంచి ఐపీఎల్ వరకూ...**

నాలుగేళ్లకోమారు జరిగే ప్రపంచ క్రీడల పండుగ ఒలింపిక్స్, ఆసియాక్రీడలు, ప్రపంచకప్ ఫుట్‌బాల్ పోటీలతో పాటు.. ప్రతి ఏటా జరిగే గ్రాండ్‌స్లామ్ (వింబుల్డన్, ఫ్రెంచ్, ఆస్ట్రేలియన్, అమెరికన్ ఓపెన్) పోటీలు, అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్వహించే వన్డే, టీ-20, టెస్టులీగ్ ప్రపంచ పోటీలు, భారత్ వేదికగా రెండుమాసాలపాటు ప్రతి ఏడాది నిర్వహించే ఐపీఎల్‌ను పేరు మోసిన క్రీడా వ్యాఖ్యాతలు రక్తికట్టిస్తున్నారు. క్రీడా వ్యాఖ్యానం అంటే ఆషామాషీ కాదు. చక్కటి గొంతుక, స్పష్టత, ఉచ్చారణ,వాగ్ధాటి, బహుభాషా పటిమ, క్రీడా పరిజ్ఞానంతో చేసే విశ్లేషణల సమాహారమే ఈ వ్యాఖ్యానం. పేరు మోసిన, విశ్వవిఖ్యాత క్రీడావ్యాఖ్యాతలు కొద్దిరోజులు లేదా కొద్దివారాల సమయంలోనే కోట్లరూపాయలు ఆర్జిస్తారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

**క్రీడాకారులతో సమానంగా...**

ప్రపంచస్థాయిలో జరిగే పలు రకాల క్రీడా పోటీలలో పాల్గొన్న క్రీడాకారుల కంటే క్రీడా వ్యాఖ్యాతలే ఎక్కువగా సంపాదించగలుగుతున్నారు. గ్రాండ్ స్లామ్ టెన్నిస్ పోటీల ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ భారత దిగ్గజ టెన్నిస్ క్రీడాకారుడు విజయ్ అమృత్ రాజ్ రూ.కోట్లు సంపాదించారు. తన క్రీడాజీవితంలో టెన్నిస్ క్రీడాకారుడిగా విజయ్ ఎంత ఆర్జించారో.. రిటైర్మెంట్ తరువాత తన వ్యాఖ్యాన ప్రతిభతో అంతకు మించి ఎక్కువగానే సంపాదించారు. పలువురు ప్రపంచ మేటి మాజీ టెన్నిస్ క్రీడాకారులు సైతం కామెంటేటర్లుగా రాణిస్తూ తమకత్తికి రెండు వైపులా పదును అన్నట్లుగా చెప్పకనే చెబుతున్నారు. ఫుట్ బాల్, బ్యాడ్మింటన్, హాకీ క్రీడల వ్యాఖ్యాతలు సైతం చెప్పుకోదగిన స్థాయిలోనే సంపాదిస్తున్నారు.

**క్రికెట్ వ్యాఖ్యాతలకు వద్దంటే డబ్బు!**

భారత్‌లో క్రికెట్టే మతం. భారత్‌లో ఉన్నంత మంది క్రికెట్ అభిమానులు మరే దేశంలోనూ లేరు. అంతర్జాతీయ క్రికెట్‌కు కేంద్రబిందువుగా, ప్రధాన కేంద్రంగా ఉన్న భారత్‌లో ఏటా ఐపీఎల్‌తో పాటు ఏదో ఒక ఐసీసీ ప్రపంచకప్ క్రికెట్ టోర్నీని, విదేశీ సిరీస్‌లను గత నిర్వహించడం సాధారణ విషయంగా మారింది. దీంతో క్రికెట్ వ్యాఖ్యాతలకు సైతం డిమాండ్ పెరిగింది.

ప్రపంచ క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఐపీఎల్‌ను ఆంగ్ల, హిందీ భాషలతో పాటు తెలుగు, తమిళ, బెంగాలీ భాషలలోనూ ప్రసారం చేస్తూ ఉండటంతో ప్రాంతీయ భాషలకు చెందిన వ్యాఖ్యాతలకూ 'నోటినిండా' పని దొరికినట్లయ్యింది. ప్రధానంగా ఆంగ్లభాషలో ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తున్న భారత మాజీ కెప్టెన్లు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, అనిల్ కుంబ్లే. ఎల్ శివరామకృష్ణన్, హర్ష బోగ్లేతో పాటు హిందీ భాష వ్యాఖ్యాతలు ఆకాశ్ చోప్రా, సంజయ్ మంజ్రేకర్, ఇర్ఫాన్ పఠాన్ ప్రపంచస్థాయి వ్యాఖ్యాతలుగా గుర్తింపు తెచ్చుకొన్నారు. వీరితో పాటు వివిధ దేశాలకు చెందిన ఇయాన్ బిషప్, డానీ మోరిసన్, మాథ్యూ హెడెన్, కెవిన్ పీటర్సన్, ఇయాన్ స్మిత్ ఐపీఎల్ వ్యాఖ్యాతలుగా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. సునీల్ గవాస్కర్ లాంటి అగ్రశ్రేణి వ్యాఖ్యాతలకు మ్యాచ్‌కు 6 నుంచి 10 లక్షల రూపాయల వరకూ పారితోషికం ఇస్తున్నారు. అంతగా పేరులేని కామెంటేటర్లతో పాటు.. ప్రాంతీయ భాషా వ్యాఖ్యాతలకు మ్యాచ్ కు 35వేల రూపాయల చొప్పున బ్రాడ్ కాస్టర్లు చెల్లిస్తున్నారు.

2024 సీజన్లో క్రికెట్ వ్యాఖ్యాతలు అందుకొన్న పారితోషికం మొత్తాలు చూస్తే నోరువెళ్లబెట్టక తప్పదు. కేవలం ఏడు వారాలపాటు సాగే ఐపీఎల్‌లో క్రికెట్ వ్యాఖ్యాతలుగా సునీల్ గవాస్కర్, మాథ్యూ హెడెన్, కెవిన్ పీటర్సన్, ఇయాన్ బిషప్ 4 కోట్ల 17 లక్షల రూపాయల చొప్పున, హర్షా బోగ్లే 4కోట్ల 10 లక్షలు, రవిశాస్త్రి 4 కోట్ల రూపాయలు, ఆకాశ్ చోప్రా రూ. 2 కోట్ల 92 లక్షలు, సంజయ్ మంజ్రేకర్ 2 కోట్ల 80 లక్షలు, సురేశ్ రైనా 2 కోట్ల 50 లక్షలు, హర్భజన్ సింగ్ కోటీ 50 లక్షలు, జతిన్ సప్రూ మ్యాచ్‌కు లక్షన్నర రూపాయల చొప్పున పారితోషికాలు అందుకోడం ఓ రికార్డుగా మిగిలిపోతుంది. క్రికెటర్లుగా మ్యాచ్ ఫీజులు, కాంట్రాక్టుల రూపంలో సంపాదించిన దానికంటే.. రిటైర్మెంట్ తరువాత తమ రెండో ఇన్నింగ్స్‌లో క్రికెట్ వ్యాఖ్యాతలుగా ఎక్కువ మొత్తాలలో ఆర్జించడం చూస్తే క్రికెట్టా.. మజాకానా! అనుకోక తప్పదు.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969



# మదురై మురుగన్ సన్నిధిలో.. సనాతన ధర్మానికి సాష్టాంగం

ఓ మురుగా, ఓ మురుగా, ఓ మురుగా

– నెమలి వాహనా రా రా. నీ పొడుగైన శూలంతో రా. నాకు సౌఖ్యాన్ని, సార్థకతను, కీర్తిని, మోక్షాన్ని, అర్హతను, సంపదను, ప్రాముఖ్యతను ప్రసాదించు.

– నీ భక్తులు ఇక్కడ చాలా మంది ఉన్నారు. దయచేసి వారందరికీ స్వేచ్ఛను ప్రసాదించు. అవధులెరుగని వేదాలకు అంతానివి నీవు, ఓ అసురాంతకా, కోరుకున్న రూపంలో దర్శనమిచ్చే ఓ శూలపాణి.

– వేదాల సారమై కదలిరా, ఓ శూరుడా, ఓ తేజోమూర్తి నడచిరా, చింతల సాగరాన్ని పరిహరించే శూలపాణి కదలిరా, మా అందరి చింతలను దూరము చేయగా తరలిరా..

– ఇంద్రుడి రాజధానిలో నివసిస్తున్న ఓ నా బంధువా, నాపై నీ కరుణాకటాక్షాలు కురిపించు, నీకు శరణు. శరణు నీకు ఓ సుబ్రహ్మణ్యా, అగ్నిలా అన్ని రుగ్మతలను పారద్రోలే ఓ దేవా శరణు శరణు

– ఓ ఆచార్యా, ఓ పరమేశ్వరపుత్రా, గుహలో జ్వలించే ఓ తేజోరూపమా, దయచేసి నాకు పనిని, దాని ఫలితాన్ని ఇవ్వు, ఓ దేవతల దళపతి నీకు శరణు శరణు..

(మహాకవి సుబ్రమణ్య భారతి తమిళంలో రచించిన ప్రసిద్ధ మురుగా, మురుగా అనే కవిత తెలుగులో.)

జూన్ 22న యావత్ ప్రపంచం ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం గురించిన చర్చల్లో తలమునకలై ఉన్న తరుణాన తమిళనాడులోని మదురైలో పెద్ద ఎత్తున సుబ్రహ్మణ్యస్వామి భక్తుల సమ్మేళనం జరిగింది. దాని పేరు మురుగన్ భక్తర్‌గల్ ఆన్మీగ మానాడు. హిందూ మున్నని నిర్వహించిన ఈ కార్యక్రమానికి తమిళనాడులో వేర్వేరు ప్రాంతాలకు చెందిన లక్షలాదిగా భక్తులు అత్యంత శ్రద్ధాసక్తులతో హాజరయ్యారు. వేదిక మీద ఉన్న సాధువులు, సన్యాసులకు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాష్టాంగ నమస్కారం చేయడం తమిళనాడులో రాజకీయాలకు అతీతమైన సందేశాన్ని ఇచ్చింది. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వపు నియంతృత్వ పోకడల కారణంగా స్వచ్ఛమైన సామాజిక–సాంస్కృతిక నిదర్శనంగా నిలవాల్సిన భక్తజనసంగమం మురికిపట్టిన రాజకీయ మలుపును తీసుకొంది. ద్రవిడవాదం వేర్వేరు ధర్మాలను విశ్వసించే సమ్మిళిత హిందూ సంస్కృతిని ద్వేషించడంపైనే మనుగడ సాగిస్తోంది. ఉత్తర భారతం, దక్షిణ భారతం అంటూ వేర్పాటువాద అజెండాను అమలు చేస్తుంటుంది. హిందూ సంస్కృతికి సంబంధించిన ఏదైనా కార్యక్రమం ఉందంటే చాలు ఆ కార్యక్రమాన్ని ఆపడానికి యావత్ అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దించుతుంది. అత్యవసరమైన పాలసీలను అమల్లోకి తెస్తుంది. డీఎంకే ప్రభుత్వం అదే తీరుగా ఈ కార్యక్రమానికి కూడా అవాంతరాలు సృష్టించడానికి తన అధికార పరిధిలో చేయాల్సింది అంతా చేసింది. పోలీసు యంత్రాంగాన్ని బరిలోకి దించింది. హిందూ మున్నని ఎట్టకేలకు హిందూ సంస్కృతీ మూలాలు తమిళసమాజంలో వేళ్లూనుకొని ఉన్నాయని చెప్పడం ద్వారా కార్యక్రమ నిర్వహణకు కోర్టు నుంచి ఉత్తర్వును ఆశించాల్సి వచ్చింది. మురుగన్ చేతిలోని శూలం శక్తి, సౌభాగ్యాలకు ప్రతీక. ఇదే కార్యక్రమంలో లక్షలాదిగా భక్తులు ఆరుపడై వీడు పేరిట తమిళనాడులో ఆరు మురుగన్ పర్వత క్షేత్రాలను వర్చువల్‌గా దర్శించుకున్నారు. ఈ విశేష దర్శనం సనాతన ధర్మాన్ని లేకుండా చేయాలనుకునే దుష్ట శక్తులను ధిక్కరించడంలో ఓ సంకేతంగా నిలిచింది. మురుగన్ భక్తజన సంగమం ద్వారా ద్రవిడవాదం పునాదులపై అద్దాల భవనంలో నివసిస్తూ వారసత్వపు అవినీతి రాజకీయాలను ప్రోత్సహిస్తూ, కులం, మతం, ప్రాంతం, భాష ప్రాతిపదికగా ప్రజల మధ్య శత్రుత్వాన్ని, విద్వేషాన్ని శతాబ్ద కాలంగా ఎగదోస్తున్న దుష్టశక్తులకు తమిళనాడు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి తమిళంలో ఎలుగెత్తి ఇచ్చిన సందేశం తమిళనాడులో లోతైన ప్రకంపనలను సృష్టించింది. ప్రభుత్వ నియంత్రణ నుంచి దేవాలయాలకు విముక్తి, తమిళనాడులో భక్తిపరుల ఆత్మగౌరవానికి తిరిగి ఊపిరి పోసే విధంగా హిందువుల ఐక్యతకు అనుకూలంగా భక్తజన సంగమంలో ఆమోదించిన తీర్మానాలు ప్రతిఘటనకు, పునరుత్థానానికి సంకేతంగా నిలిచాయి. హిందువుల ఐక్యత, సనాతన ధర్మం కోసం జరుగుతున్న పోరాటం రాజకీయాలకు, ప్రాంతానికి సంబంధించినది కాదు. అది జాతి మేలుకొలుపునకు సంబంధించిన పోరాటం. మహాకవి భారతి తన కవితల్లో హిమాలయాలను, గంగామాతను కొనియాడారు. తమిళుల వెండితెర వేలుపు, మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్ లాంటివారు హిమాలయ ప్రాంతంపై దాడి తమిళనాడుపై దాడితో సమానం అని బలంగా విశ్వసించారు. కైలాసం నుంచి కన్యాకుమారి వరకు ఆధ్యాత్మికత తేజస్సుతో వెలుగొందుతున్న ఈ భూమి సర్వజనుల పవిత్రతకు అంకితమైంది.

– 'ఆర్గనైజర్' నుంచి



సాధుపుంగవులకు పవన్ కల్యాణ్ సాష్టాంగ ప్రణామం




"ఏ దేశపు చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం?" అన్న ప్రశ్నకు సమాధానం అది తిరిగి తెరపైకి రావడమే. పరపీడనం సహించలేక ఏదో ఒకరోజు దేశ ప్రజలు తిరగబడతారు. తమ ఉనికిని, వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి చాటుతారు. ఇది తరతరాల చారిత్రక సత్యం. చెరిపినా చెరగదు.

దీనికి తాజా ఉదాహరణ ఇరాన్. ఒకప్పుడు పశ్చిమా ఆసియా దేశాలు భారత వర్షంలోని భూభాగాలు. దేశ, కాల, పాత్రల కారణంగా అవి తమ రూపురేఖా విలాసాలు కోల్పోయాయి. స్వధర్మంవలె స్వాభిమానం – దెబ్బతిన్న నాగు ఛాందోగ్యఉపనిషత్తు వారి మత గ్రంథం– అయిన జెండా వెస్తాకు మూలం. అలా మారడానికి వారి గురువు "జరద్రస్తు" అనే ముని కారణం. (జొరాష్ట్రియన్‌లు అగ్నిని ఆరాధిస్తారు.) ఏరస్థానీయులయిన వారిపైన మంగోలియన్లు, తురుష్కులు దాడిచేసి దురాక్రమణకు పాల్పడ్డారు. జంగిజ్‌ఖాన్, తైమూర్‌లంగ్ మతమార్పిడులకు

# చరిత్ర పునరావృత్తం – ఇరాన్ పరావృత్తం

పాములా, సమయం కోసం ఎదురుచూస్తూ, అదను కాచి, పడగ చాచి కాటు వేస్తుంది. అదే ప్రస్తుతం ఇరాన్‌లో జరుగుతున్న రాజకీయ సంక్షోభం.

*"ఆసింధు సింధు పర్యంతా*
*యస్య భారత భూమికా*
*పితృభూః పుణ్యభూమిశ్చైవ*
*సవైహిందురితి స్మృతః॥*

నేడు జనం చెప్పుకుంటోన్న ఇరాన్, అఫ్ఘానిస్తాన్ మొదలైన దేశాలు ఒకే భూమికగా వెల్లివిరిశాయి. మనుచక్రవర్తి అఖండభారత వర్షాన్ని ఏకఛత్రంగా ఏలుకున్నాడు.

ఇరానీలుగా పిలువబడుతున్న దేశ ప్రజలు ఒకప్పుడు పర్షియావాసులు ఆనాటి ఆర్యనులే ఇరానీలు. "ఓరియన్" అన్న పదం "ఆర్య" అనే సంస్కృత శబ్దం నుంచి పుట్టింది. "ఆర్యా!" అంటే ఉత్తముడు అని అర్థం. అది ఒక గౌరవవాచకం. ఏ వర్గానికి సంబంధించిన పదం కాదు. ఆర్య, ద్రావిడ విభేదాలు, ఆర్యుల దండయాత్రలు, మేధావులు చేసిన చారిత్రక తప్పిదాలకు నిదర్శనాలుగానే భావించాలి. తప్పిపోయిన కుమారులు పురిటగడ్డకు తిరిగి రావడం సహజ పరిణామం.

సింధునాగరికత వెల్లివిరిసిన ఆర్యావర్తంలోని ఒక కులీన వంశీయులు "వారుణులు", "సింధు" – "హిందు" అయినట్టుగా "వారుణ" "ఆర్యాయణ" శబ్దంగా మారింది. కుటుంబ కలహాల కారణంగా వారుణులు విడిపోయారు. అలా వలసపోయిన ఒక భాగమే పరస్తానీయులు. పరస్తానీయులు పారశీకులయ్యారు. వేషభాషలు, ఆచార వ్యవహారాలు మారాయి. కాని పేగుబంధం, జన్యుసంబంధం మారలేదు. దక్షిణాపథంలోని ఆసియా దేశాలు అగ్నిగుండాలుగా మారడానికి కారణం విదేశీ హస్తాలు. ఉచ్చారణలో "స" "హ"గా మారింది. "ఛ" "జ"గా మారింది. "ఆహుర్" అంటే పరమాత్మ. సంస్కృత శబ్దం. ఆహుర్ మజ్దా పారశీకుల దైవం. పాల్పడ్డారు. 'షా'లను తరిమి ఖొమేనీలు పీఠం ఎక్కి ఎక్కి దేశ ప్రజల్ని అణిచివేశారు. "నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం". 'షా' సంతతి షియా! షియా ముసల్మానులు నాగరీకులు, సున్నీలు మతవాదులు. వారి మధ్య పోరాటం సాగుతూనే ఉన్నది.

అఫ్ఘానిస్తాన్‌లో ఇటీవల స్త్రీలు తిరుగుబాటు చేశారు. హిజాబులు, బురఖాలు, తీసివేసి తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. బారెడు గడ్డాలు, చారెడు మీసాలు, ఆచారంగా పెంచుకున్నా, ఆంతర్యం వేరు. ఇరాన్ ప్రజలు కొత్త ప్రభుత్వం కోరుకుంటున్నారన్న మాట అసత్యం కాదు. ఇటు అమెరికా, అటు ఇజ్రాయెల్, ఇరాన్‌ను ఎడాపెడా వాయించేస్తున్నాయి. అబ్రహామీకులు; యూదులు, మహమ్మదీయులు స్వయానా అన్నదమ్ములే! ఇది మహాభారతం నాటి దాయాదిపోరాటపు చరిత్ర పునరావృత్తం అని చెప్పటానికే ఇప్పుడు అవకాశం వచ్చింది. చరిత్ర దాచినా దాగని సత్యం.

ఇరాన్ అణు ప్రధాన దేశం. జాత్యహంకారం, మతోన్మాదం ఆయా దేశాలలో రాజ్యం ఏలుతున్నది. భారత్ చేతిలో చావు దెబ్బతిన్న పాకిస్తాన్, మతం ముసుగులో తుర్కియే లాంటి దేశాలను రెచ్చగొట్టి హిజ్‌బుల్లా, హమాస్ లాంటి ఉగ్రవాద ముఠాలను ఆశ్రయించి, భారత్‌పైన పగ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నది.

గతంలో తాలిబాన్‌ను కౌగిలించుకుని దెబ్బతిన్నా బుద్ధి మారక, ఇరాన్ పంచన చేరి కుట్ర పన్నుతున్నది. రాజకీయ లబ్ధికోసం డోనాల్డ్ ట్రంప్ అసీమ్‌మునీర్ లాంటి ఐఎస్ఐ సైన్యాధిపతికి విందు ఇచ్చినా, పొందు గురించి జాగ్రత్తగానే వ్యవహరించక తప్పదు. ట్రంప్ రాజకీయం అంతుపట్టని ప్రహేళిక.

ఇంగ్లాండు దేశం నుంచి పారిపోయి "మేఫ్లవర్" అనే నౌకలో ప్రాణాలు దక్కించుకుని, బయట పడ్డ జనాభా సంతతి ఈనాటి అమెరికన్ పౌరులు, ఇంతవరకు పరదేశీయులతో నానా చాకిరీలు చేయించుకుని, ఇప్పుడు తరిమివేయడం– హెచ్1, బి1, ఎమ్, ఎఫ్, వగైరాలను ఏరిపారేయడం కూడా చరిత్ర పునరావృత్తంలోని మరొక భాగం. అమెరికాకు అమెరికన్లు, బ్రిటన్‌కు బ్రిటిషువారు ఎలాగో హిందూస్థాన్ – నేటి భారత్‌కు హిందువులు అంతేవాసులు. 82% హిందూ జనాభా ఉన్న దేశం హిందూ దేశం కాక మరేమి అవుతుంది? ఈ పరిణామాలనుబట్టి చూస్తే ప్రపంచవ్యాప్తంగా జాతీయ భావన, స్వాభిమానం, ఆభిజాత్యం మొగ్గ తొడుగుతున్నట్టు అనిపిస్తుంది. కాలం మారుతుంది. కాలానికి తగిన విధంగా ఆలోచనలు, ఆచరణలు మారటం సహజం. మూలాలు సడలకుండా కాపాడుకోవడం ధర్మం.

ఇరాన్ ప్రస్తుతం 'అగ్ని' పరీక్షకు గురి అయి 'యురేనియమ్' నిలువలను పోగొట్టుకున్నది. ఇరువైపుల నుంచి జరుగుతున్న దాడుల కారణంగా ఆర్థిక రంగానికీ తీరని అపకారం, నష్టం జరిగింది. ఇప్పట్లో కోలుకోవడం కల్ల. అయినప్పటికీ కల్లబొల్లి కబుర్లు; బీరాలు, డాంబికాలు, ఖమేనీలో ఏ మాత్రం తగ్గలేదు. హింస, కల్లోలం సృష్టించి ప్రజల దృష్టిని ఆకట్టుకోవడంవల్ల ఇక లాభం లేదు. ఇరాన్‌లో ఒకవైపు ఐశ్వర్యం, మరోవైపు పేదరికం ఆ సమాజంలో ఒక అగాధం సృష్టించింది.

పులి మీద పుట్రలా ఖమేనీ ఆధిపత్యంలో జనజీవనం అస్తవ్యస్తం అయింది. అవకాశం కోసం ఎదురుచూస్తున్న షియాలు, షా వంశీయులు, ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలగొట్టడం తథ్యం! తిరిగి ఇరాన్‌లో 'షా'ల పరిపాలన రావచ్చున్న రాజకీయ అంచనాలు అచిరకాలంలోనే సాకారం కాబోతున్నాయి. చరిత్ర ఎండిన ఎముకల గూడు కాదు. చితాభస్మం నుంచి సజీవంగా ఎగిరే 'ఫినిక్స్' పక్షిలా చరిత్ర పునరావృతం కాకమానదు.

**– నిరామయ**

# బాల జాగృతి

## భక్తాగ్రేసరులు



### రామదాసు

రామదాసు అసలు పేరు కంచర్ల గోపన్న. తెలంగాణలోని నేటి నల్లగొండ జిల్లా అంజనాపురంలో సాధారణ శకం 1620 ప్రాంతంలో జన్మించాడు. గోల్కొండ ప్రభువు తానాషా వద్ద తహసీల్దార్‌గా పనిచేశాడు. ఆయన అక్కడ మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్నల మేనల్లుడు. గోపన్న శ్రీరాముడికి గొప్ప భక్తుడు. జీవితమంతా ఆయన సేవకే అంకితం కావడం వల్ల 'భక్త రామదాసు'గా ప్రసిద్ధుడయ్యాడు. తన విచక్షణాధికారంతో, భద్రాచలం రామాలయం నిర్మాణానికి ప్రభుత్వ సొమ్ము వినియోగించాడు. ఫలితంగా తానా షా కోపాన్ని చవిచూశాడు. సుమారు పన్నెండేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాడు. కారాగారా వాసంలో కష్టాలను ఏకరవు పెడుతూ ఇష్టదైవం రాముడిపై నిందాస్తుతితో కీర్తనలు రాశారు. అవి ఆయన అపార భక్తిని, ప్రేమను చాటుతాయి. సంగీత పరంగా అత్యంత మధురంగా ఉంటాయి. ఆయన రాసిన 'దాశరథి శతకం' ఆయన రచనలో ప్రధానమైనదిగా చెబుతారు. రామలక్ష్మణులు తానాషాకు కలలో కనిపించి బంగారు నాణాలు సమర్పించి రామదాసును జైలు నుంచి విడిపించారని కథనం.

## కథ | చేజారిన అదృష్టం

వారణాసిలో ఉంటున్న కృష్ణమోహన్‌కు పురాతన కాలం నాటి పుస్తకం ఒకటి దొరికింది. అతడు ఆ పుస్తకాన్ని అటూ ఇటూ తిరగేసి ఒక పేజీ దగ్గర ఆగి చదివాడు.

గంగానది ఒడ్డున ఓ ప్రాంతంలో మహిమలున్న రాళ్లు ఉంటాయనీ, స్పర్శకు వెచ్చగా ఉండే ఆ రాళ్లతో ఏ వస్తువుని తాకినా అది బంగారంగా మారిపోతుందని అక్కడ రాసుంది. వెంటనే పుస్తకంలో రాసున్న ప్రదేశానికి వెళ్లి రాళ్ల కోసం వెతకడం ప్రారంభించాడు.

ఒక్క రాయి దొరికినా తన జీవితం మారిపోతుందనే ఆశ అతడిది. నది ఒడ్డున వారం రోజులు వెతికినా విలువైన రాయిని గుర్తించలేకపోయాడు. అయినా అతడు వెతుకుతూనే ఉన్నాడు. రెండు వారాలు గడిచాయి. రాయి జాడ కనిపెట్టలేకపోయాడు. కృష్ణమోహన్ ఎంతో నిరాశచెందాడు.



## పద్యం

**మానఘనుడాత్మ ధృతిసెడి**
**హీనుండగువాని నాశ్రయించుట యెల్లన్**
**మానెడు జలముల లోపల**
**నేనుగు మెయి దాచినట్టు లెరుగుము సుమతీ!**

**భావం :** మంచి మనసు గలవారు కూడా ఒక్కోసారి పరిస్థితుల ప్రభావంతో ఒక నీచుడిని ఆశ్రయించ వలసివస్తుంది. అలా ఆశ్రయించటం అంటే పెద్ద శరీరం కల ఏనుగు... రెండుసేర్ల నీటిలో తన శరీ రాన్ని దాచాలని ప్రయత్నించడం వంటిదని గ్రహించాలి.

## శ్లోకం

**అజ్ఞాన తిమిరాంధస్య**
**జ్ఞానాంజన శలకయా**
**చక్షురున్మీలితం యేన**
**తస్మై శ్రీ గురవే నమః**

**భావం :** అజ్ఞానమనే చీకటిని జ్ఞాన అంజనతో నిండిన శలాక (కాటుక దిద్దుకొనే పుల్ల)తో దిద్ది కన్నులు తెరిపించే (జ్ఞానభిక్ష పెట్టే) గురువుకు వందనం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| అజంతా గుహలు | మధ్యప్రదేశ్ |
| ఖజురహో కట్టడాలు | కర్ణాటక |
| హంపీ కట్టడాలు | తమిళనాడు |
| బృహదీశ్వరాలయం | కర్ణాటక |
| పట్టడక్కల్ కట్టడాలు | మహారాష్ట్ర |

**జవాబులు :** అజంతా గుహలు–మహారాష్ట్ర; ఖజురహో కట్టడాలు–మధ్యప్రదేశ్; హంపీ కట్టడాలు–కర్ణాటక; బృహదీశ్వరాలయం–తమిళనాడు; పట్టడక్కల్ కట్టడాలు–కర్ణాటక

శాస్త్రవేత్తలు

నిర్వహణ : నయనశ్రీ



## టెస్సీ థామస్

ఈమె 1963లో కేరళలో జన్మించారు. భారత మిస్సైల్ మహిళగా పేర్కొంటారు. అగ్ని-IV, V, VII క్షిపణుల రూపకల్పనలో కృషి చేశారు. ప్రస్తుతం ఈమె రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)లో ముఖ్య శాస్త్రవేత్తగా పనిచేస్తూ, అనేక కీలక క్షిపణులను పర్యవేక్షిస్తున్నారు. టెస్సీ థామస్ లాల్‌బహుదూర్ శాస్త్రి జాతీయ అవార్డు అందుకున్నారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో మొదటి పత్రిక ఏది?
2. మలేషియా దేశపు ప్రాచీన నామం ఏది?
3. భారతదేశంలో అతిపెద్ద నౌకాశ్రయం?

జవాబులు : 1. బెంగాల్ గెజిట్, 2. మలయా, 3. ముంబయి డాక్‌యార్డ్.



ఒక్కో రాయిని తాకి చూసి అది వెచ్చగా లేకుంటే కోపంతో నదిలోకి విసిరేస్తుండేవాడు. చివరికి అతడికది అలవాటుగా మారింది. వెతగ్గా వెతగ్గా ఓ రోజు మహిమలున్న వెచ్చని రాయి అతడి చేతికి దొరికింది. ఆ వెచ్చదనాన్ని గుర్తించేలోపే అలవాటు ప్రకారం రాయిని విసిరేశాడు. రాయి చేతి నుంచి జారిపోయే ఆఖరు క్షణంలోగానీ అతడా విషయాన్ని గమనించలేదు. అప్పటికే జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. కృష్ణమోహన్ శ్రమంతా వృథా అయిపోయింది. ★

## మెదడుకు మేత

తోలు నలుపు,
తింటే పులుపు..
ఏమిటది?

జవాబు : చింతపండు

## మంచిమాట

మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించడం చాలా కష్టం. ఆ ఛాయలు ఎంతో కొంత మనలో కూడా ఉంటేనే అది సాధ్యం




# వారఫలాలు

07-13 జూలై 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆత్మీయులు, శ్రేయోభిలాషుల నుంచి పిలుపు. నిరుద్యోగులకు అనుకోని ఉపాధి అవకాశాలు. విద్యార్థులు ప్రతిభను చాటుకుని గుర్తింపు పొందుతారు. శుభకార్యాల నిమిత్తం ప్రయాణాలు. వ్యాపారాలలో కొత్త భాగస్వాములు తోడవుతారు. ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. పారిశ్రామిక వేత్తలు నూతనోత్పత్తుల దిశగా వ్యూహాలు రూపొందిస్తారు. 7,8 తేదీల్లో దుబారా ఖర్చులు. మానసిక అశాంతి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

మీ నిర్ణయాలు అందర్నీ మెప్పిస్తాయి. ఆదాయం ఆశించినంతగా సమకూరి అవసరాలు తీరతాయి. నేర్పుతో సమస్యల నుంచి బయటపడతారు. ధార్మిక కార్యక్రమాలపై ఆసక్తి. కొత్త ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహవంతంగా గడుస్తుంది. 9,10 తేదీల్లో అలసట, బంధువులతో తగాదాలు. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు తొలగుతాయి. అనుకున్న రాబడి దక్కినా అదనపు ఖర్చులు. ఇంటిలో శుభకార్యాల సందడి నెలకొంటుంది. బంధువులతో విభేదాలు తొలగుతాయి. ఉద్యోగాలలో కోరుకున్న మార్పులు ఉండవచ్చు. పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం. రచయితలు, క్రీడాకారులకు విశేష ఆదరణ పొందుతారు. 12,13 తేదీల్లో వైద్యసేవలు, మానసిక ఆందోళన. ఆంజనేయ దండకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఇంటిలో శుభపరిణామాలు. వాహనయోగం. కోర్టు వ్యవహారాలు కీలక దశకు చేరతాయి. వ్యాపారులు భాగస్వాములను పెంచుకుంటారు. అలాగే, క్రయవిక్రయాలు మరింత ఊపందుకుంటాయి. రాజకీయవేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. వైద్యులు, కళాకారులు అనుకున్న అవకాశాలు దక్కించుకునే దిశగా ముందుకు సాగుతారు. 11,12 తేదీల్లో అనారోగ్యం, మానసిక ఆందోళన. శ్రమాధిక్యం. నృసింహ స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్యంపై కొంత శ్రద్ధ. వ్యాపారాలు కొత్త భాగ స్వాములు, పెట్టుబడులతో కళకళలాడతాయి. ఉద్యోగుల సేవలు గుర్తింపు. పారిశ్రామికవేత్తలు ఉత్పత్తులపై దృష్టి సారిస్తారు. కళాకారులు, రచయితలు, రాజకీయవేత్తల యత్నాలు సఫలం. 9,10 తేదీల్లో వైద్యసేవలు, దూర ప్రయాణాలు ఉండవచ్చు. శివాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

నిరుద్యోగులకు భవిష్యత్తుపై భరోసా ఏర్పడుతుంది. ఇంటిలో శుభకార్యాల నిర్వహణపై దృష్టి సారిస్తారు. బంధువులతో బాంధవ్యాలు మెరుగుపడతాయి. పారిశ్రామికవేత్తలు అనుకున్న పెట్టుబడులతో ఉత్సాహంగా సాగుతారు. రాజకీయవేత్తలు, కళాకారులు అనుకున్నది సాధిస్తారు. 11,12 తేదీల్లో లేనిపోని ఖర్చులు. మనశ్శాంతి లోపం. ఆకస్మిక ప్రయాణాలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

దూరపు బంధువులు మీపై ఉంచిన బాధ్యతలు నిర్వహించేందుకు శ్రమిస్తారు. ఉద్యోగాలలో ఇష్టంలేని మార్పులు జరిగే వీలుంది. పారి శ్రామిక వేత్తలకు ప్రభుత్వసంస్థల ఇబ్బందులు ఎదురుకావచ్చు. రచయితలు, క్రీడాకారులకు అవకాశాలు చేజారి నిరాశ కలిగిస్తాయి. 9,10 తేదీల్లో వస్తు లాభాలు. ఉద్యోగలాభం. యత్నకార్యసిద్ధి. కనక దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

రుణబాధల నుంచి కొంత విముక్తి. విద్యార్థులకు మరింత వెసులుబాటు కలుగుతుంది. వాహనాలు, భూములు కొనుగోలు యత్నాలు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపారాలు వైద్యులు, రచయితలు, కళాకారులు సత్తా చాటుకునేందుకు అవకాశం. 12,13 తేదీల్లో అనారోగ్యం, వైద్యసేవలు, తండ్రి తరఫు వారితో కలహాలు. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆదాయం సమృద్ధిగా ఉన్నా ఖర్చులు కూడా పెరుగుతాయి. నిరుద్యోగుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించే సమయం. ఉద్యోగాలలో మీ సమర్థత పైస్థాయి వారు గుర్తిస్తారు. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, నూతన కంపెనీల ఏర్పాటులో విజయం. రాజకీయ వేత్తలు, కళాకారులకు విదేశీ పర్యటనలు. 7,8 తేదీల్లో శారీరకపరమైన రుగ్మతలు, దూరప్రయాణాలు, వ్యయప్రయాసలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మధ్యలో కొద్దిపాటి చిక్కులు కలిగినా అధిగమిస్తారు. ఉద్యోగులకు మంచి కాలమనే చెప్పాలి, కోరుకున్న బదిలీలు పొందుతారు. పారిశ్రామికవేత్తలు, సాంకేతికరంగాల వారు విజయాల బాటలో సాగుతారు. కళాకారులకు అవకాశాలు దగ్గరకు వస్తాయి. విద్యార్థులు అనుకున్న ఫలితాలు పొందుతారు. 11,12 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. ప్రయాణాలు వాయిదా. లక్ష్మీనృసింహ కరావలంబం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

నిరుద్యోగులకు అవకాశాలు. విద్యార్థుల అంచనాలు నిజం. నూతన పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. వ్యాపారాలు మరింతగా అనుకూ లిస్తాయి. కొత్త భాగస్వాములతో ఒప్పందాలు. ఉద్యోగాలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వైద్యులు, పారిశ్రామిక వేత్తలకు విదేశీ పర్యటనలు, క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు ఆహ్వానాలు రాగలవు. 11,12తేదీల్లో శారీరక రుగ్మతలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

నూతన వ్యక్తులు పరిచయం కాగలరు. నిర్ణయాలలో మరింత చురుగ్గా వ్యవహరిస్తారు. వ్యాపారాలలో తగాదాలు పరిష్కారం, మీ పట్టుదల, క్రమశిక్షణ వల్ల మరింత విస్తృతమవుతాయి. ఉద్యోగాలలో ప్రతిభను చాటుకుంటారు. పారిశ్రామికవేత్తలకు ఊహించని విధంగా విదేశీయానం. వైద్యులు, కళాకారులు పట్టుదలతో ఆశించిన ఫలితాలు సాధిస్తారు. 12,13 తేదీల్లో వృథా ఖర్చులు. బంధువిరోధాలు. శ్రమాధిక్యం. విష్ణుధ్యానం మంచిది.

# పదరసం - 521

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | ■ | 3 | 4 | ■ | 5 | 6 | |
| 7 | | ■ | ■ | 8 | | 9 | ■ | | ■ |
| ■ | | ■ | 10 | | ■ | 11 | 12 | ■ | 13 |
| 14 | ■ | 15 | | ■ | 16 | ■ | 17 | | |
| 18 | | | ■ | ■ | 19 | 20 | | ■ | |
| | ■ | 21 | 22 | 23 | ■ | 24 | | | ■ |
| ■ | 25 | ■ | 26 | | | ■ | | ■ | 27 |
| 28 | | 29 | ■ | | ■ | 30 | ■ | 31 | |
| | ■ | 32 | | ■ | 33 | | | | |
| ■ | 34 | | ■ | 35 | | | ■ | 36 | |

## ఆధారాలు

**అడ్డం**

1. మంచి కవి (3)
3. కుప్ప, పోగు (2)
5. ఆయన ఆజ్ఞకు తిరుగులేదట (3)
7. సమూహం, గుంపు (2)
8. చందమామే...(3)
10. సయోధ్య (2)
11. బలిమి..(2)
15. పట్టణమే..మరోలా (2)
17. ఉపదేశం, జ్ఞానం (3)
18. జనసమూహం (3)
19. ఐశ్వర్యం (3)
21. పళ్లెం, భోజనపాత్ర (3)
24. శ్రీమహావిష్ణువు వాహనం (3)
26. విడిది చెల్లాచెదురు (3)
28. దీనితో తల గోక్కోవడం ఎందుకు? (3)
31. నెపం, కారణం (2)
32. కంచి ఈ చీరలకు ప్రసిద్ధి (2)
33. సరాసరి (3)
35. రెండు వారాలు (2)
34. శివయ్యకు ఇష్టమైన దళం (3)
35. శపథం (2)

**నిలువు**

1. పువ్వు (2)
2. చలనం, ప్రయత్నం (3)
3. రాజగోపాలాచారిని ఇలానూ అంటారు (3)
4. మహాదాతల్లో ఒకరు (2)
6. రెండవ రుతువు (2)
9. గోడమీది ప్రాణి తిరగబడింది (2)
10. నూలు వడికే సాధనం (2)
12. వినాయకుడే...పెద్ద పొట్టతో... (5)
13. పుట్టుక (3)
14. విభీషణుడి కుమార్తె (3)
15. విజేతకు ఇచ్చేది..మెడల్ (3)
16. ఏడాదిలో పన్నెండో భాగం (2)
20. కక్ష (2)
22. రుచి (2)
23. స్త్రీ...సంతోషం (3)
25. వెల, మూల్యం (2)
27. విరటుని కొలువులో ధర్మజుని పేరు (4)
28. నూతన (2)
29. స్వపక్షం కాదు... (3)
30. భర్తే (3)
33. అలాగే...(2)

## పదరసం - 520 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 వృ | క్ష | 2 ము | ■ | 3 అ | 4 కా | లం | ■ | 5 క | పి |
| కం | ■ | 6 ది | ట్ట | ■ | మా | ■ | 7 పె | న్న | ■ |
| ■ | 8 సా | మి | ■ | 9 మీ | క్షి | 10 నా | ■ | 11 య్య | 12 అ |
| 13 తీ | రం | ■ | 14 కా | రా | ■ | 15 గి | రి | ■ | ర |
| పి | ■ | 16 మే | ను | ■ | 17 హా | ని | ■ | 18 మే | టి |
| ■ | 19 వి | ■ | 20 క | 21 సీ | సం | ■ | 22 పూ | లు | ■ |
| 23 అ | న్న | య్య | ■ | ర | ■ | 24 మా | త | ■ | 25 అ |
| ■ | పా | ■ | 26 పా | దం | ■ | 27 మ | న | 28 సా | ర |
| 29 నా | లు | 30 క | ■ | ■ | 31 రో | య్య | ■ | పా | ■ |
| తి | ■ | 32 ల | క్ష్యం | ■ | ద | ■ | 33 కా | టు | క |

సినిమా



కొన్నేళ్లుగా మంచు మోహన్ బాబు, ఆయన కుమారుడు విష్ణు, కన్నప్పపై సినిమాను నిర్మించాలని తపన పడ్డారు. కన్నప్పపై తెలుగులో ఇప్పటికే రెండు సినిమాలు వచ్చాయి. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ నటించిన 'బేదర కన్నప్ప'ను తెలుగులో 'కాళహస్తి మహాత్యం' పేరుతో 1955లో రీమేక్ చేశారు. అది మంచి విజయం అందుకుంది. దాని ఆధారంగానే కృష్ణంరాజు కథానాయకుడిగా బాపు 'భక్త కన్నప్ప' (1976)గా తెరకెక్కించారు. ఇదీ చక్కని ప్రేక్షకాదరణ పొందింది. ఈ నేపథ్యంలో ఇలాంటి భక్తిరస ప్రధాన చిత్రానికి ఈ తండ్రీ కొడుకులు ఏ మేరకు న్యాయం చేస్తారనే సందేహం చాలా మందికి కలిగింది. నిజానికి భక్త కన్నప్పపై సినిమా రూపొందించాలని నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి సైతం ఒకానొక సమయంలో తీవ్రంగా ప్రయత్నించి, ఆ ఆలోచన విరమించుకున్నారు. చివరకు మంచు విష్ణు టైటిల్ రోల్ పోషించగా, మోహన్ బాబు నిర్మించిన 'కన్నప్ప' పలు వార్లు వాయిదా పడుతూ జూన్ 27న విడుదలైంది.

# కనికరించిన KANNAPPA

కన్నప్ప కథ గురించి అందరికీ తెలిసిందే. భక్తి భావనకు దూరంగా ఉండే బోయవాడైన కన్నప్ప ఆ తర్వాత శివ భక్తుడిగా ఎలా మారాడు? తన భక్తిని నిరూపించుకోవడానికి రెండు కళ్లను ఎలా దానం చేశాడు? తద్వారా ఎలా ముక్తిని పొందాడు? అని పురాణ గాథ. అయితే కన్నప్ప గాథను తెరకెక్కించే ప్రయత్నంలో ఎవరి అనుకూలతను బట్టి వారు దాన్ని మార్చుకుంటూ వెళ్లారు. ఇప్పుడూ అదే జరిగింది. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన తిన్నడు (మంచు విష్ణు)ను తండ్రి నాథనాథుడు (శరత్ కుమార్) ప్రేమగా పెంచుతాడు. అయితే తమ గూడెంలోని అమ్మవారికి నరబలి ఇవ్వడాన్ని చిన్నప్పుడే తిన్నడు తిరస్కరిస్తాడు. అతని మాటలు ఎవ్వరూ ఆలకించక పోవడంతో అతను నాస్తికుడిగా మారిపోతాడు. అదే అడవిలో బోయతో పాటు మరో మూడు కొండ జాతుల మనుషులు నివసిస్తూ ఉంటారు. అందులోని భద్రగణం గూడెంలోని వాయులింగానికి మహాదేవ శాస్త్రి (మోహన్ బాబు) రహస్యంగా పూజలు చేస్తుంటాడు. దివ్య శక్తులు కలిగిన ఆ వాయు లింగాన్ని ఎలాగైనా తస్కరించాలని కిరాతకుడైన కాలముఖుడు (అర్పిత్ రాంక) ప్రయత్నిస్తాడు. అతన్ని ఎదుర్కోవడానికి కొండ జాతులను ఏకం చేసి జరిపే పోరాటంలో నాథనాథుడు మరణిస్తాడు. తండ్రి మరణానికి కారకుడైన కాలముఖుడిని తిన్నడు హతమారుస్తాడు. తిన్నడిని ప్రేమించి పెళ్లి చేసుకున్న నెమలి (ప్రీతి ముకుందన్)కి వాయులింగాన్ని దర్శించాలని కోరికగా ఉంటుంది. కానీ దేవుడిని నమ్మని తిన్నడు అందుకు అంగీకరించడు. అలాంటి అతని జీవితం మహాశివరాత్రి రోజున ఎలాంటి మలుపు తిరిగింది? అతను పరమశివుడి భక్తుడిగా ఎలా మారాడు? అనేది ఈ సినిమా.

చరిత్రను, పురాణాలను తెరకెక్కించే సమయంలో మన దర్శక నిర్మాతలు చెప్పే మాట 'క్రియేటివ్ ఫ్రీడమ్'ను ఈ సినిమాకు బాగానే వాడుకున్నారు. కన్నప్పపై గత చిత్రాలలో తిన్నడి నాస్తికత్వాన్ని ఒకలా చూపితే ఇందులో నరబలిని నిరసిస్తూ అతను నాస్తికుడు అయినట్టు చూపించారు. మూడు గంటల నిడివి గల ఈ సినిమాలో మొదటి రెండు గంటలు తిన్నడి సాహస కృత్యాలు, ప్రేమాయణం చుట్టూనే సాగుతాయి. అడవిలోని నాలుగు కొండ జాతుల మధ్య వైరం, ఆ తర్వాత వారంతా కలిసి కాలముఖుడిపై చేసే యుద్ధం.. ఈ సన్నివేశాలన్నీ భారంగా సాగుతాయి. భక్తి ప్రధాన చిత్రం చూద్దామని వస్తే యాక్షన్ సినిమా చూపిస్తున్నారేమిటనే అసహనానికి ప్రేక్షకులు లోనవుతారు. నిజానికి రెండు గంటల తర్వాతే అసలు కథ మొదలవుతుంది. మహాశివుడు తన దూత అయిన రుద్ర (ప్రభాస్)ను తిన్నడి వద్దకు పంపిన దగ్గర నుండి సినిమా ఆసక్తికరంగా మారుతుంది. ఇటు మహాదేవ శాస్త్రిలోని అహంకారాన్ని తొలగిస్తూ, అటు నెమలి ఆలోచనల్ని మారుస్తూ, ప్రధానంగా తిన్నడిని భక్తి మార్గం వైపు మళ్లించి రుద్ర పాత్రను మలిచిన తీరు చాలా బాగుంది. అక్కడ నుండి మరో అరగంట పాటు సాగే సినిమా వారిని కట్టిపడేస్తుంది.

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యంలోని అంశాలతో పాటు భారవి రాసిన 'కిరాతార్జునీయం'ను కూడా ఈ సినిమాలో వాడుకున్నారు. ద్వాపర యుగం నాటి అర్జునుడే మోక్షం కోసం తిన్నడిగా జన్మించినట్టు చూపించారు. గతంలో హిందీలో పలు భక్తిరస ధారావాహికలను రూపొందించిన ముఖేష్ కుమార్ సింగ్ 'కన్నప్ప' సినిమాను డైరెక్ట్ చేశారు. సినిమా ప్రారంభమే శివపార్వతుల (అక్షయ్ కుమార్, కాజల్) సంభాషణతో మొదలవుతుంది. విశ్రాంతికి ముందు మోహన్‌లాల్‌ను కిరాతార్జునీయం ఎపిసోడ్ లో ప్రవేశ పెట్టారు. ఇక ప్రీ క్లయిమాక్స్ సమయానికి ప్రభాస్ పాత్రను తీసుకొచ్చారు. ఆ రకంగా ప్రత్యేక పాత్రలు పోషించిన ప్రముఖ నటీనటులను చక్కగా వాడుకున్నారు.

నటీనటుల విషయానికి వస్తే మోహన్ ఈ వయసులోనూ మహాదేవశాస్త్రి పాత్రను బాగా పోషించారు. తిన్నడు, అతని భార్య నెమలి ఆహార్యం విషయంలో చాలానే అభ్యంతరాలు ఉన్నాయి. ఈ సినిమా అన్ని వర్గాలను అలరించాలనే కోరికతో వారిద్దరి మధ్య పాటలు బలవంతంగా పెట్టింది. యాక్షన్ సన్నివేశాలు కూడా ఆ కోవకే వస్తాయి. అయితే పతాక సన్నివేశంలో మంచు విష్ణు నటనలో కొంత పరిణతి కనిపించింది. నాథనాథుడి పాత్రను శరత్ కుమార్ చక్కగా పోషించాడు. ఇందులో మంచు విష్ణు పిల్లలు నలుగురూ తెర మీద కనిపిస్తారు. కవలలైన అరియానా, వివియానా ఓ పాటలో ఉన్నారు. ఆ పాట, వారి హావభావాలు బాగున్నాయి. బాల తిన్నడిగా నటించిన విష్ణు కొడుకు అవ్రామ్ వాయిస్ దారుణంగా ఉంది. ఆ పాత్రకు డబ్బింగ్ చెప్పించాల్సింది. అలానే శివపార్వతుల సంభాషణలు తెలుగులో వింటుంటే టీవీలో డబ్బింగ్ హిందీ డివోషనల్ సీరియల్ చూసిన భావన కలుగుతుంది. గ్రాఫిక్స్ అయితే చాలా చోట్ల చికాకు తెప్పిస్తాయి. ఇతర ప్రధాన పాత్రలను మధుబాల, ముఖేష్ రిషి, కౌశిక్, శివ బాలాజీ, రఘుబాబు, ఐశ్వర్య, బ్రహ్మానందం, సప్తగిరి, బ్రహ్మాజీ, సురేఖవాణి, దేవరాజ్, అర్పిత్ రాంకా తదితరులు పోషించారు. స్టీఫెన్ దేవస్సి స్వరాలు, వాటికి సుద్దాల అశోక్ తేజ, రామజోగయ్య శాస్త్రి, శ్రీమణి సమకూర్చిన సాహిత్యం బాగుంది. ఆకెళ్ల శివప్రసాద్ మాటలు హృదయానికి హత్తుకునే ఉన్నాయి. షెల్డన్ చౌ సినిమాటోగ్రఫీ బాగుంది. భక్తిరస ప్రధాన చిత్రాలు నిర్మించడానికి ఎవరూ పెద్దంతగా సాహసించని ఈ సమయంలో 'కన్నప్ప' లాంటి సినిమా రావడం విశేషమే.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.300/-




వెల : ₹.100/-




వెల : ₹.400/-




వెల : ₹.200/-



వెల : ₹.200/-




వెల : ₹.499/-




వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.300/-




వెల : ₹.525/-




వెల : ₹.499/-




వెల: PB ₹.549/-




వెల :₹.450/-




వెల : ₹.399/-




వెల : ₹.125/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 37




**మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,**
**ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను**
**జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.**
**జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై**
**మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.**
**రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్**
**చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.**

**www.youtube.com/@Jagrititv**

చెప్పండి మెచ్చండి పంచండి

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01